veluturu telugu daily

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | శుక్రవారం 9.10.2026
సంపుటి : 9 | సంచిక : 117

www. veluturu.com

వరద ముప్పు.. హైడ్రా చెక్

రంగంలోకి దిగిన హైడ్రా మెట్.. డీఆర్ఎఫ్ బృందాలు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్
- ఫతేనగర్లో నాలా పూడికతీత పనులు
- లారీల కొద్దీ తొలగింపు

- వివరాలు 12 లో..

మోదీ గద్దె దిగు..

లేకుంటే ప్రజలే దింపుతారు

- జనాభా 140 కోట్లు దాటితే 13 కోట్ల ఓట్ల గల్లంతు ఎలా?
- దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్ల తొలగింపు వెనుక భారీ కుట్ర
- ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించలేవు
- ఓటు బచావో... దేశ్ బచావో ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఢిల్లీ, వెలుతురు:

ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని ఏమాత్రం రక్షించలేవన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే భర్తరఫ్ చేయాలని సీఎం డిమాండ్ చేశారు. అలా చేయకుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన గద్దెను ఖాళీ చేయాలని, లేకపోతే ప్రజలే ఆయనను గద్దె దించుతారని సీఎం అన్నారు. ఓటు బచావో... దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండియా కూటమి నేతలు గురువారం మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. రాజ్‌ఘాట్ వద్ద నివాళుల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఓటు బచావో... దేశ్ బచావో ఉద్యమం కాంగ్రెస్ పార్టీ పోరాటం కోసమో, ఇండియా కూటమి కోసమో కాదని, దేశంలోని సామాన్యుల హక్కుల పరిరక్షణ ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2014 ఎన్నికల నాటికి దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉంటే, 2019 నాటికి ఆ సంఖ్య 91 కోట్లకు చేరిందని సీఎం గుర్తుచేశారు. 2024 నాటికి 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని సీఎం తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు చేరుకుందని, ఓటర్ల సంఖ్య మరింతగా పెరగాల్సింది పోయి ఏకంగా 13 కోట్ల ఓట్ల గల్లంతు అయ్యాయని, అవి ఎలా తగ్గిపోయాయో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్ సింగ్

- మిగతా 2 లో..

ఒక్క రోజులోనే..

10.52 లక్షల కోట్లు ఆవిరి!

సెన్సెక్స్ 1,045 పాయింట్ల పతనం..

విదేశీ నిధుల వెనక్కి మళ్లింపు

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత ఈక్విటీల్లో వరుసగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. బుధవారం ఒక్క రోజే వారు రూ. 6,121 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించగా, గురువారం కూడా మార్కెట్‌పై అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. గత తొమ్మిది రోజుల్లో విదేశీ పెట్టుబడిదారుల నికర అమ్మకాలు దాదాపు రూ. 46,990 కోట్లకు చేరాయి.

దేశీయ స్టాక్ మార్కెట్‌లో గురువారం భారీ పతనం చోటుచేసుకుంది. ఒక్కరోజు అమ్మకాల వెల్లువతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ నుంచి ఏకంగా రూ.10.52 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. బుధవారం ముగింపులో రూ.472.35 లక్షల కోట్లుగా ఉన్న మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.461.84 లక్షల కోట్లకు పడిపోయింది. మరోవైపు ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,045.46 పాయింట్లు కోల్పోయి 71,593.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 371.25 పాయింట్లు పతనమై 22,231.80 వద్ద స్థిరపడింది.

- నిఫ్టీ 1.64 శాతం డౌన్
- చమురు ధరల సెగ.. ఆర్‌బీఐ వడ్డీ పెంపు
- విదేశీ నిధుల ఉపసంహరణతో అమ్మకాల వెల్లువ

ముంబై, వెలుతురు:

మార్కెట్ పతనానికి ప్రధానంగా ముడిచమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడిదారుల నిరంతర అమ్మకాలు, అమెరికా బాండ్ రాబడులు పెరగడం, రూపాయి బలహీనపడటం, ఆర్‌బీఐ వడ్డీ రేటు పెంపు వంటి అంశాలు కారణమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో దేశీయ పెట్టుబడిదారులు కూడా అప్రమత్తమయ్యారు. సాధారణంగా మార్కెట్ విలువ రూ. 10.52 లక్షల కోట్లు తగ్గిందంటే అంత మొత్తంలో నగదు మార్కెట్ నుంచి బయటకు వెళ్లిపోయిందని అర్థం కాదు. షేర్ల ధరలు పడిపోవడంతో వాటి మొత్తం విలువ తగ్గింది. అయితే షేర్లు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి తమ పెట్టుబడుల ప్రస్తుత విలువలో గణనీయమైన తగ్గుదల

- మిగతా 2 లో..

తెరపై తుఫాను..

జీవితంలో మానవత్వం

నానా పటేకర్ మృతి..

ముగిసిన ఓ విలక్షణ నట ప్రస్థానం

ప్రముఖ బాలీవుడ్, మరాఠీ నటుడు నానా పటేకర్ కన్నుమూశారు. ఆయన వయసు 75 సంవత్సరాలు. గురువారం తెల్లవారుజామున గోవాలోని డోనా పౌలా నివాసంలో అస్వస్థతకు గురైన ఆయనను మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పునరుజ్జీవన ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కార్డియాక్ అరెస్ట్‌తో ఆయన మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. నానా పటేకర్ కుమారుడు మల్హార్ కూడా మరణాన్ని ధ్రువీకరించారు.

- ముంబై, వెలుతురు

రంగస్థలం నుంచి వెండితెరకు..

విశ్వనాథ్ పటేకర్‌గా జన్మించిన నానా.. రంగస్థలం ద్వారా నటనలోకి అడుగుపెట్టి 1978 లో 'గమన్'తో సినీ ప్రయాణం ప్రారంభించారు. 'పరిందా', 'క్రాంతివీర్', 'ప్రహార్', 'ఖామోషీ', 'సలామ్ బాంబే!', 'అబ్ తక్ ఛప్పన్', 'నటసామ్రాట్', 'వెల్‌కమ్' వంటి చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. గంభీరమైన స్వరం, సహజమైన నటన, శక్తివంతమైన సంభాషణలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. దాదాపు

- మిగతా 2 లో..

మానవీయ విలువలతో కూడిన

జైలు వ్యవస్థ అవసరం

- జైలు పరిపాలనలో టెక్నాలజీ కీలక పాత్ర
- జైలు పరిపాలనలో మహిళా అధికారుల పాత్ర ప్రత్యేకం
- ఖైదీల మానవీయ, మానసిక, సామాజిక అవసరాలను పరిగణలోకి తీసుకోవాలి
- ఖైదీలకు జైలు అధికారులు మార్గదర్శకులుగా వ్యవహరించాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

భోపాల్, వెలుతురు:

మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చే జైలు వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జైలు పరిపాలనలో మహిళా అధికారుల పాత్ర ప్రత్యేకమైనదని, సాంకేతికత భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని పోలీస్ రీసెర్చ్ అండ్

- మిగతా 2 లో..

జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు

కాపాడాలి

- పన్ను మోసాలపై కఠిన చర్యలు
- నిజాయితీ పన్నుదారులకు సులభమైన విధానం
- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనాలపై మంత్రుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన

2

చలో లోక్‌భవన్ ముట్టడి

ఉద్రిక్తం

- పీసీసీ అధ్యక్షుడు, మంత్రుల అరెస్టు
- ఓటర్ల జాబితాలో అక్రమాలపై నిరసన
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్

హైదరాబాద్, వెలుతురు:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అక్రమాలు జరిగాయంటూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం 'చలో లోక్‌భవన్' కార్యక్రమం నిర్వహించారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు, తెలంగాణ జన సమితి, ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ర్యాలీ

నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమైంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

- మిగతా 2 లో..

సింగరేణి సమస్యలపై ప్రత్యక్ష పోరాటం

- రామగుండంలో ఈనెల 14న 'సింగరేణి కార్మిక గర్జన'
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, వెలుతురు:

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు రామగుండంలో నిర్వహించే 'సింగరేణి కార్మిక గర్జన' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్, సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని ఆరోపించారు. కార్మికులే కాకుండా అధికారులు కూడా నడిరోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. లాభాల్లో పూర్తి వాటా అందించాలని, డిపెండెంట్ ఉద్యోగాల కోసం మెడికల్ బోర్డులు నిర్వహించి అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని, వెంటనే సింగరేణి ఎన్నికలు

- మిగతా 2 లో..

రైతులకు యంత్ర సాయం

- వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రారంభానికి రాష్ట్రం సిద్ధం
- రాష్ట్ర, కేంద్ర వాటాలతో పథకం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- చిన్న సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు

2

ప్రతి ఇంటా బతుకమ్మ సంబరం

- ప్రతి ఆడబిడ్డ ఆనందంగా బతుకమ్మ జరుపుకోవాలి
- పండుగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి: మంత్రి సీతక్క

12

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు మంత్రి పొన్నంకు ఆహ్వానం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 08: శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని వివిధ దేవాలయాల అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు ఆహ్వానించారు.

మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం, శ్రీ బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ అమ్మవారి ఆలయం, అమీర్‌పేట శ్రీ కనకదుర్గ ఆలయం అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సాదరంగా ఆహ్వానించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానాన్ని స్వీకరించి, అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

- పన్ను మోసాలపై కఠిన చర్యలు
- నిజాయితీ పన్నుదారులకు సులభమైన విధానం
- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనాలపై మంత్రుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన

న్యూఢిల్లీ, వెలుతురు:

జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు.

జీఎస్టీ అమలుకు పునాది పరస్పర విశ్వాసమేనని భట్టి పేర్కొన్నారు. ఉమ్మడి జాతీయ మార్కెట్ ఏర్పాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్న నమ్మకంతో రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్నాయని గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయడం, రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడటం, కీలక మార్పులను సంప్రదింపులు, ఏకాభిప్రాయంతో చేపట్టడం ఈ వ్యవస్థకు మూల సూత్రాలని అన్నారు.

తెలంగాణపై జీఎస్టీ ప్రభావం

తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని భట్టి తెలిపారు. ఈ ఆదాయంతోనే రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. జీఎస్టీ ఆదాయంలో తగ్గుదల కేవలం లెక్కల అంశం కాదని, ప్రజలకు సేవలు అందించే రాష్ట్ర సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్‌లకు సంబంధించిన మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు వివరించాలని కోరారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్రం అందించిన అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర సొంత అంచనాల ప్రకారం ఈ నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. తగిన సందర్భాల్లో ఆటోమేటిక్ జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ మార్పులు, రద్దు దరఖాస్తుల ఆటోమేటిక్ ప్రాసెసింగ్‌కు భట్టి మద్దతు తెలిపారు. రిస్క్ లేని కేసుల్లో ఆటోమేటిక్‌గా రీఫండ్‌లు మంజూరు చేయడం ద్వారా నిజాయితీ గల పన్నుదారులకు త్వరగా ప్రయోజనం అందుతుందని అన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం

పన్నుదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేయడంతో పాటు జీఎస్టీ మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భట్టి డిమాండ్ చేశారు. వృద్ధులు, గృహిణులు, రోజువారీ కూలీలు, ఇతర అమాయకుల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేసి మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లు సృష్టిస్తున్న ఘటనలను ప్రస్తావించారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం లేదా ఇతరులకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వ్యవస్థీకృత ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విధానాలను సరళీకరించడం పేరుతో వ్యవస్థీకృత పన్ను ఎగవేతపై అమలు చర్యలు బలహీనపడకూడదని స్పష్టం చేశారు.

స్క్రాప్ రంగంపై ప్రత్యేక దృష్టి

దేశవ్యాప్తంగా స్క్రాప్ రంగంలో జరుగుతున్న పన్ను ఎగవేతను భట్టి ప్రస్తావించారు. అసంఘటిత, నగదు ఆధారిత వ్యవస్థ కారణంగా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ బదిలీ చేయడం జరుగుతోందని చెప్పారు. అదే సమయంలో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చెత్త సేకరించే కార్మికులు, చిన్న స్థాయి సేకరణదారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్‌లో జీఎస్టీ ప్రాంతీయ కార్యాలయాలు

హైదరాబాద్ కేవలం భౌగోళికంగా అనుకూలమైన నగరం మాత్రమే కాదని, టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలోని ప్రముఖ కేంద్రాల్లో ఒకటని భట్టి పేర్కొన్నారు. భవిష్యత్ జీఎస్టీ పరిపాలనకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎగుమతి రాష్ట్రాల సహకారాన్ని గుర్తించాలని భట్టి కోరారు.

మోదీ గద్దె దిగు..

(మొదటిపేజీ తరువాయి)

వంటి వారు ప్రాణాలకు తెగించి పోరాడారని, స్వాతంత్ర్యం తెచ్చారని సీఎం అన్నారు. సంపన్నులు, పేదలు తేడా లేకుండా డాక్టర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారన్నారు. ఇప్పటి వరకు సర్ ఎన్నిసార్లు జరిగినా పేదల ఓట్లకు ముప్పు కలగలేదని సీఎం అన్నారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని సీఎం మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశ ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశ ప్రజలను ఓటు ఉన్నవాళ్లు, ఓటు లేనివాళ్లుగా, రెండు వర్గాలుగా విభజిస్తున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న వాళ్లు ఒకవైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలు మరో వైపు అన్నట్లుగా మోదీ, జ్ఞానేష్ కుమార్ పరిస్థితులను మార్చారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకొని వాటిని తొలగిస్తున్నారని సీఎం ఆరోపించారు.

ఆవిరి!

(మొదటిపేజీ తరువాయి)

కనిపించే అవకాశం ఉంది.

చమురు ధరల సెగ.. ఆర్‌బీఐ నిర్ణయం ప్రభావం

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 104 డాలర్లకు పైగా చేరడం మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. భారత్ తన చమురు అవసరాల్లో ఎక్కువ భాగాన్ని దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతి వ్యయం, రవాణా, ఉత్పత్తి వ్యయాలు పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళన పెట్టుబడిదారుల్లో నెలకొంది. ఇదే సమయంలో ఆర్‌బీఐ రెపో రేటును 25 ప్రాతిపదిక పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. విధాన వైఖరిని కూడా కఠినతరం చేయడంతో రుణాల వ్యయం పెరిగి కంపెనీల లాభాలపై ప్రభావం పడొచ్చన్న అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా అధిక రుణాలపై ఆధారపడే లోహాలు, స్థిరాస్తి, మౌలిక వసతుల వంటి రంగాల షేర్లపై అమ్మకాల ఒత్తిడి పెరిగింది.

47 షేర్లు నష్టాల్లో..

నిఫ్టీ 50లో 50 కంపెనీలకు గాను 47 షేర్లు నష్టాల్లో ముగిశాయి. అతి కొద్దిమంది షేర్లు మాత్రమే స్వల్పంగా లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ తదితర షేర్లు గణనీయంగా పడిపోయాయి. మధ్యతరహా, చిన్నతరహా కంపెనీల షేర్లలోనూ అమ్మకాలు తీవ్రంగా కనిపించాయి.

సెన్సెక్స్ 71,593 స్థాయికి పడిపోవడం 2024 ఫిబ్రవరి తర్వాత కనిష్ఠ ముగింపుగా నమోదైంది. నిఫ్టీ కూడా దాదాపు 18 నెలల కనిష్ఠ స్థాయిలో ముగిసింది. దీంతో సమీప రోజుల్లో మార్కెట్ మరింత ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది.

రైతులకు యంత్ర సాయం

- వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రారంభానికి రాష్ట్రం సిద్ధం
- రాష్ట్ర, కేంద్ర వాటాలతో పథకం
- చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు
- ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం.. బీసీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, వెలుతురు:

గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పక్కన పెట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2025-26 సంవత్సరం నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి అమలు చేస్తున్నామని చెప్పారు. 2025-26సంవత్సరానికి పథకం కోసం రూ.71 కోట్లు కేటాయించగా,రూ.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రైతులకు మరింత విస్తృతంగా యాంత్రీకరణ ప్రయోజనాలు అందించేందుకు 2026-27 సంవత్సరానికి రూ.147.99 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.

రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్ర, కేంద్ర వాటాలతో పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టామని, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేయాల్సిన మార్గదర్శకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోందని చెప్పారు. కేంద్ర మార్గదర్శకాలు అందిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, రైతులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రైతుకు నచ్చిన కంపెనీ నుంచి పరికరం కొనుగోలు చేసే అవకాశం

రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాన్ని తమకు నచ్చిన ఎంప్యానెల్ చేసిన కంపెనీ వద్ద కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం పథకం ద్వారా లబ్ధి పొందే రైతు ఒక నిర్దిష్ట సంస్థ లేదా ఎంపిక చేసిన సరఫరాదారుడి వద్ద నుంచే పరికరం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి లేకుండా, రైతుకు మరింత స్వేచ్ఛ ఉండే విధంగా విధానాన్ని రూపొందించాలని తెలిపారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయనుండటం వల్ల రైతులు కూడా వ్యవసాయ పరికరం కొనుగోలు చేసే ముందు వివిధ కంపెనీల ధరలను, నాణ్యతను పరిశీలించి, తక్కువ ధరకు మంచి నాణ్యత కలిగిన పరికరం ఎక్కడ లభిస్తే అక్కడే కొనుగోలు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం, బీసీ మరియు ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందుతుందని మంత్రి తెలిపారు. సబ్సిడీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధానం వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో పాటు, పథకంలో పారదర్శకత పెరుగుతుందని మంత్రి అన్నారు.

37 రకాల వ్యవసాయ పరికరాలు...

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించేందుకు ప్రస్తుతం 37 రకాల వ్యవసాయ పరికరాలను ఖరారు చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో పథకం పరిధిలో 19 రకాల పరికరాలు మాత్రమే ఉండేవని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం పరికరాల సంఖ్యను 37 రకాలకు పెంచినట్లు చెప్పారు. ఇందులో పవర్ టిల్లర్, బ్యాటరీ ఆపరేటెడ్ ఎలక్ట్రిక్ టిల్లర్/వీడర్, డిస్క్ ప్లౌ, కల్టివేటర్, లెవలింగ్ బ్లేడ్, రోటావేటర్, రోటో-పుడ్లర్, రివర్సిబుల్ ఎంబీ ప్లౌ, సబ్ సాయిలర్, బండ్ ఫార్మర్, సీడ్-కం-ఫెర్టిలైజర్ డ్రిల్, మల్టీ క్రాప్ ప్లాంటర్, రైజ్డ్ బెడ్ ప్లాంటర్, పోస్ట్ హోల్ డిగ్గర్, ప్లాస్టిక్ మల్చ్ లేయింగ్ మెషిన్, ఫెర్టిలైజర్ బ్రాడ్‌కాస్టర్, రిడ్జ్ ఫరో ప్లాంటర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్లాషర్, పవర్ వీడర్, మాన్యువల్ నాప్‌సాక్ స్ప్రేయర్, పవర్ నాప్‌సాక్ స్ప్రేయర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్, కిసాన్ డ్రోన్, కంబైన్ హార్వెస్టర్, మైజ్ కంబైన్ హార్వెస్టర్, మల్టీ క్రాప్ థ్రెషర్, విన్నోయింగ్ ఫ్యాన్, మైజ్ షెల్లర్, టెలిస్కోపిక్ హార్వెస్టింగ్ పోల్స్, పసుపు బాయిలర్, పసుపు పాలిషర్, ప్యాడీ మొబైల్ డ్రైయర్, స్ట్రా బేలర్, రోటరీ ష్రెడర్, మల్చర్, రోటరీ స్ట్రా స్లాషర్, బ్రష్ కట్టర్ ఉన్నాయి.

తెరపై తుఫాను.. జీవితంలో మానవత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో మూడు జాతీయ చలనచిత్ర అవార్డులు, పద్మశ్రీ సహా పలు పురస్కారాలు అందుకున్నారు.

పాత్ర ఏదైనా.. తనదైన శైలే!

హీరో, విలన్, పోలీసు అధికారి, సైనికుడు, సాధారణ వ్యక్తి.. పాత్ర ఏదైనా అందులోకి పూర్తిగా ఒదిగిపోవడం నానా ప్రత్యేకత. సీరియస్ పాత్రలతో ప్రేక్షకులను ఆలోచింపజేసిన ఆయన 'వెల్‌కమ్' వంటి చిత్రాల్లో హాస్యంతోనూ మెప్పించారు. నటుడిగానే కాకుండా దర్శకుడు, రంగస్థల కళాకారుడిగానూ తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన నటనలోని తీవ్రత, నిజాయితీ, ప్రత్యేకమైన సంభాషణ శైలి భారతీయ సినిమా ప్రేక్షకులపై చెరగని ముద్ర వేశాయి.

తెర దాటి.. రైతుల పక్షాన నిలిచిన మనసు

సినిమాలతో పాటు సామాజిక సేవలోనూ నానా పటేకర్ తనదైన ముద్ర వేశారు. రైతుల సంక్షేమం, నీటి సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం 'నామ్ ఫౌండేషన్' ద్వారా పలు కార్యక్రమాలకు సహకరించారు. ప్రజా సమస్యలపై ఆయన స్పష్టంగా స్పందించేవారు. అందుకే నానా పటేకర్ ఒక నటుడిగానే కాకుండా సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తిగానూ గుర్తింపు పొందారు. ఆయన మృతితో భారతీయ సినిమా ఓ విలక్షణ నటుడిని, సమాజం ఓ స్పందించే మనసును కోల్పోయింది.

సింగరేణి సమస్యలపై ప్రత్యక్ష పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని, సింగరేణి బకాయిలను త్వరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరుతూ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దసరాకు ముందు సింగరేణి లాభాలను ప్రకటించి, కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వడం ఆనవాయితీ అని, అయితే దసరా వస్తున్నా ఈ ఏడాది లాభాలను ప్రకటించలేదని, వాటా గురించి చెప్పడం లేదని విమర్శించారు. రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ సింగరేణి కార్మికులను మోసం చేసిందన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 32శాతం లాభాల వాటా ఇస్తే, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన మొదటి ఏడాది 16శాతం మాత్రమే ఇచ్చిందని, మాటల్లో 33 శాతం చెప్పి వాస్తవంగా 16 శాతమే ఇచ్చారని అన్నారు. 2024-25లో కేవలం 12.5శాతం మాత్రమే ఇచ్చారని ఆరోపించారు.

లాభాలు, ఉత్పత్తి తగ్గడానికి కారణమెవరు?

2022-23లో రూ.2,022 కోట్లు, 2023-24లో రూ.4,712 కోట్లు, 2024-25లో రూ.6,394 కోట్ల లాభాలు వచ్చాయని హరీశ్‌రావు తెలిపారు. ఈ ఏడాది మాత్రం లాభాలను ప్రకటించలేదన్నారు. తమకు అందుతున్న సమాచారం ప్రకారం లాభాలు రూ.1,800 కోట్లు కూడా మించవని, మూడు వంతుల మేర లాభాలు తగ్గడం సింగరేణి పరిస్థితి ఎలా ఉందో తెలియజేస్తోందన్నారు. దీనికి కారణం పరిపాలనా వైఫల్యం కాదా అని ప్రశ్నించారు.

మానవీయ విలువలతో కూడిన జైలు వ్యవస్థ అవసరం

(మొదటిపేజీ తరువాయి)

డెవలప్‌మెంట్ బ్యూరో పరిధిలోని సెంట్రల్ అకాడమీ ఫర్ పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో "జైలు పరిపాలనలో మహిళా ఆఫీసర్లు" అంశంపై నిర్వహించిన 5వ జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జైలు పరిపాలనలో మహిళా సిబ్బంది పాత్ర, సేవలు, వృత్తిపరమైన అభివృద్ధి, నాయకత్వం, కొత్త సవాళ్లు, ఉత్తమ విధానాలపై కేంద్ర మంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమంలో బీపీఆర్డీ డైరెక్టర్ జనరల్ అలోక్ మిత్తల్, ఐజీ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ అండ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ జితేంద్ర సింగ్ మీనా, పలువురు మహిళా జైలు ఉన్నతాధికారులు, విద్యా రంగ ప్రతినిధులు, జైళ్లు, సంస్కరణాత్మక పరిపాలనలో పనిచేస్తున్న నిపుణులు పాల్గొన్నారు. ప్రజా పరిపాలనలో అత్యంత సవాళ్లతో కూడిన, సామాజికంగా ఎంతో ముఖ్యమైన రంగాల్లో పనిచేస్తున్న మహిళా అధికారుల కోసం ఇలాంటి జాతీయ వేదికను ఏర్పాటు చేసిన బీపీఆర్డీ అధికారులను అభినందిస్తున్నానని బండి సంజయ్ తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో జైలు సంస్కరణలకు కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జైళ్ల ఆధునీకరణ, ఖైదీల పునరావాసం, సంస్కరణలకు అవసరమైన సహకారం అందిస్తున్నామని తెలిపారు. అయితే ప్రస్తుత జైలు చట్టాలు, నిబంధనలు, నియమాల్లో మార్పులు చేయడంలో ప్రధాన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు.

బీపీఆర్డీ జాతీయ స్థాయిలో ముఖ్యమైన పాత్ర

బీపీఆర్డీ జాతీయ స్థాయిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని, దాని పరిధి కేవలం పోలీసింగ్‌కే పరిమితం కాదని తెలిపారు. సంస్కరణాత్మక పరిపాలన, పరిశోధన, శిక్షణ, సామర్థ్య నిర్మాణం, ఉత్తమ పద్ధతుల విస్తరణలోనూ సంస్థ కీలకంగా పనిచేస్తోందన్నారు. క్షేత్రస్థాయి అనుభవాలు, పరిశోధన ఫలితాలు, విధాన రూపకల్పన మధ్య బీపీఆర్డీ వారధిగా పనిచేయగలదని పేర్కొన్నారు. జైలు పరిపాలనలో మహిళల ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకునే విధానం ఉండాలని సూచించారు.

సాంకేతికత భవిష్యత్తులో కీలక పాత్ర

జైలు పరిపాలనలో సాంకేతికత భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సమీకృత జైలు నిర్వహణ వ్యవస్థలు, బయోమెట్రిక్ గుర్తింపు, డిజిటల్ రికార్డులు, డిజిటల్ సందర్శకుల నిర్వహణ, సీసీటీవీ, ఆధునిక నిఘా వ్యవస్థలు, డేటా విశ్లేషణ, టెలిమెడిసిన్, డిజిటల్ విద్య, సాంకేతికత ఆధారిత వృత్తి, విద్యా కార్యక్రమాల ద్వారా ఆధునిక జైలు వ్యవస్థలు ప్రయోజనం పొందవచ్చన్నారు. అయితే సాంకేతికత సహాయక సాధనంగా ఉండాలి తప్ప వృత్తిపరమైన నిర్ణయాలకు ప్రత్యామ్నాయంగా మారకూడదని స్పష్టం చేశారు.

చలో లోక్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

తదితరులు కూడా ర్యాలీలో పాల్గొన్నారు.

300 మీటర్ల వద్దే అడ్డుకున్న పోలీసులు

ర్యాలీ లోక్‌భవన్ వైపు సాగుతుండటంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. లోక్‌భవన్‌కు సుమారు 300 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కార్యకర్తలు ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నేతల అరెస్టు.. పంజాగుట్టకు తరలింపు

పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవడం ప్రారంభించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భారీగా కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనడంతో ఖైరతాబాద్ ఫ్లైఓవర్ నుంచి ఎన్టీఆర్ గార్డెన్స్ మార్గంలో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సీఈసీ రాజీనామా చేయాలి: పొన్నం

ఎన్నికల జాబితా సవరణపై ప్రజల్లో అనుమానాలు, సందేహాలు నెలకొన్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని, ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే ఎన్నికల సంఘం పారదర్శకంగా పనిచేయాలని, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పోరాటం కొనసాగుతుంది: మహేశ్‌గౌడ్

ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుని ఎన్నికల్లో గెలవాలని ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రయత్నిస్తున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సీఈసీ రాజీనామా చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

శాంతియుత నిరసన హక్కు: అజారుద్దీన్

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని మంత్రి మహ్మద్ అజారుద్దీన్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఢిల్లీలో ప్రతిపక్ష నేతల అరెస్టులను కూడా ఆయన తప్పుబట్టారు.

కో ఆప్షన్ ఎన్నికలు
వెంటనే నిర్వహించాలి

- బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నారనే భయంతోనే ఎన్నికలు వాయిదా
- రైతులు రేవంత్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు
- కేసీఆర్ భూకబ్జాలంటూ కొత్త నాటకానికి తెరలేపుతున్నారు
- రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములకు వందల కోట్ల ఆస్తులు ఎక్కడివి? : ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, వెలుతురు అక్టోబర్ 8 : మున్సిపాలిటీల్లో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కో ఆప్షన్ ఎన్నికలను నిర్వహించడం లేదని ఆయన ఆరోపించారు. గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎన్నికై ఏడాది కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ప్రతి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నందున కో ఆప్షన్ పదవులు బీఆర్ఎస్‌కు దక్కుతాయనే భయంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తోందని విమర్శించారు. తొర్రూరు మున్సిపాలిటీలోనూ బీఆర్ఎస్‌కు చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉందనే కారణంతోనే ఎన్నికల ప్రక్రియను ముందుకు సాగనివ్వడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కౌన్సిలర్లకు వారి హక్కులు కల్పించాలని, కో ఆప్షన్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భూముల అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఎర్రబెల్లి ఆరోపించారు. కేసీఆర్‌పై భూకబ్జాల ఆరోపణలు చేస్తూ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపుతోందని విమర్శించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన అన్నదమ్ములకు వందల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రైతు బంధు, యూరియా కొరత, విద్యుత్ సరఫరా, పంట రుణమాఫీ తదితర అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతు బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ముగిసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. సాగునీరు అందించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు, మహిళల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించడంతో పాటు కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం అందిస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలను నిలిపివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పసుమర్తి సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, రామిని శ్రీనివాస్, నల్లమాస ప్రమోద్ కుమార్, హనుమండ్ల ప్రదీప్ రెడ్డి, కుర్ర శ్రీనివాస్, మనిరాజు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు భూసాని జయమ్మ, ధరావత్ పద్మ, కిన్నెర కవిత, తూర్పాటి రవి, జంపా, మాడుగుల భవానీలత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరిపై భట్టి ధ్వజం

- ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ప్రజల్లో అనుమానాలు తొలగాలి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ తక్షణ రాజీనామాకు డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 08: దేశ ప్రజల తరఫున, వారి ఓటు హక్కు రక్షణ కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నేతలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాలరాస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల ముంగిట వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అక్రమాలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు మొదటినుంచీ ప్రశ్నిస్తున్నారని, అప్పట్లో వాటిని రాజకీయ విమర్శలుగా కొట్టిపారేసినప్పటికీ, ఇప్పు డు ఎన్నికల సంఘంలో తప్పులు జరుగుతున్నాయని ఎన్నికల సంఘం కమిషన్ వ్యక్తులే అంగీకరించ డంతో ఆ ఆరోపణలు నిజమని రుజువయ్యాయని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో, దేశ ప్రజల్లో ఎన్నికల ప్రక్రియ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా జరుగుతున్నాయనే నమ్మకం సామాన్య ప్రజల్లో కూడా కలగాలంటే ఎన్నికల సంఘం పూర్తి స్వతంత్రంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపా రు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థను ఈ స్థాయికి దిగజార్చి నందుకు బీజేపీ ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. నేడు దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపైనే తీవ్ర చర్చ నడుస్తున్నందున, ప్రజాస్వామ్య వ్యవస్థల ను కాపాడేందుకు బాధ్యులు తప్పుకోవాల్సిన సమ యం వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం

- ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన లోక్‌భవన్ ముట్టడి--నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలతో కలిసి లోక్‌భవన్ వైపు నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు సంఘీభావం తెలిపారు.

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 08 : దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి చేపడుతున్న పోరాటానికి ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ఒక దేశ పౌరులు గా తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొంటున్న అనుమానాలకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు

దమ్మంటే నాపై గెలవండి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 8 : : ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల నేప థ్యంలో తెలం గాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్' అని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఈ ఉప ఎన్నిక తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఒక రెఫరెండంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ఆ అధికారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలోనే జరగనున్న ఉప ఎన్నికలో విజయం సాధించి తీరుతామని దానం ధీమా వ్యక్తం చేశారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

-ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి వివేక్

సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 8: మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, ఉపాధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు యూనిఫాం కుట్టు, పెట్రోల్ బంకులు తదితర ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ప్రతిరోజూ భిన్నమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నట్లు చెప్పారు. సిద్దిపేటలోనూ కిచెన్ నిర్మాణం పూర్తయిన వెంటనే ఈ కార్యక్రమం అమల్లోకి వస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సిద్దిపేట జిల్లా ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 2వేల ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయిందని, మరో వెయ్యి ఇళ్లను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ఏడాది సిద్దిపేట జిల్లాకు మరో 2,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకం, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి వివేక్ తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని, మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం కొనసాగిస్తున్న కార్యక్రమాల్లో ఇది భాగమన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో
సర్వోత్తమరెడ్డి విజయం ఖాయం

కాంగ్రెస్ అభ్యర్థి విజయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 08 : నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన రామిరెడ్డి సర్వోత్తమరెడ్డి గురువారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్వోత్తమరెడ్డికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సర్వోత్తమరెడ్డి ఘన విజయం సాధిస్తారన్న ధీమాను మంత్రి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై అవగాహన, పార్టీ పట్ల నిబద్ధత, పట్టభద్రులు--ఉద్యోగ వర్గాలతో ఉన్న అనుబంధం సర్వోత్తమరెడ్డికి కలిసొస్తాయని మంత్రి పేర్కొన్నారు. పట్టభద్రుల ఆశయాలను శాసనమండలిలో బలంగా వినిపించే అవకాశం సర్వోత్తమరెడ్డికి కల్పించాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రస్తుతం ఏఐసీసీ, టీపీసీసీ సభ్యుడిగా కొనసాగుతున్న సర్వోత్తమరెడ్డి, పార్టీ శ్రేణులు, పట్టభద్రులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని మంత్రి సూచించారు. నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

జ్ఞానేశ్‌కుమార్ వెంటనే
రాజీనామా చేయాలి : డా.రేఖ బోయలపల్లి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 08: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాల ఆరోపణలపై జవాబుదారీతనం వహిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి డిమాండ్ చేశారు. ఇండియా కూటమి ఇచ్చిన "సేవ్ డెమోక్రసీ" పిలుపులో భాగంగా నిర్వహించిన "చలో లోక్ భవన్" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బి. మహేశ్ కుమార్ గౌడ్ గారి ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ గారి నాయకత్వంలో మహిళా కాంగ్రెస్ బృందంతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. "ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడాలి. ఓటర్ల జాబితాల్లో అక్రమాల ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపి, ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. ఎన్నికల కమిషన్ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి" అని డా. రేఖ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇండియా కూటమి ప్రతినిధులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఓటు హక్కు పరిరక్షణకు, ఎన్నికల వ్యవస్థలో జవాబుదారీతనానికి మహిళా కాంగ్రెస్ నిరంతరం గళమెత్తుతుందని ఆమె స్పష్టం చేశారు. "రాజ్యాంగ విలువలను కాపాడేందుకు, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకు, వారి ఓటుకు రక్షణ కల్పించాలన్నదే మా సంకల్పం" అని ఆమె అన్నారు.

మస్క్ ఆరోపణల కలకలం.. ఖండించిన కేంద్రం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 8: భారతదేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల విడుదలకు స్థానిక బిలియనీర్లు, ఆలిగార్క్‌లు అడ్డుపడుతున్నారంటూ టెక్ దిగ్గజం, స్టార్ లింక్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన సంచలన ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం గట్టి కౌంటర్ ఇచ్చింది. సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న ఈ ఆరోపణలు, కథనాలను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసులతో సహా అన్ని రకాల టెలికాం సేవలకు నిష్పాక్షికమైన, వివక్షలేని పారదర్శక నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నామని స్పష్టం చేసింది. శాటిలైట్ ఇంటర్నెట్ విభాగానికి సంబంధించి జీఎంపీసీఎస్ పరిధిలో ఇప్పటివరకు మొత్తం మూడు దిగ్గజ సంస్థలకు టెలికాం లైసెన్సులు మంజూరు చేసినట్లు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నాన్-జియోసింక్రోనస్ శాటిలైట్ ఆర్బిట్ ఆధారిత సేవలు అందించడానికి ఈ మూడింటికీ సమాన ప్రాతిపదికనే అవకాశాలు కల్పించామని పేర్కొంది. దేశంలో అత్యుత్తమ శాటిలైట్ సేవలను అందుబాటు లోకి తేవాలనే కట్టుబాటుతోనే ఈ లైసెన్సింగ్ ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించింది. అయితే, లైసెన్స్ పొందిన ఏ సంస్థ అయినా సేవలను ప్రారంభించే ముందు భారత జాతీయ భద్రతా నిబంధనలకు లోబడి ఉందో లేదో నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 8 : తెలంగాణలో పారిశ్రామిక విప్లవానికి, భారీ పెట్టుబడుల ఆకర్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' రాష్ట్ర రాజకీయ, ఆర్థిక భవిష్యత్తును నిర్ణయించడంలో కీలకం కానుంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు కల్పిస్తున్న ప్రోత్సాహం.. ఇప్పుడు రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెడుతోంది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు సుమారు 240 అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌కు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని కేవలం వ్యాపార కోణంలోనే కాకుండా, యువతకు అత్యధిక వేతనాలు లభించే ఉద్యోగాలను సృష్టించే ప్రధాన సాధనంగా చూస్తోంది. టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్.., దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న జీసీసీ మార్కెట్లలో అగ్రగామిగా నిలుస్తోంది. అనరాక్ ఫిక్కీ, జ్ఞోనో, యునార్త్ ఐక్యూ వంటి ప్రముఖ సంస్థల నివేదికల ప్రకారం.. దేశంలో ఏర్పాటవుతున్న మొత్తం జీసీసీలలో సుమారు 40 శాతానికి పైగా వాటా హైదరాబాద్‌కే దక్కుతుండటం విశేషం. కెనడియన్ బ్యాంకింగ్ దిగ్గజం సీఐబీసీతో పాటు డోర్‌డాష్, బ్రిస్ట్రల్, మెర్క్‌షార్ప్ ఒ డోమ్, రెజెనెరాన్ ఫార్మాస్యూటికల్స్ వంటి దిగ్గజ కంపెనీలు నగరంలో తమ కేంద్రాలను ప్రారంభించడం ఇందుకు నిదర్శనం. రాజకీయంగా విపక్షాల విమర్శలను తిప్పకొట్టడంలోనూ, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ ఈ గ్లోబల్ సమ్మిట్ అధికార పార్టీకి అత్యంత కీలకం కానుంది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' కొనసాగింపుగా వస్తున్న ఈ సమ్మిట్ ద్వారా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని విధానాలు, ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు పారిశ్రామిక వర్గాల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. పెట్టుబడిదారులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం, మౌలిక వసతులను మెరుగుపరచడం, అంతర్-విభాగ సమన్వయాన్ని పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జపాన్, పశ్చిమ ఆసియా దేశాలకు చెందిన పలు కంపెనీలు తమ భారతీయ కార్యకలాపాల విస్తరణ కోసం హైదరాబాద్ వైపు చూస్తుండటం, బలమైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా వ్యవస్థ నగరానికి అదనపు బలంగా మారుతుండటం శుభపరిణామం. మొత్తంగా, 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' కేవలం వ్యాపార సదస్సు మాత్రమే కాకుండా? తెలంగాణ రాజకీయ, ఆర్థిక పటాన్ని మార్చేసే చారిత్రక వేదికగా నిలవనుందడంలో ఎలాంటి సందేహం లేదు. పారదర్శక పాలన, వేగవంతమైన నిర్ణయాలతో అంతర్జాతీయ పెట్టుబడు లను ఆకర్షిస్తూ, రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలపడానికి ప్రభుత్వం శాయశక్తుల ప్రయత్నిస్తోంది.

అవగాహన అలవర్చుకుంటే...

ఉన్నతమైన మార్పులకు నాంది

మనిషిజీవితంలో మార్పు రావాలంటే ముందుగా ఆలోచనల్లో మార్పు రావాలి. ఆలోచనల్లో మార్పు రావాలంటే సరైన అవగాహన అవసరం. అవగాహన అనేది కేవలం ఒక విషయాన్ని తెలుసుకోవడం మాత్రమే కాదు, తెలిసిన విషయాన్ని అర్థం చేసుకుని, పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయం తీసుకోవడం, బాధ్యతగా వ్యవహరించడం. అవగాహన అలవర్చుకుంటే ఆలోచనలు సానుకూలంగా మారుతాయి. చేసే పనిలో శ్రద్ధ పెరుగుతుంది. ఏది చేయాలి? ఏది చేయకూడదు? ఏది మనకు ఉపయోగకరం? ఏది నష్టాన్ని కలిగిస్తుంది? అనే విషయాలను అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ప్రతి వ్యక్తి జీవితంలో అవగాహనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. చదువు ద్వారా జ్ఞానం వస్తుంది. అనుభవం ద్వారా పాఠాలు నేర్చుకుంటాం. కానీ ఆ జ్ఞానాన్ని, అనుభవాన్ని సరైన విధంగా ఉపయోగించుకోవడానికి అవగాహన అవసరం. అవగాహన అనే అలవాటును చిన్నప్పటి నుంచే పిల్లల్లో పెంపొందించాలి. మంచి అలవాట్లు, పరిశుభ్రత, సమయపాలన, పెద్దలను గౌరవించడం, ఇతరుల పట్ల బాధ్యతగా ఉండటం, ప్రకృతిని కాపాడటం, ఆహారాన్ని వృథా చేయకపోవడం వంటి విషయాలపై చిన్న వయసులోనే అవగాహన కల్పిస్తే అవి జీవితాంతం కొనసాగుతాయి. పిల్లలకు కేవలం "ఇది చేయాలి, ఇది చేయకూడదు" అని చెప్పడం కంటే, ఎందుకు చేయాలి? ఎందుకు చేయకూడదు? అనే విషయాన్ని వివరించడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది. కారణాన్ని అర్థం చేసుకున్నప్పుడు వారు స్వయంగా సరైన నిర్ణయం తీసుకునే స్థాయికి ఎదుగుతారు. అవగాహన ఆలోచనా విధానాన్ని మార్చుతుంది అవగాహన ఉన్న వ్యక్తి ప్రతి విషయాన్ని ఆలోచించి స్పందిస్తాడు. తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉంటాడు. సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా, దానికి పరిష్కారం ఎలా కనుగొనాలి అనే దానిపై దృష్టి పెడతాడు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా సానుకూలంగా ఆలోచించే శక్తిని అవగాహన పెంచుతుంది. ఒక చిన్న సమస్యను పెద్దదిగా చేసుకోవడం కాకుండా, దాని మూల కారణాన్ని తెలుసుకుని పరిష్కరించుకునే మార్గాన్ని చూపుతుంది. అందుకే అవగాహన అనేది మనిషి ఆలోచనా విధానాన్ని మార్చే ఒక శక్తివంతమైన సాధనం. అవగాహన ఉన్నప్పుడు చేసే పనిపై బాధ్యత పెరుగుతుంది. విద్యార్థి చదువు ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటే చదువుపై శ్రద్ధ పెడతాడు. ఉద్యోగి తన బాధ్యతను అర్థం చేసుకుంటే పనిని నిబద్ధతతో చేస్తాడు. కుటుంబ సభ్యుడు తన బాధ్యతను తెలుసుకుంటే కుటుంబంలో సమన్వయం పెరుగుతుంది. పని చిన్నదైనా, పెద్దదైనా దాని ప్రభావాన్ని అర్థం చేసుకుని చేయడం వల్ల నాణ్యత పెరుగుతుంది. బాధ్యతతో చేసే ప్రతి పని వ్యక్తి ఎదుగుదలకు దోహదపడుతుంది. చాలా సమస్యలు అవగాహన లేకపోవడం వల్లే ఏర్పడుతాయి. ఆరోగ్యం గురించి అవగాహన ఉంటే కొన్ని అనారోగ్య సమస్యలను ముందుగానే నివారించవచ్చు. రోడ్డు భద్రతపై అవగాహన ఉంటే ప్రమాదాలను తగ్గించవచ్చు. సైబర్ మోసాలపై అవగాహన ఉంటే అనేక ఆర్థిక నష్టాలను నివారించవచ్చు. పర్యావరణంపై అవగాహన ఉంటే ప్రకృతికి హాని కలిగించే చర్యలను తగ్గించవచ్చు. అవగాహన సమస్య వచ్చిన తర్వాత స్పందించడం మాత్రమే కాదు, సమస్య రాకముందే జాగ్రత్త పడే ఆలోచనా విధానాన్ని పెంచుతుంది. ఒక వ్యక్తిలో అవగాహన పెరగడం ఆ వ్యక్తి జీవితానికే పరిమితం కాదు. కుటుంబం ద్వారా సమాజానికి, సమాజం ద్వారా దేశానికి దాని ప్రభావం విస్తరిస్తుంది. పరిశుభ్రతపై అవగాహన ఉన్న వ్యక్తి తన ఇంటిని మాత్రమే కాకుండా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచడానికి ప్రయత్నిస్తాడు. నీటి విలువ తెలిసిన వ్యక్తి నీటిని వృథా చేయడు. చెట్ల ప్రాముఖ్యత తెలిసిన వ్యక్తి పర్యావరణ పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తాడు. ఇతరుల కష్టాలను అర్థం చేసుకునే అవగాహన ఉన్న వ్యక్తిలో మానవత్వం పెరుగుతుంది. అందుకే మంచి సమాజ నిర్మాణానికి అవగాహన ఒక ముఖ్యమైన పునాది. అవగాహన అంటే కేవలం సమాచారం తెలుసుకోవడం కాదు. తెలిసిన విషయాన్ని జీవితంలో ఆచరించడం. పుస్తకాల్లో చదివిన మంచి విషయాలను వ్యక్తి ప్రవర్తనలోకి తీసుకురావడం. తప్పును తెలుసుకున్న తర్వాత దాన్ని సరిదిద్దుకోవడం. తన చర్యల వల్ల ఇతరులపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఆలోచించడం. తెలుసుకోవడం జ్ఞానం, అర్థం చేసుకోవడం అవగాహన, ఆచరించడం బాధ్యత. ఈ మూడు కలిసినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. అవగాహనకు ముగింపు లేదు. ప్రతి రోజు కొత్త విషయాన్ని తెలుసుకోవచ్చు. కొత్త అనుభవం నుంచి నేర్చుకోవచ్చు. ఇతరుల జీవితాలను గమనించి మంచి విషయాలను స్వీకరించవచ్చు. వ్యక్తిలో అవగాహన పెరిగే కొద్దీ మన నిర్ణయాల్లో పరిపక్వత వస్తుంది. ప్రవర్తనలో బాధ్యత పెరుగుతుంది. చుట్టూ ఉన్నవారిపై మన ప్రభావం కూడా సానుకూలంగా మారుతుంది. అందుకే అవగాహనను ఒక అలవాటుగా మార్చుకోవాలి. చిన్నప్పటి నుంచే పిల్లల్లో పెంచాలి. కుటుంబంలో ప్రోత్సహించాలి. సమాజంలో విస్తరించాలి. అవగాహన ఉన్న చోట ఆలోచనకు దిశ ఉంటుంది. ఆలోచనకు దిశ ఉన్న చోట ఆచరణలో మార్పు వస్తుంది. ఆచరణలో మార్పు వచ్చిన చోట అభివృద్ధి మొదలవుతుంది. వ్యక్తిలో మార్పు వస్తే కుటుంబం మారుతుంది, కుటుంబం మారితే సమాజం మారుతుంది. సమాజం మారితే ఉన్నతమైన భవిష్యత్తుకు శ్రీకారం చుడుతుంది. **-వై. సంజీవ కుమార్,**

ఫౌండర్, ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్, స్కై ఫౌండేషన్ ట్రస్ట్,
9393613555/9493613555

ఒక ప్రయాణంలో నేను సేవ గురించి, మోదీ నుంచి నేర్చుకున్న విషయాలు

-ఉదయ్ మహుర్కర్

వృత్తిలో ఎదుగుతున్న ఓ పాత్రికేయుడు, కొత్త రాజకీయ బాధ్యతను అప్పుడే చేపట్టిన యువ రాజకీయ నిర్వాహకుడి అనుభవ గాథ ఇది...అది 1987. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతుండగా, లోక్‌సభలో కేవలం రెండు స్థానాలున్న బీజేపీ అప్పుడప్పుడే ఎదుగుతున్న రాజకీయ శక్తిగా, అనిశ్చిత భవిష్యత్తుతో ముందుకు సాగుతోంది. అలాంటి సమయంలో 1987 ప్రారంభంలో అహ్మదాబాద్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో నా చీఫ్ రిపోర్టర్, సీనియర్ పాత్రికేయుడు కిరీట్‌భాయ్ భట్ కొత్తగా నియమితులైన గుజరాత్ రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి నరేంద్ర మోదీని కలవాలనే ఆసక్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత మేం అహ్మదాబాద్‌లోని బీజేపీ ఖాన్‌పూర్ కార్యాలయానికి వెళ్లి నరేంద్రభాయ్‌ను కలిశాం. రాజకీయ, సామాజిక అంశాలపై నరేంద్రభాయ్‌తో సాగిన 30 నిమిషాల సంభాషణ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఆయనను కలిసి బయటకు వస్తున్నప్పుడు వామపక్ష భావజాలం ఉన్నప్పటికీ విలువలతో కూడిన పాత్రికేయ రంగంలో నాకు ఆదర్శంగా నిలిచిన కిరీట్‌భాయ్ ఇలా అన్నారు: "మోదీ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు. ఆయనకు స్పష్టమైన లక్ష్యం ఉంది. ఎంతో తెలివైన, సహానుభూతి గల వ్యక్తి. సామాజిక, రాజకీయ అంశాలపై మంచి అవగాహన ఉంది."1987 చివరి నాటికి రాజకీయ పరిస్థితులు మారాయి. బోఫోర్స్ వివాదం రాజీవ్ గాంధీ ప్రతిష్ఠను దెబ్బతీసింది. గుజరాత్‌లోని అమర్‌సింగ్ చౌధరి ప్రభుత్వం వర్గపోరు, కుల రాజకీయాలు, పెరుగుతున్న ప్రజా అసంతృప్తితో సతమతమవుతోంది. గుజరాత్‌ను ఎన్నో ఏళ్లలో ఎన్నడూ చూడని తీవ్ర కరవు కుదిపేసింది. ప్రజలు వలస వెళ్లాల్సి వచ్చింది. రైళ్ల ద్వారా తాగునీటిని తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తీవ్రమైన పశుగ్రాస సంక్షోభంతో పశువులు ప్రాణాలు కోల్పోయాయి. కరవు తీవ్రత ఊహకు అందని స్థాయిలో ఉంది. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో 17 జిల్లాలు కరవు ప్రభావానికి గురయ్యాయి. కచ్, బనాస్‌కాంతా, మెహ సానా, జామ్‌నగర్ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. దాదాపు రెండు కోట్ల పశుసంపద కరవు ప్రభావాన్ని ఎదుర్కొంది. పంజాబ్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి పశుగ్రాసాన్ని తీసుకురావాల్సి వచ్చింది. సుమారు ఏడు లక్షల పశువులను పశు సంరక్షణ శిబిరాల్లో ఉంచారు. సహాయక పనుల ద్వారా దాదాపు 12 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించాల్సి ఉంది. కానీ వారికి సకాలంలో వేతనాలు అందలేదు. కొన్ని సందర్భాల్లో పూర్తి వేతనం కూడా రాలేదు. చాలామంది కూలీలకు తమ హక్కుల గురించి కనీస అవగాహన కూడా లేదు. తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న రాజీవ్ గాంధీ ప్రభుత్వం సహాయక చర్యల కోసం దాదాపు రూ.65 కోట్లు మంజూరు చేసింది. అయితే ఆ సాయం మారుమూల గ్రామాలకు నిజంగా చేరుతోందా అనే ప్రశ్నలు తలెత్తాయి. పాలన కాగితాలకే పరిమితమైంది. అక్షరాలా, రూపకంగా కూడా అదే పరిస్థితి కనిపించింది. ఈ సమయంలోనే నరేంద్ర మోదీ 'న్యాయ యాత్ర' ఆలోచనను ముందుకు తెచ్చారు. సేవ పట్ల నిబద్ధత అంటే ఏమిటో ఈ యాత్ర ఆచరణలో చూపించింది. మానవత్వానికి, సేవకు తొలి ప్రాధాన్యం ఇస్తూ న్యాయ యాత్ర ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించింది. **మొదటిది-పరిశీలన:** సహాయక శిబిరాల్లో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వ మార్గదర్శకాల్లో పేర్కొన్న వేతనాలు, సదుపాయాలు అందుతున్నాయా లేదా క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడం; అందని చోట్ల వివరాలను నమోదు చేయడం. రెండోది--అవగాహన: కూలీలు, రైతులు, గిరిజనులకు వారి హక్కులు, ప్రభుత్వం నెరవేర్చాల్సిన బాధ్యతల గురించి తెలియజేయడం; తద్వారా వారు తమకు రావాల్సిన వాటిని స్వయంగా అడిగి పొందేలా చేయడం. మూడోది--న్యాయం: అవినీతి, లోపాలకు సంబంధించిన ఆధారాలను సేకరించి, పరిష్కారం కోసం రాష్ట్ర అధికారులకు అధికారికంగా సమర్పించడం. సహాయక చర్యల కింద ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలను మోదీ క్షుణ్ణంగా నమోదు చేశారు. అవి గ్రామగ్రామాన అందుతున్నాయో లేదో పరిశీలించడం, వాస్తవాలను ప్రజలకు వివరించడంపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ యాత్రలో నాలుగు రథాలు ఉండేవి. పాత తరహా పైకప్పు కలిగిన జీపును ఒక్కో రథంగా తీర్చిదిద్దారు. వాటికి తెరలు అమర్చి సంచార వేదికలుగా మార్చారు. ఇది కూడా మోదీ వినూత్న ఆలోచనే. ఆర్థిక వనరులు అంతగా లేని ఆ రోజుల్లో బీజేపీ గుజరాత్ విభాగం మినీ ట్రక్కులను కొనుగోలు చేయలేకపోయింది. అందుకే మోదీ, ఆయన బృందం జీపులను రథాలుగా మలిచారు. 40 రోజుల యాత్రను గుజరాత్‌లోని నాలుగు ప్రాంతాలైన గోద్రా, పాలన్‌పూర్, జామ్ నగర్, భుజ్ నుంచి నిర్వహించారు. కేశూభాయ్ పటేల్, శంకర్‌సింగ్ వాఘేలా, సురేశ్‌భాయ్ మెహతా, కాశీరామ్ రాణా/మకరంద్ దేశాయ్ వంటి నలుగురు ప్రముఖ నేతలు దీనికి నాయకత్వం వహించారు. డిసెంబర్ 6న అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ప్రారంభమైన యాత్ర, స్వామి వివేకానంద జయంతి రోజైన 1988 జనవరి 12న ముగిసింది. దేశ రాజకీయ పదజాలంలోకి తొలిసారిగా ప్రవేశించిన 'యాత్ర' అనే పదాన్ని మోదీ సృజనాత్మకంగా ఎంచుకున్నారు. ఆ తర్వాత 1990లో శ్రీ ఎల్.కె. అద్వానీ చేపట్టిన సోమనాథ్--అయోధ్య యాత్ర తరహాలో రాజకీయ, సామాజిక సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కీలక సాధనంగా యాత్ర మారింది. సాధారణంగా 'యాత్ర' అంటే తీర్థయాత్ర అనే భావన ఉంది. అందువల్ల భారతీయ భాషా సంప్రదాయంలో ఈ పదానికి పవిత్రమైన భావం ఉంది. వినూత్న ఆలోచన, సేవా నిబద్ధత ఇక్కడే కనిపించాయి. ఒకేచోట 500 నుంచి 1,000 మంది వరకు కనిపించే సహాయక శిబిరాలను రథాలు సందర్శించాయి. కరవు సమయంలో ప్రజలకు ఉండే హక్కులను నేతలు అక్కడ చదివి వినిపించారు. ఉచిత నీటి సదుపాయం, పిల్లలు ఉంటే నీడనిచ్చే ఆశ్రయం, ఇతర నిత్యావసరాలు పొందే హక్కుల గురించి వివరించారు. ఇది అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాతావరణాన్ని సృష్టించి, ప్రజల సానుభూతిని సంపాదించింది. యాత్ర ద్వారా సహాయాన్ని నేరుగా అందించారు. ఎండలో కఠినమైన శారీరక శ్రమ చేసే కూలీలు ఆకలితో ఉండకుండా సహాయక శిబిరాల్లో సుఖ్డీ, వేరుశనగలు, శనగలు, బెల్లాన్ని కార్యకర్తలు పంపిణీ చేశారు. బెల్లం, గోధుమ పిండి, నెయ్యితో తయారు చేసే సుఖ్డీ ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. ఈ చిన్న సేవా చర్య కష్టాల్లో ఉన్న ప్రజలకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. యాత్ర సమయంలో పశువుల పరిస్థితి గురించి నరేంద్ర మోదీ ఎంతో ఆందోళన చెందారు. 'బైల్‌బరాన్' పేరుతో పశువుల కోసం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలని బీజేపీ కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చారు. కరవు సమయంలో రైతులు తమ ఎద్దులను అక్కడ వదిలేవారు. సంక్షోభం ముగిసిన తర్వాత వాటిని తిరిగి తీసుకెళ్లి వ్యవసాయ పనులను ప్రారంభించేవారు. ఇది కూడా ఆచరణలో సేవకు నిదర్శనం. జంతువుల పట్ల శ్రద్ధ మోదీ జీవితంలో ఎప్పుడూ కనిపిస్తుంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన క్రమం తప్పకుండా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించేవారు. ఆ శిబిరాల్లో ఆవులు, గేదెలకు కంటి శుక్లాల చికిత్స కూడా అందించేవారు. ఈ యాత్రకు క్షేత్రస్థాయిలో ప్రజలతో తక్షణ అనుబంధం ఏర్పడింది. నేను కూడా ఈ యాత్రకు సంబంధించిన అనేక సమావేశాలను కవర్ చేశాను. గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలు యాత్రతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఈ సమావేశాల్లో ఒకే తరహా పరిస్థితి పదేపదే వెలుగుచూసింది. కూలీలకు చేరకముందే వేతనాలను నిలిపివేయడం లేదా తగ్గించడం జరిగేది. బీజేపీ కార్యకర్తలు ఈ ఫిర్యాదులను ఒక పద్ధతి ప్రకారం నమోదు చేశారు. కూలీలు తమకు అందిన వేతన వివరాలను నమోదు చేసి సంతకం లేదా వేలిముద్ర వేయాలని సూచించారు. కూలీలకు తక్కువ వేతనం ఇచ్చిన ప్రాంతాల్లో గ్రామ సర్పంచ్‌లు లిఖితపూర్వక ప్రకటనలు అందించారు. ప్రభుత్వ వైఫల్యానికి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశాలు, వినతిపత్రాల ద్వారా విస్తృతంగా వెల్లడించారు. ఫలితంగా ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. యాత్ర ఫలితంగా కూలీలు తమ హక్కుల కోసం గళమెత్తడం ప్రారంభించారు. తమకు ఏమేం రావాలో తెలుసుకున్న తర్వాత వేతనాలపై కాంట్రాక్టర్లు, అధికారులను ప్రశ్నించారు. దీంతో కూలీలకు సరైన వేతనం చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు, పాలనా యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. అమర్‌సింగ్ ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి వచ్చింది. పేదల తరఫున నిరంతరం సాగిన పోరాటంతో అప్పటి ప్రభుత్వం సహాయక చర్యలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించాల్సి వచ్చింది. ఈ యాత్రతో బీజేపీకి గ్రామీణ ప్రాంతాల్లో పునాది ఏర్పడింది. అంతకుముందు ఆ పార్టీని ప్రధానంగా పట్టణ మధ్యతరగతి పార్టీగా భావించేవారు. కానీ క్రమంగా కూలీలు, రైతులు, గిరిజన వర్గాల్లోనూ మద్దతు పెరిగింది. పెద్ద సంఖ్యలో కొత్త కార్యకర్తలు కూడా పార్టీలో చేరారు. అన్నింటికంటే ముఖ్యంగా, మోదీ అనుసరించిన సేవా నమూనా బీజేపీకి, ప్రజలకు మధ్య భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరిచింది. నరేంద్ర మోదీ సంస్థాగత బాధ్యతలు చేపట్టిన 1989 నుంచి బీజేపీ లోక్‌సభ లేదా శాసనసభ ఎన్నికల్లో ఓటమి చూడకపోవడంలో ఆశ్చర్యం లేదు. ఆ తర్వాత ఆయన రాష్ట్రంలో పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించి, అనంతరం ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహించారు. ఈ విధంగా రాజకీయ రంగం, ప్రజా జీవితం ద్వారా ప్రజలకు సేవ చేయాలనే మోదీ రాజకీయ--సామాజిక ఆలోచనా విధానానికి న్యాయ యాత్ర ఒక కార్యాచరణ ప్రణాళికగా నిలిచింది. ప్రభుత్వ ప్రయోజనాలు ఉద్దేశించిన లబ్ధిదారులకు పూర్తిగా చేరేలా చూడటం, ప్రజాధనాన్ని దారి మళ్లించే మధ్యవర్తులను తొలగించడం, ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించడం ఇందులో ప్రధానాంశాలు. ప్రభుత్వాలకు నాయకత్వం వహించిన 25 ఏళ్ల కాలంలోనూ ఈ విధానం ఆయన కార్యాచరణలో అంతర్భాగంగా కొనసాగింది. మోదీ విజయానికి కారణమేమిటో కూడా ఇది స్పష్టం చేస్తుంది... సేవకు మించిన ప్రజా అనుసంధానం మరొకటి లేదు!

- (రచయిత సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ రచయిత)

బిడ్డలను కాపాడాల్సిన ఆసుపత్రే..

మృత్యువుకు ద్వారమైతే ఎట్లా...!

ఒక బిడ్డ పుట్టిన క్షణం ఆ కుటుంబానికి కొత్త జీవితానికి ఆరంభం. నెలల తరబడి ఎదురు చూసిన తల్లిదండ్రులు తమ బిడ్డను తొలిసారి చూసినప్పుడు భవిష్యత్తుపై ఎన్నో కలలు కంటారు. ఆ చిన్నారి ఎదుగుదలను చూడాలని, తమ కళ్ల ముందే నడవాలని, చదువుకోవాలని, జీవితంలో స్థిరపడాలని ఆశిస్తారు. కానీ ఆ ఆశలన్నీ ఆసుపత్రి గోడల మధ్యే ఆవిరైపోతే ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడం కూడా కష్టం. ఆదిలాబాద్ రిమ్స్‌లో నవజాత శిశువుల విభాగంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఈ విషాదాన్ని మరోసారి మన కళ్ల ముందుంచింది. అప్పుడే పుట్టి వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సిన పసికందులు ప్రాణాలు కోల్పోవడం ఒక ప్రమాదం మాత్రమే కాదు.. ఆసుపత్రి భద్రత, నిర్వహణ, అత్యవసర సన్నద్ధత, అధికారుల పర్యవేక్షణ వంటి అనేక అంశాలను ప్రశ్నార్థకం చేస్తున్న ఘటన. రిమ్స్‌లోని నవజాత శిశువుల విభాగంలో అగ్నిప్రమాదానికి విద్యుత్ పరికరం లేదా ఏసీ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం కారణమై ఉండొచ్చన్న అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అయితే అసలు కారణం ఏదైనా కావచ్చు.. ఒక పరికరంలో ఏర్పడిన లోపం ఇంతటి ప్రాణనష్టానికి దారితీయకుండా నిరోధించాల్సిన బాధ్యత మాత్రం ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థపైనే ఉంటుంది. పరికరాలు ఎప్పుడు తనిఖీ చేయబడ్డాయి? విద్యుత్ వ్యవస్థకు భద్రతా పరీక్షలు జరిగాయా? అగ్నిమాపక పరికరాలు పనిచేసే స్థితిలో ఉన్నాయా? అత్యవసర పరిస్థితుల్లో శిశువులను తరలించేందుకు ముందస్తు ప్రణాళిక ఉందా? సిబ్బందికి శిక్షణ ఇచ్చారా? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. నవజాత శిశువుల విభాగం సాధారణ వార్డు కాదు. అక్కడ చికిత్స పొందుతున్న పిల్లలు స్వయంగా కదలలేరు. కొందరు ఇంక్యుబేటర్లు, ఆక్సిజన్ సరఫరా, ఇతర వైద్య పరికరాలపై ఆధారపడి ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో మంటలు చెలరేగినా, పొగ వ్యాపించినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా వారిని క్షణాల్లో సురక్షిత ప్రాంతానికి తరలించడం అత్యంత క్లిష్టమైన పని. అందుకే ఈ విభాగాల్లో భద్రతా ప్రమాణాలు సాధారణ ఆసుపత్రి ప్రమాణాల కంటే మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒకవైపు పసికందుల ప్రాణాలను కాపాడేందుకు వైద్య సిబ్బంది పోరాడుతుండగా, మరోవైపు భవనం, విద్యుత్, అగ్నిమాపక వ్యవస్థలు కూడా అదే స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ ఆసుపత్రులు సామాన్య ప్రజలకు ప్రాణాధారం. ప్రైవేటు వైద్య సేవల ఖర్చులను భరించలేని కుటుంబాలు ప్రభుత్వ ఆసుపత్రులనే ఆశ్రయిస్తాయి. ముఖ్యంగా ప్రసూతి సేవలు, నవజాత శిశు సంరక్షణ, అత్యవసర వైద్యం వంటి విభాగాల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే కుటుంబాల సంఖ్య పెద్దది. అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రతా లోపం ఏర్పడితే దాని ప్రభావం ఒక్క కుటుంబానికే పరిమితం కాదు. ప్రజల ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ఉన్న నమ్మకాన్నే అది దెబ్బతీస్తుంది. వైద్య సదుపాయాలు పెంచడం ఎంత అవసరమో వాటి నిర్వహణ కూడా అంతే ముఖ్యం. కోట్ల రూపాయల విలువైన యంత్రాలను కొనుగోలు చేసి, ఆధునిక వార్డులను ఏర్పాటు చేసి, పడకల సంఖ్య పెంచడం ద్వారా మాత్రమే ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలపడదు. ఆ పరికరాలు నిరంతరం పనిచేసే స్థితిలో ఉన్నాయా? వాటికి కాలానుగుణ నిర్వహణ జరుగుతోందా? సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉన్నారా? విద్యుత్ వైరింగ్ పాతబడిందా? అగ్నిమాపక పరికరాల గడువు ముగిసిందా? అత్యవసర ద్వారాలు, మార్గాలు అందుబాటులో ఉన్నాయా? వంటి అంశాలను కూడా నిరంతరం పర్యవేక్షించాలి. నిర్వహణలో చిన్న నిర్లక్ష్యం ఒక్కోసారి పెద్ద విషాదానికి దారితీయగలదనే విషయాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది. సిబ్బంది కొరత, ఆసుపత్రి నిర్వహణలోని ఇతర లోపాలు కూడా ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది సంఖ్య తగినంతగా లేకపోతే అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందన వేగం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రమాదం జరిగిన ప్రతిసారీ మొత్తం బాధ్యతను ఒక్క సిబ్బందిపైనే మోపడం కూడా సరైన విధానం కాదు. వ్యవస్థలో ఎక్కడ లోపం ఏర్పడింది, ఎవరి బాధ్యత ఏ స్థాయిలో ఉంది, ముందుగా ఏ హెచ్చరికలు లేదా ఫిర్యాదులు వచ్చాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలి. వ్యక్తిగత తప్పిదం ఉంటే అది వేరుగా, నిర్వహణపరమైన వైఫల్యం ఉంటే అది వేరుగా గుర్తించాలి. ప్రమాదం జరిగిన తర్వాత విచారణ కమిటీలు వేయడం పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ విచారణ నివేదికలు ఫైళ్లకే పరిమితమైతే వాటి ప్రయోజనం ఉండదు. ప్రమాదానికి తక్షణ కారణాన్ని గుర్తించడంతో పాటు, దానికి దారితీసిన పరిస్థితులను కూడా పరిశీలించాలి. ఉదాహరణకు పరికరానికి నిర్వహణ అవసరమని ముందే గుర్తించారా? భద్రతా తనిఖీలో లోపాలు బయటపడ్డాయా? వాటిని సరిచేయడానికి నిధులు లేదా సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉన్నారా? ఉంటే చర్య ఎందుకు తీసుకోలేదు? లేకుంటే సంబంధిత అధికారులకు సమాచారం చేరిందా? ఇలాంటి ప్రశ్నలన్నింటికీ ఆధారాలతో సమాధానాలు రావాలి. అప్పుడు మాత్రమే బాధ్యత ఎవరిది అన్నది స్పష్టమవుతుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రసూతి విభాగాలు, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు, ఐసీయూలు, ఆక్సిజన్ ఆధారిత వార్డులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. అగ్నిమాపక పరికరాలు పనిచేస్తున్నాయా లేదా అన్నదాన్ని కాగితాలపై కాకుండా ప్రత్యక్షంగా పరీక్షించాలి. విద్యుత్ వైరింగ్, ఏసీ యంత్రాలు, జనరేటర్లు, ఆక్సిజన్ లైన్లు, అత్యవసర అలారాలు వంటి వ్యవస్థలను నిర్దిష్ట వ్యవధిలో తనిఖీ చేయాలి. ప్రమాద సమయంలో రోగులను ఎలా తరలించాలన్న దానిపై సిబ్బందికి క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలి. ఒకసారి శిక్షణ ఇచ్చి మరిచిపోవడం కాకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా సిబ్బంది స్పందనా సామర్థ్యాన్ని పరీక్షించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య, నర్సింగ్, సాంకేతిక, నిర్వహణ సిబ్బంది పోస్టులను భర్తీ చేయడం కూడా అవసరం. వైద్యుడు, నర్సు మాత్రమే ఆసుపత్రిని నడపరు. విద్యుత్ వ్యవస్థను చూసే సాంకేతిక నిపుణుడు, వైద్య పరికరాలను నిర్వహించే బయోమెడికల్ ఇంజినీర్, అగ్నిమాపక భద్రతను పర్యవేక్షించే సిబ్బంది, నిర్వహణ సిబ్బంది కూడా ఆసుపత్రి భద్రతలో కీలక పాత్ర పోషిస్తారు. ఈ వ్యవస్థలో ఏ ఒక్క భాగం బలహీనపడినా దాని ప్రభావం మొత్తం ఆసుపత్రిపై పడుతుంది. అన్నింటికంటే ముఖ్యమైనది బాధ్యత నిర్ధారణ. నిర్లక్ష్యం జరిగినట్లు విచారణలో తేలితే, ఆ నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై నిబంధనల ప్రకారం తగిన పరిపాలనా చర్యలు తీసుకోవాలి. వాస్తవాలు, రికార్డులు, తనిఖీ నివేదికలు, విధి నిర్వహణ వివరాలు, సాంకేతిక నివేదికల ఆధారంగా బాధ్యతను నిర్ణయించాలి. తప్పిదం ఎక్కడ జరిగిందో స్పష్టంగా గుర్తించి, అదే లోపం మరో ఆసుపత్రిలో పునరావృతం కాకుండా వ్యవస్థాత్మక మార్పులు చేయాలి. ఈ విషాదంలో తమ బిడ్డలను కోల్పోయిన కుటుంబాలకు ఏ పరిహారమూ జరిగిన నష్టాన్ని భర్తీ చేయలేదు. డబ్బుతో బిడ్డను తిరిగి తీసుకురాలేం. అయినప్పటికీ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు తగిన ఎక్స్‌గ్రేషియాను ప్రకటించి, తక్షణ ఆర్థిక సహాయం అందించడం కనీస మానవతా బాధ్యతగా పరిగణించవచ్చు. బాధిత కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పరిహారం అందించడంతో పాటు, అవసరమైన ఇతర ప్రభుత్వ సహాయాన్ని కూడా అందించాలి. వారి వేదనను కేవలం ఒక అధికారిక ప్రకటనతో ముగించకుండా, బాధిత కుటుంబాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలి. చివరికి ఈ ఘటనను ఒక వార్తగా మాత్రమే మిగలనివ్వకూడదు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, సమగ్ర విచారణ, బాధ్యత నిర్ధారణ, నిర్లక్ష్యం రుజువైతే సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల భద్రతా ఆడిట్, లోపాల సత్వర పరిష్కారం, అవసరమైన సిబ్బంది నియామకం, అత్యవసర తరలింపు శిక్షణ, పరికరాల నిరంతర నిర్వహణ వంటి చర్యలు ఒక సమగ్ర కార్యాచరణలో భాగం కావాలి. ప్రభుత్వం ఈ చర్యలకు గడువులు నిర్ణయించి, అమలు పురోగతిని ప్రజలకు తెలియజేయడం ద్వారా పారదర్శకతను పెంచవచ్చు. పుట్టిన కొన్ని గంటల్లోనే ప్రాణాలు కోల్పోయిన ఆ పసికందులు తిరిగి రావు. వారి తల్లిదండ్రుల జీవితాల్లో ఏర్పడిన అంధకారాన్ని ఏ వెలుగూ పూర్తిగా తొలగించలేదు. కానీ ఆ చిన్నారుల మరణం నుంచి వ్యవస్థ ఒక పాఠం నేర్చుకోవచ్చు. ఆసుపత్రిలో వైద్యం అందించడం మాత్రమే కాదు, రోగిని సురక్షితంగా కాపాడటం కూడా ప్రభుత్వ వైద్య వ్యవస్థ బాధ్యత. ఒక పరికరం లోపం ప్రాణాంతక ప్రమాదంగా మారకుండా ముందే గుర్తించడం, ఒక మంట విపత్తుగా మారకముందే ఆర్పివేయడం, ఒక శిశువును ప్రమాదం నుంచి క్షణాల్లో బయటకు తీసుకురావడానికి సిద్ధంగా ఉండటం---ఇవే ప్రజా ఆరోగ్య వ్యవస్థకు అసలైన పరీక్షలు. ఆ పరీక్షలో ఇకపై ఒక్క నిర్లక్ష్యానికి కూడా చోటుండకూడదు. బాధిత కుటుంబాలకు న్యాయం, వ్యవస్థలో బాధ్యత, ఆసుపత్రుల్లో భద్రత--- ఈ మూడు కలిసినప్పుడే ఆ విషాదానికి అర్థవంతమైన ముగింపు లభిస్తుంది. లేకపోతే ఈ ప్రభుత్వంపై ప్రజలకు ప్రభుత్వ హాస్పిటల్ పై నమ్మకం పోతుందనేది గుర్తేగాల్సిన అవసరం ఉంది.



-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

ఎల్ నినో

రుద్ర తాండవం

ఆకాశం కప్పుకుంది మౌనపు ముసుగు,
మేఘం మరిచింది చినుకు తలుపు.
వాన చినుకు కోసం నేల పడే ఆరాటం,
రైతు గుండెల్లో దిగని విషాదం.
కొండెక్కింది బియ్యపు గింజ,
కొనే శక్తి లేక కడుపులో నిస్తేజం.
రెక్కలు తొడిగింది కూరగాయల మండీ,
పేదోడి పొయ్యిలో ఆకలి మంటే ఉండీ.
భగ భగ మండే పెట్రోలు ధర,
నడిరోడ్డున నిలిచింది బ్రతుకు బండి రా.
పట్టణమంతా ట్యాంకర్ ల సంత,
నీళ్ళ కోసం జనం పడే తంటా అంతా ఇంతా కాదురా!
మాస్కు లేదు, వైరస్ లేదు,
అయినా వీధులన్నీ వెలవెల పోతున్నాయి.
కరోనా కాలం నాటి కర్ఫ్యూ నీడ,
మళ్ళీ వచ్చింది జన జీవనాన మీద!
ఎల్ నినో కాదురా, ఇది కలికాలపు హెచ్చరిక,
ప్రకృతిని మరిచిన మనిషికి ఇదే ఒక మహా పరీక్ష!

-నాగేందర్ లావుడి
పబ్లిక్ అడ్మినిస్ట్రేటర్
9949469679

జెండర్, మానవ హక్కులపై అంతర్జాతీయ సదస్సు

ఐసీఎఫ్ఏఐ న్యాయ విద్యాలయంలో ఘనంగా నిర్వహణ..

వందకుపైగా పరిశోధనా పత్రాల సమర్పణ

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 8 :
లింగ సమానత్వం, మానవ హక్కులు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి సమకాలీన అంశాలపై విస్తృత చర్చలకు ఐసీఎఫ్ఏఐ న్యాయ విద్యాలయం వేదికైంది. ఐసీఎఫ్ఏఐ ఉన్నత విద్యా సంస్థకు చెందిన న్యాయ విద్యాలయంలోని లింగ అధ్యయనాల అత్యుత్తమతా కేంద్రం ఆధ్వర్యంలో జెండర్, మానవ హక్కులపై రెండో అంతర్జాతీయ సదస్సును రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు.
మండల పరిధిలోని దంతాన్ పల్లిలోని ఐసీఎఫ్ఏఐ ప్రధాన ప్రాంగణంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో జరిగిన ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, న్యాయ నిపుణులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు హాజరయ్యారు. లింగ సమానత్వం, మానవ హక్కులు, సామాజిక న్యాయం, న్యాయాన్ని పొందే హక్కు తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలకు చెందిన పరిశోధకులు వందకుపైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఐసీఎఫ్ఏఐ న్యాయ విద్యాలయం డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ విజేందర్ కుమార్ ముఖ్య సంరక్షకుడిగా పాల్గొన్నారు. ఐసీఎఫ్ఏఐ ఉన్నత విద్యా సంస్థ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. విజయలక్ష్మి ప్రత్యేక ప్రసంగం చేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎ. వినయ్‌కుమార్ అధ్యక్ష ప్రసంగం చేశారు.
జపాన్‌లోని హిరోషిమా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ టోమో కవానే అంతర్జాతీయ దృక్పథంతో ప్రత్యేక ప్రసంగం చేశారు. కొచ్చిలోని జాతీయ ఉన్నత న్యాయ విద్యా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ జి.బి.రెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. గోవాలోని భారత అంతర్జాతీయ న్యాయ విద్యా, పరిశోధనా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. వెంకటరావు ప్రారంభోపన్యాసం చేశారు. సదస్సులో లింగ ఆధారిత హింస, ట్రాన్స్‌జెండర్ హక్కులు, రుతుస్రావ ఆరోగ్యం, ప్రజనన న్యాయం, లైంగిక వైవిధ్య హక్కులు, సాంకేతికత--వ్యక్తిగత గోప్యత, సంస్థల సామాజిక బాధ్యత, వాతావరణ మార్పులు--లింగ న్యాయం వంటి పలు అంశాలపై చర్చా కార్యక్రమాలు

నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త వైజయంతి వసంత మొగిలి ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సమానత్వం, గౌరవం, గుర్తింపు, న్యాయాన్ని పొందే హక్కులపై ప్రసంగించారు. బ్రిటన్‌లోని డర్హమ్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సోఫీ డోహెర్టీ రుతుస్రావ ఆరోగ్యం, మానవ హక్కులపై వివరించారు. మై ఛాయిసెస్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ ఫర్జానా ఖాన్ గృహ హింస అంశంపై ప్రసంగించారు.

రెండు కీలక అవగాహన ఒప్పందాలు

అకడమిక్, పరిశోధనా సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఐసీఎఫ్ఏఐ న్యాయ విద్యాలయం--గోవాలోని భారత అంతర్జాతీయ న్యాయ విద్యా, పరిశోధనా విశ్వవిద్యాలయం మధ్య ఒక ఒప్పందం జరిగింది. దీని ద్వారా విద్యా మార్పిడి, సంయుక్త పరిశోధనలు, విద్యార్థులు, అధ్యాపకులకు పరస్పర అవకాశాలు కల్పించనున్నారు.
అదేవిధంగా ఐసీఎఫ్ఏఐ న్యాయ విద్యాలయం--కొచ్చిలోని జాతీయ ఉన్నత న్యాయ విద్యా విశ్వవిద్యాలయం మధ్య మరో అవగాహన ఒప్పందం కుదిరింది. న్యాయ విద్య, పరిశోధన, విద్యా సహకారం, సంయుక్త కార్యక్రమాలను బలోపేతం చేయడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు.

మహిళలు 6.0' సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. విజయలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ విజేందర్

కుమార్ సంయుక్తంగా 'మహిళలు 6.0' అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిసెంబర్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఈ సదస్సులో మహిళా సాధికారత, లింగ సమానత్వం, మానవ హక్కులు, సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై విస్తృత చర్చలకు వేదిక కల్పించనున్నారు. సదస్సును లింగ అధ్యయనాల అత్యుత్తమతా కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఆస్తా శ్రీవాస్తవ సమన్వయం చేశారు. సదస్సు విజయవంతంగా ముగియడంతో లింగ న్యాయం, మానవ హక్కులు, సమ్మిళిత అభివృద్ధి, హక్కుల ఆధారిత న్యాయ విద్యను ప్రోత్సహించడంలో ఐసీఎఫ్ఏఐ న్యాయ విద్యాలయం తన నిబద్ధతను మరోసారి చాటింది.

శంకర్‌పల్లి చౌరస్తాలో జాయింట్ ఇన్‌స్పెక్షన్

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, ఆక్రమణల తొలగింపునకు నిర్ణయం

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 8 :
శంకర్ పల్లి చౌరస్తాలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడానికి ఉన్నతాధికారులు ఉమ్మడిగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. గురువారం నాడు ట్రాఫిక్ డీసీపీ (ఎఫ్‌సీసీ) శివం ఉపాధ్యాయ, ఐపీఎస్, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. సతీష్, మరియు శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీ యోగేష్ సంయుక్తంగా ఈ జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా శంకర్ పల్లి చౌరస్తా జంక్షన్ అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, మరియు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపుపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. చౌరస్తాలో ట్రాఫిక్ జామ్‌లకు తావులేకుండా, వాహనదారుల ప్రయాణం సాఫీగా సాగేలా మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రొద్దుటూరు, మోకిలా జంక్షన్లలో ట్రాఫిక్ బొల్లార్డ్స్ ఏర్పాటు

వాహనాల వేగాన్ని నియంత్రించి, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పూదూరు జంక్షన్ మరియు మోకిలా జంక్షన్లలో అధునాతన ట్రాఫిక్ బొల్లార్డ్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ బొల్లార్డ్స్ ద్వారా వాహనాల వేగం తగ్గడమే కాకుండా, క్రమశిక్షణతో కూడిన వాహన చోదక శైలి అలవడుతుందని, తద్వారా రోడ్డు భద్రత మరింత మెరుగవుతుందని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. సతీష్ పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

స్క్రాప్ షాపులో కత్తితో బెదిరించి దోపిడీ

రూ.30 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు అపహరణ

శంకర్‌పల్లి, వెలుతురు అక్టోబర్ 8 :
శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున దోపిడీ ఘటన చోటుచేసుకుంది. ఫతేపూర్ ఫ్లైఓవర్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే రహదారిపై ఉన్న స్క్రాప్ షాపులో రాజు (26) ఉండగా, తెల్లని స్కూటీపై ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి వచ్చారు. వారిలో ఒకరు రాజు మెడపై కత్తి పెట్టి బెదిరించగా, మిగిలిన ఇద్దరు షాపులో తనిఖీ చేసి రూ.30,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లు అపహరించుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో రాజు చెంపకు కత్తితో గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుల కోసం గాలింపు చేపట్టి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు నీటి దుర్వాసన రాకుండా తక్షణ చర్యలు చేపట్టండి : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 08:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో 132 – జీడిమెట్ల డివిజన్ జీడిమెట్ల గ్రామ పైప్ లైన్ రోడ్డు లోని "ఎన్సీఎల్ ఎల్బి గోదావరి"గత కొన్ని రోజులుగా మురుగునీటి దుర్వాసనతో వారు ఎదుర్కొంటున్న సమస్యను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ దృష్టికి తీసుకురాగా గురువారం క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే మురుగునీటి దుర్వాసన సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని, ఎక్కడ మురుగు నీరు నిల్వ ఉండకుండా దిగువ ప్రాంతాలకు మురుగునీరు సాఫీగా సాగిపోయేలా యుద్ధ ప్రాతిపదికన తక్షణ చర్యలు చేపట్టి మురుగు నీటి దుర్వాసన రాకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ భద్రు, ప్రాజెక్ట్స్ ఈఈ గోపాల కృష్ణ, జీఎం మాధవి లత, డీఈ దుర్గా ప్రసాద్, మేనేజర్ శివప్రసాద్, ఎన్సీఎల్ ఎల్బి గోదావరి ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ రాజేష్ మిశ్రా, ప్రధాన కార్యదర్శి జగన్నాథం, వైస్ ప్రెసిడెంట్ పి.ఎన్. అనురాధ, కోశాధికారి రామేశ్వర్ రావు, కల్చరర్ సెక్రెటరీ సతీష్ కుమార్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

SIR అక్రమాలపై భారీ నిరసన మార్చ్‌లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి అక్టోబర్ 08:
SIR ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, అవకతవకలకు నిరసన AICC ఆదేశాల మేరకుᰁజజ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన భారీ నిరసన మార్చ్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, ఓటర్ల జాబితాలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలని అన్నారు. ా×= ప్రక్రియలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు,మంత్రివర్యులు, ఱజజ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, SC, ST, NSUI, INTUC విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నోములలో రైతు పొలంబడి కార్యక్రమం

- **వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి**
- **వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు**

మంచాల వెలుతురు అక్టోబర్ 08:
మంచాల మండలం నోముల గ్రామంలో రైతుపొలాల వద్ద వ్యవసాయ సాంకేతి యాజమాన్య సంస్థ ఆత్మ మరియు వ్యవసాయ శాఖవారి ఆధ్వర్యంలో రైతుక్షేత్ర పాఠశాల పొలంబడి కార్యక్ర మంలో భాగంగా వరి పంట ప్రస్తుత దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి అవగా హన కల్పించారు ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరిపంట ప్రస్తుత దశల్లో కాండంతొ లుచు పురుగు ఆశించే అవకాశం ఉందని దీని ప్రభావంతో తెల్ల కంకులు వస్తాయని తెలిపారు తెల్ల కంకులు రాకుండా ఉండటానికి చిరు పొట్టదశలో పొట్టవచ్చేముందు కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ గుళికలు 8కిలోలు లేదా కార్బోఫ్యూరన్10కిలోలు20కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని తెలిపారు

పిచికారి అయితే కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్ పి2.0 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచి కారి చేసుకోవాలని కోరారుఅదే విధంగా వరిలో ఈ దశలో అగ్గి తెగులు వచ్చేఅవకాశం ఉందని తెలిపారు ఆకులతో మధ్యలో బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయిఈ మచ్చలు గుండ్రనిలేదా కండె ఆకారంలో ఉంటాయి ఆకులు ఎండిపోయి తగులబడినట్లుగా కనిపిస్తాయి పిలకల కొను పులవద్ద ఈ తెగులు ఆశిస్తే ఆప్రాంతం వద్ద విరిగి పిలక వాలిపో తుందిమెడవిరుపు దశలో వె న్ను కంకి మెడభాగంలో తెగులు ఆశించడం వలన వెన్నులు విరిగి క్రిందకు వాలిపోతాయి ఈ అ గ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్75% డబ్ల్యుపి ఎకరానికి0.6 గ్రాములు/లీటరు నీటికిలేదాఐ సోప్రోథియోలేన్ 40% ఈసీ1.5 మి.లీ./లీటరు నీటికికాసుగామైసిన్ 3%ఎస్ ఎల్ 2.5 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి సిఫార్సు చేసిన నత్రజని ఎరువుల మోతాదునుమించ కుండా ఉపయోగించాలి పొలంలో నీరు లేకుండా ఆరగట్టరాదు అని తెలిపారుఈ పొలంబడి కా ర్యక్రమంలో వ్యవసాయ పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్ వరి ప్రధాన శా స్త్రవేత్త స్రవంతి ఉద్యాన శాస్త్రవేత్త మండల వ్యవసాయ అధికారి జి వెంకటేష్ నోముల గ్రామస ర్పంచ్ బత్తులశృతి ఉపసర్పంచ్ దుర్గప్రసాద్ ఏఈఓలు సాయి సిరి నికిత లింగస్వామి వార్డు స భ్యులు మాజీ ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే రంగారెడ్డి పై బిఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుండె మోని జయమ్మ మల్లేష్ ముదిరాజ్

మంచాల వెలుతురు అక్టోబర్ 08:
మంచాల మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యద ర్శి మంచాల మండలం మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మ మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మ హాలక్ష్మి ఉచిత బస్సుప్రయాణం ఎలాఉందో తెలుసుకో వడానికి బస్సులో ప్రయాణం చేస్తూ మ హిళల దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ఉచిత ప్రయాణ సౌకర్యం ఎలాఉంది అని తెలు సుకునే సమయంలో బిడ్డలాంటి ఓఅమ్మాయి చెయ్యిపట్టు కొని ఉచిత ప్రయాణం ఎలా ఉంద మ్మా అని అడిగి తెలుసుకున్నారు దాన్ని కొంతమంది బిఆర్ పార్టీ.పోకిరీలు వీడియోతీసితప్పు గా వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేయడం సిగ్గుచేటు సరైన పద్ధతి కాదు అ ని అన్నారు ఆడపిల్ల అంటే అమ్మతో సమానం హిందూధర్మంలో మహిళని మహాలక్ష్మిలపూజి స్తాం మీకుటుంబాల్లో ఆడపిల్లలు లేరా మీఆడపిల్లల్ని చెయ్యి పట్టుకొని ఆప్యాయంగా ముచ్చటి స్తే మేము ఇలాగానే ప్రచారం చేయాలా అని బిఆర్ఎస్ పార్టీ నాయకులను మీడియా ద్వారా ప్ర శ్నించారు ఏనాయకుడైనా రాజకీయంగా విమర్శలు చేసేటప్పుడు నిజానిజాలు తెలుసుకొనిమా ట్లాడాలి అని అన్నారు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆడపిల్లలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆ వేదన వ్యక్తం చేశారు ఆడది అంటే మీకు ఆట బొమ్మలాగా కనిపిస్తుందా కండ్లకు ఎన్నికల సమ యంలో ప్రతిరాజకీయ నాయకుడు మహిళలను ఆప్యాయంగా పట్టుకొని భుజంపై

చెయ్యివేసి మరి ప్రచారం చేస్తారు అలాంటప్పుడు రాని చెడుఆలోచన ఇప్పుడే వస్తుందా ఇది కేవలం కా వాలని కొంతమంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారిని బాదలం చేయడానికి అని అన్నారు ఎవ్వరు ఎన్నిప్రచారాలు చేసిన మాప్రియతమా నాయకుడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు నిప్పు నిజాయితీగల ఒక గొప్ప నాయకుడు మారంగన్న అని అన్నారుఇబ్ర హీంపట్నం నియోజకవర్గంలో మల్ రెడ్డి రంగారెడ్డి గారు అన్నిగ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు అని మండి పడ్డారు రాజకీయకంగా ఎలాంటి విమర్శలు అయినా చేసుకోవచ్చు ప్రచారాలు చేసుకోవచ్చు కానీ ఒక ఆడపిల్లను అడ్డం పెట్టుకొని టిఆర్ఎస్ నాయకులు చేసిన పెద్ద తప్పు అని అన్నారు రాబోయే రోజుల్లో నియోజకవర్గం మహిళలే బిఆర్ఎస్ పార్టీ నాయకులకు సరైన బుద్ధి చెప్తారు అని అన్నారు ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి పైన తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలి లేనిపక్షంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహి ళలతో కలిసి పెద్దఎత్తున బిఆర్ఎస్ పార్టీ నాయకులకు తగిన గుణపాఠం చెప్తుతాం అని హెచ్చ రించారు

వివేకానంద నగర్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు

ఆర్టీసీ బస్సులు, ఆటోలు నిలిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు: ఎమ్మెల్యే అరికపూడి గాంధీ

కూకట్ పల్లి అక్టోబర్ 08 వెలుతురు:
ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వివేకానందనగర్‌లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ తెలిపారు. వివేకానందనగర్ మెయిన్ రోడ్ నుంచి సర్వీస్ రోడ్డులో ఎమ్మెల్యే పర్యటించి స్థానికంగా ఉన్న రవాణా, ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు, బస్‌స్టాప్ ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డును అవసరమైన మేరకు విస్తరించి, ఆర్టీసీ బస్సులు సులభంగా నిలిచేలా బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా వివేకానందనగర్ కాలనీ ప్రధాన ప్రవేశద్వారం వద్ద బస్సులు, ఆటోలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయంగా ప్రత్యేక స్థలంలో స్టాప్ ఏర్పాటు చేయనున్నట్లు

పేర్కొన్నారు. దీంతో కాలనీ ప్రధాన ఎంట్రన్స్ వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడకుండా నిరంతరం కృషి చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. నర్సింగ్‌రావు, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, జి. ప్రసాద్, సి.కె. రెడ్డి, కె.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు

కూకట్ పల్లి అక్టోబర్ 08 వెలుతురు:
శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు శుక్రవారం కొండాపూర్‌లోని రెడిసన్ హోటల్‌లో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎర్రదొడ్డి భాస్కర్‌రెడ్డి గజ్జల యోగానందను శాలువాతో సత్కరించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపుతూ శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామాల శ్రీనివాస్,

శ్రీనివాసరెడ్డి, పలువురు బీజేపీ సీనియర్ కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని గజ్జల యోగానందకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై దుష్ప్రచారం తగదు

- **సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఉపేక్షించొద్దు**
- **కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**

ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 08:
ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడు తూఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని అన్నారు కలెక్టరేట్ వద్ద సమావేశం ముగించుకొని

బయలుదేరుతున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకం గురించి మహిళల స్పందనను తెలుసుకోవడానికి ఆయన బస్సు ఎక్కారని తన కూతురు లాంటి అమ్మాయితో చేయి పట్టుకొని ఆప్యాయతతో మాట్లాడితే సంస్కారంలేని నాయకులు ఎమ్మెల్యేపైన సోషల్ మీడియాలో విషప్రచారం చేస్తు న్నారని అన్నారు దమ్ముంటే అభివృద్ధిపై ప్రశ్నించాలని రాజకీయ విమర్శచేస్తే హుందాగా ఉం డాలని ఇట్లా ఆడపిల్లల గౌరవాలకు భంగం కలిగించేలా ఉండొద్దని హితవు పలికారు ప్రతీ మ హిళను తన తల్లిలా చెల్లిలా పలకరించే రంగారెడ్డి తన రాజకీయ జీవితంలో మహిళలకు అ త్యంత ప్రధాన్యత ఇచ్చి గౌరవిస్తారని అన్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే తట్టుకోలేని బిఆర్ఎస్ నాయకులు కుళ్ళు తో విమర్శించడానికి ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నా రని ఇలాంటి వారిని క్షమించి వదిలేస్తే సమాజానికి మంచిదికాదని మరోసారి ఆడపిల్లల గౌరవా నికి భంగం కలిగేలా సోషల్ మీడియాలో వక్రీకరణలు చేయకుండా కఠినంగా శిక్షించాలని అన్నారు

సన్న రకం ధాన్యానికి బోనస్ పెంచండి

బిజెపి ఓబీసీ మోర్చా జనగామ జిల్లా ఇన్చార్జి పోచం సోమయ్య.

మోత్కూర్, అక్టోబర్8,వెలుతురు న్యూస్ : సన్న రకం పండిస్తున్న రైతాంగానికి క్వింటాలుకు 1500 రూపాయలు బోనస్ ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని బిజెపి ఓబీసీ మోర్చా జనగామ జిల్లా ఇన్చార్జి పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఎల్నినో ప్రభావంతో సన్న రకం వరికి విపరీతమైన తెగుళు ఆశించిన కారణంగా పంట దిగుబడి చాలా తగ్గిపోయే ప్రమాదం ఉందని. ఇప్పటికే వేరే జిల్లాలో సన్నధాన్యానికి మద్దతు ధర బోనస్ లేకుండా ప్రైవేటు వ్యాపారస్తులు 4,000 నుండి 4,500 వరకు పచ్చిధాన్యాన్ని కొంటున్నారని ఈ విధంగా ప్రైవేటు వ్యాపారస్తులు సన్నధాన్యము కొనడం వలన తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ షాపులో సన్న బియ్యం పథకము ఆగిపోయే ప్రమాదం పొంచి ఉన్నందున ప్రభుత్వము సన్నధాన్యానికి ఎక్కువ మద్దతు ధర రైతులకు చెల్లించి సన్నధాన్యము సేకరించుటలో ఇబ్బందులు లేకుండా చేసి బలహీన వర్గాలకు రేషన్ షాపులో ఇచ్చే సన్నబియ్యానికి ఆటంకం కలగకుండా ప్రభుత్వము ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ కార్యదర్శి తీగల శ్రీధర్ గౌడ్ యువ మోర్చా మండల అధ్యక్షులు బద్దం మహేందర్ రెడ్డి ఉన్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా డైరెక్టర్లకు సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

మోత్కూర్, అక్టోబర్ 8, వెలుతురు న్యూస్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా డైరెక్టర్లుగా ఎన్నికైన అడ్డగూడూరు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మోత్కూరు ఈనాడు పత్రిక విలేకరి ఎస్.ఎన్. చారిలు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన రెడ్‌క్రాస్ ఎన్నికల్లో తమ ఎన్నికకు సంబంధించిన వివరాలను మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా గాదరి కిశోర్‌కుమార్ ఇద్దరినీ శాలువాలతో సత్కరించి అభినందించారు. రెడ్‌క్రాస్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాల్లో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు జంగా శ్రీను, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- **ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**
- **యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ప్రదర్శన, రాస్తారోకో**

యాదగిరిగుట్ట, అక్టోబర్ 8 వెలుతురు ఓట్లను చోరీ చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు . బిజెపి ఓట్ చోరీ కార్యక్రమానికి నిరసనగా ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీల పట్ల పోలీసులు ప్రవర్తించిన దురుసు ప్రవర్తనకు నిరసనగా ప్రజాస్వామ్యానికి బ్లాక్ డే అనే పేరుతో గురువారం యాదగిరిగుట్టలో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన రాస్తారోకో కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత తదితర అంశాలపై కాంగ్రెస్ పార్టీ కూటమి నేతలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పాటు పలువురు ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు అక్టోబర్ 8వ తేదీని బ్లాక్ డే గా పాటిస్తూ దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న 'ఓట్ చోరీ' ఆరోపణలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ప్రతిపక్ష నాయకులపై పోలీసుల చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్ , కాంగ్రెస్ పార్టీ యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు, 11వ వార్డు కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్ యాదవ్, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు , బూడిద మధు, బిక్షపతి , కౌకుంట్ల బాలిరెడ్డి , కోలా కృష్ణ గౌడ్ , గుడ్ల నరేష్ కుమార్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జానపద వృత్తి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 08: కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని పిఎన్ఎం రాష్ట్రకార్యదర్శి కట్ట నరసింహ అన్నారు. గురువారం చౌటుప్పల్ లో నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కళాకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కళాకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నెలలు గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన విధంగా ఉన్నది వృత్తి కళాకారులకు 5వేల,రూపాయలు పింఛను ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ జిల్లాలో ఉన్నటువంటి జానపద వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారంకై చలో కలెక్టరేట్ నిర్వహిస్తాం మని హెచ్చరించారు కళాకారులైనటువంటి చిందు,యక్షగానం, కోలాటం, బాగోతం, భజన కళాకారులకు, ప్రభుత్వం గుర్తించి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లేనియెడల జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ముందు కాలుకు గజ్జ కట్టి చేత డప్పు పట్టి భుజాన గొంగడి వేసి పాలకుల విధానాలను ఆటపాటల ద్వారా కళాకారులను సమీకరించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, పిఎన్ఎం రాష్ట్ర కోశాధికారి అవ్వారు గోవర్ధన్

పిఎన్ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటే పాక శ్రీకృష్ణ జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరసింహ, సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు వేముల జైలు రామన్నపేట మండలం అధ్యక్షులు బర్రె మధు నారాయణపురం మండల అధ్యక్ష కార్యదర్శులు బోయిన్ మల్లేష్ పిట్టగలయ్య ఎస్.కె మదర్ పబ్బతి పుల్లయ్య జిల్లా కమిటీ సభ్యురాలు వీర్లపల్లి నర్సమ్మ కమిటీ సభ్యులు గణేష్ సురేష్ బోల్లేపల్లి ప్రవీణ్ ఈర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన

మునుగోడు,అక్టోబర్ 8 (వెలుతురు): ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రాథమిక హక్కైన ఓటును పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఏఐసీసీ పిలుపు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మునుగోడు చౌరస్తాలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేయడమేనన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాలని, ఓట్ల తొలగింపునకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి జాజుల అంజయ్య గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బూడిద లింగయ్య యాదవ్, చండూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి,కాంగ్రెస్ మండల నాయకులు జక్కల శ్రీనివాస్, పంతంగి స్వామి, మందుల బీరప్ప, ఆరేళ్ల సైదులు,సంకు శంకర్,ఎండి అన్వర్,పాలకూరి మహేష్,ఆవుల శ్రీను, వివిధ గ్రామాల సర్పంచులు కంభంపాటి వెంకటేశ్వర్లు, దాసరి గోవర్ధన్,కదిరే లింగయ్య,వరికుప్పల విజయ్,కొంపల్లి ఉపసర్పంచ్ వెదిరె విజయేందర్ రెడ్డి, నాయకులు నన్నూరి సత్తిరెడ్డి,నక్క వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ప్రధాని, జ్ఞానేశ్ కుమార్‌ల దిష్టి బొమ్మ దగ్ధం

మోత్కూర్, అక్టోబర్ 8,వెలుతురు న్యూస్ : రాహుల్ గాంధీ గారిని ఢిల్లీలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ మోత్కూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్,పట్టణ అధ్యక్షులు బద్దం నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు, ఓటర్ల హక్కుల కోసం ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అణచివేయడం సరికాదని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ గారు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ పై చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ,కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టి బొమ్మలు దగ్నం చేశారు. ఈ కార్యక్రమంలో ్రాజూ చైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు,ఐజజ కార్యదర్శి కూరెళ్ళ శ్రీరాములు, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి,జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనరసింహా రెడ్డి, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి ,గడ్డం సోమ నర్సయ్య,మందుల సురేష్ ,మండల , పట్టణ మహిళా అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ,అన్నెపు పద్మ,మండల నాయకులు పురుగుల నర్సింహ,ఎడ్ల భగవంత్ వంగరి రాములు,దేవరపల్లి రంగారెడ్డి,ఆర్థ ప్రతాప్ రెడ్డి,వర్రె హరిప్రసాద్, గడ్డం లక్ష్మయ్య ,కురిమేటి సైదులు, గంజి మంగమ్మ,సదర్శపూర్ మరియు పనకబండ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లెర్ల భాస్కర్,బత్తిని ధర్మయ్యా, మండల పట్టణ సోషల్ మీడియా ఇంచార్జీలు బందేల రవి, పాలోజు శేఖరాచారి,వార్డు అధ్యక్షులు తాటిపాముల బ్రహ్మ చారి,కస్తూరి వీరాస్వామి,మొగుళ్ళ వెంకట్ రెడ్డి, కందుకూరి నర్సింహా,వర్రె మహేందర్,కూరెళ్ళ అంజయ్య, కొనస ఉప్పలయ్య, బర్రె వెంకన్న, కోమటి జనార్ధన్,రాంపాక రాము తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం భవనానికి రూ.20 లక్షలు ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి.

మోత్కూర్, అక్టోబర్ 8, వెలుతురు న్యూస్ : మోత్కూర్ గౌడ సంఘం మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రాష్ట్ర ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మోత్కూర్ మున్సిపల్ కౌన్సిలర్లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కారుపోతుల వెంకన్న గౌడ్, బీసు శ్రీకాంత్ గౌడ్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతోపాటు తొలి విడతగా రూ. 10 లక్షలను జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి చేతుల మీదుగా వెంటనే అందజేశారు. మోత్కూర్ పట్టణంలోని 11వ వార్డు అన్నెపు బజార్‌లో 1982లో మోత్కూర్ తాలూకా స్థాయి గౌడ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 10 గుంటల స్థలంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మించనున్నారు. తన కుమారుడు ప్రతీక్‌రెడ్డి జ్ఞాపకార్థం కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు మంత్రి ప్రకటించినట్లు కౌన్సిలర్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. పనులు 50 శాతం పూర్తయిన అనంతరం మిగిలిన రూ. 10 లక్షలను అందజేస్తామని హామీ ఇచ్చారు. మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తయితే మోత్కూర్‌తో పాటు అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు మండలాల గౌడ సోదరులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కౌన్సిలర్లు తెలిపారు. గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు ప్రకటించి, తొలి విడతగా రూ. 10 లక్షలను వెంటనే అందజేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్, బీసు శ్రీకాంత్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, అడ్వకేట్ పర్రెపాటి యుగంధర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అవిశెట్టి అవిలిమల్లు, కౌన్సిలర్లు మొగుళ్ల అనురాధ, మెంట రమణ, కుర్మిల ప్రమీల, కాంగ్రెస్ నాయకులు వెంట నగేష్, కుర్మిల రాములు, మొగుళ్ల శ్రీనివాసరెడ్డి, మెంట సురేష్, ఆలకుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అక్రమ అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 08: కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షులు బోయే దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఓటు చోరీకి పాల్పడుతున్నారంటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)పై ఆరోపణలు చేస్తూ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మరియు ఇండియా కూటమి నేతలు చేపడుతున్న నిరసనలకు మద్దతుగా ఈ ధర్నా నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేతల అరెస్టులు, లాఠీచార్జీలను నిరసిస్తూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ్రాూజ చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్్రాూజ వైస్ చైర్మన్ పర్ని శివారెడ్డి, జిల్లా కార్యదర్శి చింతల సాయిలు, మాజీ అధ్యక్షులు బక్క శ్రీనాథ్, సుర్వి నరసింహ గౌడ్, రిక్కల మహేందర్‌రెడ్డి, పాక చిరంజీవి, బర్రె గాలయ్య, పస్తం గంగరాములు, మీసాల నరసింహ, పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం సత్తయ్య,బొబ్బిలి రాజేందర్,దుబ్బాక ఆకాష్ రెడ్డి, బండమీది ఎల్లయ్య, కొరవని లింగస్వామి, వీరముల సత్తయ్య, బుడిగే బాలకృష్ణ, మాదాని గోపాల్ ,వర్కాల వెంకటేష్, వెంకట్ కుమార్, రవికాంత్ రెడ్డి, కరెంటు శంకర్ నాయక్, జక్కడి వెంకట్ రెడ్డి, చెక్క మల్లయ్య, మేకల దేవేందర్ రెడ్డి, లందగిరి యాదయ్య, బుడుగు వెంకటేశం, పోలోజు శ్రీనివాస్ చారి, నరసింహ మాదాని ఎల్లప్ప, ఎండి ఎజాస్ పాషా, పాశం కృష్ణ,

క్షేత్రస్థాయి పనితీరు మారితేనే జాతీయ ర్యాంకింగ్‌లో సత్తా : డీజీపీ

రాష్ట్రంలో కొత్త క్రిమినల్ చట్టాల అమలు, నేర దర్యాప్తులో వెనుకబడిన పోలీసు యూనిట్ల పనితీరుపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో యూనిట్ల పనితీరు మెరుగుపడితేనే, జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసు శాఖ ర్యాంకింగ్ పెరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో.. దర్యాప్తులో వెనుకబడిన యూనిట్ల పనితీరుపై ఆయా జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు, సీనియర్ అధికారులతో డీజీపీ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల పరిష్కారం, నేరస్థులకు శిక్షలు పడేలా చూడటం, కొత్త చట్టాల అమలుపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

ఈగల్ ఫోర్స్, సైబర్ బ్యూరోలే స్ఫూర్తి..

జాతీయ స్థాయిలో రాష్ట్ర ర్యాంకింగ్ పెరగాలంటే ప్రతి యూనిట్ తమ పనితీరును మెరుగుపరుచుకోవడం అత్యవసరమని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును ఆయన ఉదాహరణగా చూపారు. నిరంతర సమీక్షలు, లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకునే విధానాల వల్లే ఈగల్ ఫోర్స్ నేడు దేశంలోనే అత్యుత్తమ యూనిట్‌గా నిలిచిందని, సైబర్ నేరాల నియంత్రణలో రాష్ట్రం జాతీయ స్థాయి గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. ఇదే తరహాలో ప్రతి యూనిట్‌లో నిరంతర సమీక్షలు జరగాలని, క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు.

ఆరు కీలక అంశాలపై ఆరా..

సమీక్షా సమావేశంలో ప్రధానంగా ఆరు కీలక అంశాలపై డీజీపీ దృష్టి సారించారు. దర్యాప్తులో ఉన్న కేసుల పరిష్కారం, లైంగిక నేరాల ట్రాకింగ్ సిస్టమ్, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం, నేరం జరిగిన ప్రదేశంలోనే ఎఫ్ఐఆర్ నమోదు, ఈ సాక్ష్య యాప్ సమర్థ వినియోగంపై అధికారులతో చర్చించారు. ఈ విధానాల అమలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. సాంకేతికపరంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి, కొత్త చట్టాలపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించడానికి అవసరమైన చోట ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. ముఖ్యంగా సీసీటీఎన్ఎస్ ద్వారా నమోదయ్యే డేటాను సమర్థంగా వాడుకోవాలని, డేటా విశ్లేషణ ద్వారా నేరాల నివారణకు వ్యూహాలు రచించాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాల అమలులో రాష్ట్రంలో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి, రామగుండం కమిషనరేట్లు మెరుగైన పనితీరు కనబరిచాయని డీజీపీ ప్రశంసించారు.

ఆంధ్రా గుప్పిట్లో సాగునీటి శాఖ

మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్ర సాగునీటి శాఖ ఆంధ్రా గుప్పిట్లో ఉన్నదని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం మూడోసారి వెనక్కి పంపిందని.. ఇది పాలమూరుకు అవమానమని.. బనకచర్ల కోసమే ఇదంతా జరుగుతున్నదని అన్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ బనకచర్లకు ఒప్పుకుంటే పాలమూరుకు అనుమతి ఇస్తామని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని.. కేంద్ర జలశక్తి కార్యదర్శి కాంతారావు ఏపీకి చెందిన వ్యక్తి అని పేర్కొన్నారు. 90 టీఎంసీలపై క్లారిటీ లేదంటుం టున్నారని.. కుంటి సాకులు చెబుతున్నారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డికి ప్రధానమైన అడ్డంకులు 2023 ఆగస్టు 10 నాడే తొలిగిపోయాయని.. నాడు చిన్న సంతకం పెండింగ్‌లో పడిందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం పాలమూరు దురదృష్టకరమన్నారు. ఎన్నికలైన తర్వాత కేంద్రంలో చంద్రబాబు మద్దతుతో ప్రభుత్వం ఏర్పడటంతో సంతకం ఆగిపోయిందని.. ఏపీలో పనిచేసిన ఆయన్ను రాష్ట్ర సాగునీటి శాఖ ముఖ్య సలహాదారుగా పెట్టుకుంటే డీపీఆర్ తిరిగి రాకుంటే ఏమవుతుందని ప్రశనించారు.

జాతీయ హోదా లేకున్నా సొంత నిధులతో రాష్ట్రం ప్రాజెక్టు కట్టుకుంటే కనీసం అనుమతి ఇవ్వడం లేదన్నారు. 45 టీఎంసీల నీటి కేటాయింపునకు సంబంధించి 1980లోనే బచావత్ ట్రిబ్యునల్ స్పష్టంగా పేర్కొన్నదని వెల్లడించారు. ఎంపీలు ఏం చేస్తున్నారని.. పాలమూరు బతుకు ఏం చేస్తారని నిలదీశారు. .

సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలి

అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ వెలుతురు అక్టోబర్ 08: గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ఆర్టిఐ వారోత్సవాలు 2026 అవగాహన సదస్సులో భాగంగా సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని స్వచ్ఛందంగా సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉంచాలని పనితీరులో పారదర్శకత జవాబుదారీతనాన్ని పాటించాలని జిల్లా అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా అధికారులు సిబ్బందితో సమాచార హక్కు చట్టం 2025 పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ వో మాలతి వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలసిరి పథకం, చేయూత పెన్షన్ వెరిఫికేషన్ పనుల తనిఖీ

పనులను పర్యవేక్షించిన జిల్లా డిఆర్‌డిఎపిడి శ్రీనివాసరావు

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 8:
కౌడిపల్లి మండలం రాజిపేట గ్రామంలో జరుగుతున్న జలసిరి పనులను మరియు చేయూత పెన్షన్ వెరిఫికేషన్ పనులను జిల్లా డిఆర్ డి ఏ పిడి శ్రీనివాసరావు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ జలసిరి పథకం వల్ల వర్షపు నీరును గుంతలలో నిలువ చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటకుండా ఉంటాయని ఈ జలసిరి పథకం ద్వారా బోరు బావులలో నీరు పుష్కలంగా ఉంటుం

దని దీనివల్ల రైతులకు పంట పండించడానికి మేలు జరుగుతుందని అన్నారు. ఈ జలసిరి పథకాన్ని ప్రతి ఒక్కరైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న చేయూత పెన్షన్ వెరిఫికేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులైన వారి నుంచి వివరాలను ఏ విధంగా సేకరిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాంచ దుర్గమ్మ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పుణ్యాదాస్, ఉప సర్పంచ్ ప్రవీణ్, కార్యదర్శి నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్ గంగారాం గౌడ్ మరియు రైతులు పాల్గొన్నారు.

వెల్మకన్న సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

పాల్గొన్న సింధు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పార్థసారథి రెడ్డి

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 8:
కౌడిపల్లి మండలంలోని వెల్మకన్న గ్రామంలో సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్ గారి ఆధ్వర్యంలో సింధు హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సర్పంచ్ శివ లీల సతీష్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి వృద్ధులకు, మహిళలకు, చిన్న పిల్లలకు ఎలాంటి సమస్య ఉన్న ఇలాంటి ఉచిత వైద్య శిబిరాల వల్ల ఎలాంటి సమస్య ఉన్న నయం చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సింధు హాస్పిటల్ చైర్మన్ మరియు రాజ్యసభ సభ్యుడు అయినటువంటి డాక్టర్ పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ మీ గ్రామ సర్పంచ్ సహకారంతో మీ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉందని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ కూడా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభు, మాజీ వైస్ ఎంపీపీ బొడ్ల నవీన్ గుప్తా, రవి సాగర్, సాయి గౌడ్, కర్ణం చంద్రం, వహీదా, రజాక్, హాస్పిటల్ సిబ్బంది చాగంటి శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ అనీషా, డాక్టర్ ఉమర్ అబ్దుల్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను తనిఖీ చేసిన మండల విద్యాధికారి బాల్ రాజు

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 8:
మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను మండల విద్యాధికారి బాల్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాల్ రాజు మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంటగది దాని పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని,

వంట సామాగ్రిని, కూరగాయలను పరిశుభ్రమైన స్థలం లో నిల్వ ఉంచాలని సూచించారు. అదేవిధంగా ఈ పాఠశాలను కిరాయి భవనం నుండి స్వంత భవనంలోకి మార్చాలని ప్రిన్సిపాల్ సూచించారని ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణి కుమార్, వార్డెన్, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

అలకాపురి ఓవెల్స్ కాన్వెంట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

రంగారెడ్డి జిల్లా, వెలుతురు అక్టోబర్ 8:
అలకాపురిలోని ఓవెల్స్ కాన్వెంట్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థినులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎట్టపు రాధిక మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ప్రత్యేక పండుగ అని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ పూల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. బతుకమ్మను వివిధ రకాల స్థానిక పూలతో అందంగా పేర్చడం ద్వారా ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యత, ఆత్మగౌరవం, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

యువకుని కుటుంబానికి కుంభం ఆర్థిక సాయం

మునుగోడు వెలుతురు అక్టోబర్ 08:
మునుగోడు మండలంలోని జమస్తాన్ పల్లి గ్రామానికి చెందిన జినుకల సైదులు పెద్ద కుమారుడు జినుకల రామకృష్ణ (28) అనే యువకుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,డిసిసిబి ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి గారు తక్షణ సాయం కింద 10,000రూపాయలు ఆర్థిక సాయం పంపడం జరిగింది. ఇట్టి ఆర్థిక సహాయం గ్రామ సర్పంచ్ అందుగుల నర్సమ్మ యాదయ్య, మాజీ సర్పంచులు పంతంగి స్వామి, ముంత యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్ జాజుల స్వామి గౌడ్ గార్లు మృతుడుని కుటుంబ సభ్యులకు అందించి, మృతదేహానికి పూలమాలవేసి, పరామర్శించడం జరిగింది. నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించిన కుంభం శ్రీనివాస్ రెడ్డి గారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాజుల శంకర్, ముంత హేమంత్, పంతంగి వెంకన్న, జాజుల రవి, పంతంగి ప్రసాద్, కొప్పుల అశోక్, అందుగుల నరేందర్, ముంత రవీందర్, అందుగుల మారేష్, జినుకల స్వామి, పగిళ్ల సైదులు, పగిళ్ల లింగస్వామి, పంతంగి ప్రతాప్, చెక్క లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ సభ్యుడిని కలిసిన సురిగి నరసింహ గౌడ్

మునుగోడు,అక్టోబర్ 8 (వెలుతురు)
:తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్‌ను మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ చారకొండ వెంకటేష్‌ను సురిగి నరసింహ గౌడ్ శాలువాతో సత్కరించారు. అనంతరం పలు విషయాలపై పరస్పరం

చర్చించుకున్నారు. విద్యారంగానికి సంబంధించిన అంశాలు ,విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సురిగి నరసింహ గౌడ్ ఆకాంక్షించారు.

3వ వార్డులో రూ.18 లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

- **ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు...**
- **మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్...**

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 08:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో రూ. 18 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ గురువారం శంకుస్థాపన చేశారు. వార్డులో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపల్ పాలకవర్గం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి పనులు చేపట్టినట్లు చెప్పారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే మురుగునీరు నిల్వ ఉండకుండా సాఫీగా ప్రవహించడంతో పాటు రోడ్లపై మురుగునీరు చేరడం, దుర్వాసన, దోమల వ్యాప్తి వంటి సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు.

జహీరాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లోని సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి

సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంపై వార్డు కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ చైర్మన్ మహమ్మద్ యూనుస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ ఏఈ వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి మహోత్సవాల కోసం ముస్తాబైన నగునూరు శ్రీ దుర్గా భవాని ఆలయం..

- **కరీంనగర్ ప్రకాశం గంజ్ నుండి నగునూరు వరకు ఘనంగా శోభాయాత్ర**
- **అమ్మవారికి 8 కిలోల బంగారు ఆభరణాలు - భక్తుల భాగస్వామ్యానికి పిలుపు**

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 08:
కరీంనగర్ శివారులోని నగునూరు గ్రామంలో విరాజిల్లుతున్న ప్రసిద్ధ శ్రీ పరివార సమేత శ్రీ దుర్గా భవాని దేవాలయం (శంకర మఠం) శరన్నవరాత్ర మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్, దేవాలయ వంశపారంపర్య చైర్మన్ వంగల లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం రోజున దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వంగల లక్ష్మణ్ మాట్లాడారు.

శృంగేరి పీఠాధిపతుల పట్టు వస్త్రాలతో ఘనంగా శోభాయాత్ర

శ్రీశ్రీశ్రీ శృంగేరి పీఠాధిపతులచే అందించబడిన పట్టు వస్త్రాలు మంత్ర అక్షింతలతో గురువారం సాయంత్రం ఈ పవిత్ర శోభాయాత్ర ప్రకాశం గంజ్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం నుండి బయలుదేరి శ్రీ దుర్గా భవాని ఆలయం వరకు అత్యంత వైభవంగా కొనసాగుతుందని తెలిపారు.

అమ్మవారికి 8 కిలోల బంగారు ఆభరణాలు - భక్తుల భాగస్వామ్యానికి పిలుపు

నగునూరు శ్రీ దుర్గా భవాని ఆలయం అత్యంత మహిమాన్విత శక్తి ఆలయం కావడంతో, అమ్మవారి మూల విగ్రహమునకు 8 కిలోల బంగారంతో సంపూర్ణ బంగారు ఆభరణాలు (కవచాలు) తయారు చేయాలని ఆలయ కమిటీ నిర్ణయించిందని, సమస్త భక్తులు అమ్మవారి కోసం తయారు చేస్తున్న బంగారు ఆభరణాల మహా యజ్ఞంలో భాగస్వాములై, తమకు తోచిన విధంగా కనీసం 1 గ్రాము బంగారం సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమ్మవారికి సమర్పించే బంగారం వల్ల ఆత్మశుద్ధి, పితృదోష నివారణ, సంతాన వృద్ధి, శ్రీ మహాలక్ష్మీ కటాక్ష సిద్ధి, సర్వపాప విముక్తి అష్టైశ్వర్యాలు

కలుగుతాయని తెలిపారు.

శరన్నవ రాత్రి మహోత్సవాల పూర్తి దైవ కార్యం..

(అక్టోబర్ 10 నుండి 21 వరకు)...

అక్టోబర్ 10, 2026 (శనివారం) రోజున అమ్మవారికి సంపూర్ణ అభిషేకం, ధ్వజారోహణం

అక్టోబర్ 11, 2026 (ఆదివారం):
ఉదయం 6:30 నుండి గురు వందనం, గోపూజ, పుణ్యాహ వాచనం, గ్రహారాధన, కలశస్థాపన, చతుష్షష్టిచారపూజ, చండీహోమం, మంగళహారతి, కన్యా సువాసినీ పూజలు బ్రాహ్మీ అలంకరణ (హంస వాహనంతో) ,ప్రత్యేక అలంకరణలు

అక్టోబర్ 12 – 15:
సోమవారం మాహేశ్వరి అలంకరణ (నంది వాహనం), మంగళవారం కుమారీ అలంకరణ (నెమలి వాహనం), బుధవారం వైష్ణవీ అలంకరణ (గరుడ వాహనం), గురువారం లలిత త్రిపుర సుందరి అలంకరణ

విశేష పూజలు (అక్టోబర్ 16 – 20):
శుక్రవారం సరస్వతి అలంకరణ (మూలానక్షత్ర పూజ – హంస వాహనం), శనివారం ఇంద్రాణీ అలంకరణ (గజ వాహనం), ఆదివారం దుర్గా భవాని అలంకరణ (దుర్గాష్టమి, సద్దుల బతుకమ్మ – సింహ వాహనం), సోమవారం అన్నపూర్ణ అలంకరణ (మహార్నవమి), మంగళవారం విజయదుర్గా అలంకరణ (విజయదశమి – సాయంత్రం 5 గంటలకు శమీపూజ ,6 గంటలకు రామ్‌లీల). ..

అక్టోబర్ 21, 2026 (బుధవారం):
అర్ధనారీశ్వర అలంకరణ, సింహ , నంది వాహన సేవలతో పాటు, ఉదయం 10గంటలకు దుర్గాభవాని సుందరేశ్వరుల పట్టాభిషేకం రథోత్సవం నేత్రపర్వంగా నిర్వహించబడతాయని వివరించారు. సమస్త భక్తులు ఈ దేవి నవరాత్రి ఉత్సవ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదా పీఠం పరివార సమేత శ్రీ దుర్గా భవాని దేవాలయం ఆలయ ఫౌండర్ , దేవాలయ వంశపారంపర్య చైర్మన్ వంగల లక్ష్మణ్ తో పాటు శృంగేరి పీఠం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పిపి మురళి కోరారు.

వివేకానంద కళాశాలలో ఘనంగా 'ఫ్రెషర్స్ డే-2026'

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 08:
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 'ఆద్వయ-2026' ఫ్రెషర్స్ డే (నూతన విద్యార్థుల స్వాగత వేడుకలు) రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్స్‌లో అత్యంత ఘనంగా జరిగాయి.

యువతే నవ సమాజ నిర్మాతలు: మేయర్ కోలగాని శ్రీనివాస్

ఈ వేడుకలకు కళాశాల పూర్వ విద్యార్థి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నవ సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, చదువుతో పాటు ఎన్ఎస్ఎస్ , ఎన్సీసీ క్రీడలలో ప్రతిభ చాటాలని ఆయన పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనలో ప్రస్తుత యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొంటూ.. డ్రగ్స్, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.

లక్ష్యసాధనకు వనరులను సద్వినియోగం చేసుకోవాలి:లిడాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్..

ఈ వేడుకలకు గౌరవ అతిథిగా విచ్చేసిన శాతవాహన విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ ఎన్.వి. శ్రీరంగ ప్రసాద్

మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కళాశాలలోని అధ్యాపకుల బోధన, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకుంటూ తమ నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

చట్టాలను గౌరవిస్తూ ముందుకు సాగాలి: సీఐ తిరుమల్ గౌడ్

మరో గౌరవ అతిథి, కరీంనగర్ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (జ×) శ్రీ జి. తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ, సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) పట్ల అప్రమత్తంగా ఉంటూ నవ సమాజ నిర్మాతలుగా ఎదగాలని కోరారు.
కళాశాల కరస్పాండెంట్ ఆగం రావు మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న అన్ని వసతులను సమర్థవంతంగా ఉపయోగించుకుని ఉన్నతమైన జీవన నైపుణ్యాలను

పెంపొందించుకోవాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు సందడి ఈ కార్యక్రమంలో భాగంగా జూనియర్ మరియు సీనియర్ విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. యువత కేరింతలు, నృత్యాలతో ప్రాంగణం మార్మోగింది.
ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. హెచ్. శ్రీనివాస్, ఏసీఓబీ సంపత్ కుమార్, ఏవోబీ బి. శ్రావణ్ కుమార్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, డాక్టర్ ఎం.ఎ. సలీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డి. సాగర్, బి. మహేష్, ఎన్. శ్రీనివాస్, అధ్యాపక బృందం మరియు భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రి విద్యా సంస్థలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 08:
శ్రీ గాయత్రి జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా, కన్నులపండుగగా జరిగాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, సాంప్రదాయ దుస్తులలో మెరిసిపోయిన విద్యార్థినులతో కళాశాల ప్రాంగణమంతా పండగ వాతావరణం సంతరించుకుంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కరస్పాండంట్ శ్రీ బీమిడి సుభాష్ రెడ్డి గారు మాట్లాడుతూ.. "బతుకమ్మ పండుగ ప్రకృతిని, ఆడపడుచులను గౌరవించే గొప్ప పండుగ. చదువుతో పాటు మన సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకుంటూ ముందడుగు వేయాలి. ఇలాంటి వేడుకలు విద్యార్థులలో ఐక్యతను, మన మూలాల పట్ల గౌరవాన్ని పెంచుతాయి" అని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ శ్రీ బండారు మయూర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. "తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను మన గాయత్రి కళాశాలలో ఇంత వైభవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని, విద్యార్థులు ఆధునిక విద్యను అభ్యసిస్తూనే, మన సంస్కృతీ సంప్రదాయాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. ఈ సంబరాలలో విద్యార్థినుల ఆటపాటలు, సాంప్రదాయ బతుకమ్మ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్కృతుల కలయికగా సాగిన దాండియా నృత్యాలు వేడుకల్లో సరికొత్త జోష్‌ను నింపాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ దయాకర్ గారు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు గారు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

కిరాయికి వెళ్తున్నానని చెప్పి.. ఆటో డ్రైవర్ అదృశ్యం

జహీరాబాద్ వెలుతురు, అక్టోబర్ 08:
సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మున్నూరు శ్రీనివాస్ (49) అదృశ్యమైనట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 7న మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో కిరాయికి ఆటో నడపడానికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆయన భార్య మున్నూరు మహాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన శ్రీనివాస్ చామనఛాయ రంగు కలిగి, ఫ్యాంటు, షర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ 8712661849, ఎస్ఐ 8712656766 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ వినయ్ కుమార్ కోరారు.

భర్త చేయి చేసుకోవడంతో మహిళ ఆత్మహత్య!

కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా కల్లూరు ఎస్టేట్‌కు చెందిన షకీలా (26)కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం భార్యాభర్తల మధ్య గొడవ జరగగా.. భర్త షకీలాపై చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన భర్త, చుట్టుపక్కల వారు ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా.. షకీలా అప్పటికే మృతి చెంది ఉంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్‌కు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమర్థవంతమైన పాలన అందిస్తున్న నరేంద్ర మోదీ

రాష్ట్ర అధికార ప్రతినిధి రాహుల్ సరిదేనా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 08
ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. రాహుల్ సరిదేనా అన్నారు. 2014 వ సంవత్సరంలో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో ప్రపంచంలోనే భారత్ శక్తివంతమైన దేశంగా అవతరించిందని ఆయన వ్యాఖ్యానించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల కాలంలో సమర్థవంతమైన పాలనను అందించి ప్రజల హృదయాలలో నరేంద్రమోదీ చిరస్థాయిగా నిలిచిపోయ్యారని రాహుల్ సరిదేనా కొనియాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశం అవతరించేలా నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని రాహుల్ సరిదేనా పేర్కొన్నారు.

జనగణనలో ఓబీసీ కులగణన కాలమ్ చేర్చకుంటే బిజెపిని ఓబీసీ ద్రోహుల పార్టీగా ప్రకటిస్తాం

న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ డిప్యూటీ స్పీకర్ హాల్లో జరిగిన జాతీయ ఓబీసీ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 08:
కేంద్ర ప్రభుత్వం జనగణనలో ఓబీసీ లను లెక్కించకుండా మోసం చేస్తుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో ఓబీసీ కాలం చేర్చాలని కోరుతూ ఈరోజు న్యూ ఢిల్లీ లోని కాన్స్టిట్యూషన్ క్లబ్ డిప్యూటీ స్పీకర్ హాల్లో జరిగిన సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని దేశానికి ఒక బీసీ ప్రధానిగా ఉన్న ఓబీసీ లకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎస్సీ ఎస్టీలను లెక్కిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఓబీసీ లను లెక్కిస్తే కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమిటి అని ప్రశ్నించారు జనగణనలో ఓబీసీలను లెక్కించకపోతే బిజెపి పార్టీని బీసీ ద్రోహుల పార్టీగా ప్రకటిస్తామన్నారు.

నేడు నార్కట్‌పల్లిలో అంగరంగ వైభవంగా శ్రీ దుర్గాదేవి ఆగమన కార్యక్రమం

నార్కట్‌పల్లి వెలుతురు అక్టోబర్ 08:
నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో స్థానిక బస్టాండ్ పక్కన దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రసిద్ధ గ్రామదేవత 'దసరా గుడి' వద్ద శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల ప్రారంభ సూచికగా శుక్రవారం రోజున శ్రీ దుర్గాదేవి ఆగమన కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. మునుగోడు రోడ్డు సాయంత్రం 5:00 గంటలకు, దసరా గుడి (బస్టాండ్ పక్కన), నార్కట్‌పల్లిలో జరిగే ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ పుర ప్రముఖులు, వివిధ కుల సంఘాల పెద్దలు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు, యువకులు, మహిళలు మరియు భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ఆగమన వేడుకను విజయవంతం చేయాల్సిందిగా నార్కట్‌పల్లి టీమ్ దసరా గుడి కమిటీ బాధ్యులు కోరారు.

జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం
- మోతె శోభన్‌రెడ్డి, మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 08
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ 'చలో లోక్‌భవన్' నిరసన ర్యాలీలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు మోతె శోభన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ లోక్‌భవన్ వైపు కొనసాగింది. భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మోతె శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు

పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైనదని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పోరాటం కొనసాగుతుందని, జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి ప్రజా ఉద్యమంలో తాము భాగస్వాములుగా ఉంటామని మోతె శోభన్‌రెడ్డి, మోతె శ్రీలత శోభన్‌రెడ్డి తెలిపారు.

ఆరోగ్యకర వృద్ధాప్యానికి వినికిడే కీలకం

- అత్యధిక కాలం జీవించడం కాదు.. ఆరోగ్యంగా జీవించడం ముఖ్యం
- హియర్ 'ఎన్' సే క్లినిక్ డాక్టర్ గరిమా వేగివాడ, డాక్టర్ రావుస్ ఈఎన్‌టీ హాస్పిటల్ డాక్టర్ సాయి కృష్ణ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 8
అత్యధిక కాలం జీవించడం కాదు.. ఆరోగ్యంగా జీవించడం ముఖ్యమని హియర్ 'ఎన్' సే క్లినిక్ (హైదరాబాద్) ఆడియాలజిస్ట్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ గరిమా వేగివాడ, డాక్టర్ రావుస్ ఈఎన్‌టీ హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ – ఆడియాలజీ, కన్సల్టెంట్ డాక్టర్ సాయి కృష్ణ తెలిపారు. ఆరోగ్యకర వృద్ధాప్యానికి వినికిడి శక్తే ప్రాణాధారం అన్నారు. భారత్‌లో వృద్ధాప్యం పెరుగుతుండగా, ఆరోగ్యకరమైన జీవనంపై పునరాలోచన అవసరమని నీతి ఆయోగ్ పిలుపు ఇచ్చిందన్నారు. వినికిడి లోపం, శరీర సమతుల్యత సమస్యలు, జ్ఞాపకశక్తి మెదడు ఆరోగ్యం, ఒంటరితనం ఇవన్నీ వృద్ధుల తమ స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని గడిపే విధానంతో ముడిపడి ఉన్నాయన్నారు. భారతదేశ వృద్ధాప్య సంరక్షణ పూర్తిగా కేవలం వ్యాధులకే పరిమితం కాకుండా, వృద్ధులు ఇతరులతో ఎలా సంభాషిస్తున్నారు, ఎలా నడుస్తున్నారు, సమాజంలో ఎలా భాగస్వామ్యం అవుతున్నారు అనే అంశాలపై దృష్టి సారించాలన్నారు. భారతదేశం పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా సిద్ధమవుతున్న తరుణంలో వినికిడి, సమతుల్యత సంరక్షణ అనేది కేవలం పరికరాలకే పరిమితం కాకుండా పునరావాసం, భద్రత, మెదడు ఆరోగ్యం, మానవ సంబంధాల వైపు దృష్టి సారించాలన్నారు. భారతదేశంలో వృద్ధాప్య శాతం పెరుగుతుందన్నారు. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న భారతీయులు ఎంతకాలం జీవిస్తారన్నది మాత్రమే కాదని, ఆ జీవితకాలాన్ని ఎంత ఆరోగ్యంగా గడుపుతారన్నది కూడా ముఖ్యమన్నారు. ఆగస్టు 2026లో నీతి ఆయోగ్ విడుదల చేసిన 'రీఇమాజినింగ్ కేర్: స్ట్రాటజీస్ ఫర్ ఎంపవరింగ్ కేర్‌గివర్స్ ఇన్ విక్షిత్ భారత్ 2047' నివేదిక భారతదేశంలో మారుతున్న జనాభా తీరును, మారుతున్న కుటుంబ వ్యవస్థలను, దీర్ఘకాలిక సంరక్షణ అవసరాలను స్పష్టం చేసిందన్నారు. 2050 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య దాదాపు 34.7 కోట్లకు

(347 మిలియన్లు) చేరే అవకాశం ఉందని ఈ నివేదిక అంచనా వేస్తూ, మరింత పటిష్ఠమైన, వ్యవస్థీకృతమైన సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చిందన్నారు. వృద్ధాప్యం గురించిన ఈ చర్చలో చాలావరకు విస్తరించబడే అతి ముఖ్యమైన అంశాలు వినికిడి, శరీర సమతుల్యత అన్నారు. 'మనం వృద్ధులలో మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, గుండె జబ్బుల గురించి విస్తృతంగా మాట్లాడుతుంటాం. కానీ ఇతరుల మాటలను వినలేకగాగడం, వైద్యుడి సూచనలను అర్థం చేసుకోలేకగడం, ప్రమాద హెచ్చరిక శబ్దాలను గుర్తించడం, సంబంధాలను నిలుపుకోవడం, క్షేమంగా నడవగలగడం వంటి సామర్థ్యాలు కూడా స్వతంత్రంగా జీవించడానికి అంతే ముఖ్యమైనవి. పిల్లలు ఇంట్లో లేనప్పుడు భారతదేశ సంప్రదాయబద్ధంగా వృద్ధుల సంరక్షణ కోసం కుటుంబాలపైనే ఎక్కువగా ఆధారపడుతూ వచ్చింది. అయితే, వలసలు, పట్టణీకరణ, చిన్న కుటుంబాల పెరుగుదల ఈ విధానాన్ని మారుస్తున్నాయి. 'లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా' మొదటి విడత అధ్యయనం ప్రకారం, సుమారు 5.9 శాతం మంది వృద్ధులు ఒంటరిగా జీవిస్తున్నారు. ఒంటరిగా జీవించడమంటే పిల్లలు లేరని కాదు, చాలామంది పిల్లలు వేరే ఊర్లలో లేదా విదేశాల్లో ఉంటున్నారు. కానీ వినికిడి, శరీర సమతుల్యత లేదా జ్ఞాపకశక్తి లోపాలు తలెత్తడం మొదలైనప్పుడు, ఈ భౌతిక దూరం తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక వృద్ధురాలికో లేదా వృద్ధుడికో కాలింగ్ బెల్ శబ్దం వినిపించడం లేదనే విషయాన్ని ఎవరు గమనిస్తారు? వారు సంభాషణలను అర్థం చేసుకోలేకపోతున్నారని ఎవరు గుర్తిస్తారు? వారిని వినికిడి పరీక్షకు ఎవరు తీసుకెళ్తారు? వారు కళ్లు తిరగడంతో ఇబ్బంది పడుతున్నారని లేదా బయట నడవడానికి భయపడుతున్నారని ఎవరు కనిపెడతారు? ఇవి కేవలం వైద్యపరమైన ప్రశ్నలు మాత్రమే కాదు. ఇవి సంరక్షణకు సంబంధించిన ప్రశ్నలు' అనితెలిపారు. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 150 కోట్లకు (1.5 బిలియన్లు) పైగా ప్రజలు ఏదో ఒక స్థాయి వినికిడి లోపంతో జీవిస్తున్నారు. వీరిలో 43 కోట్లకు పైగా ప్రజలకు తీవ్రమైన (వైకల్యంతో కూడిన) వినికిడి లోపం కారణంగా పునరావాసం అవసరమవుతోంది. 60 ఏళ్లు పైబడిన వారిలో ప్రతి నలుగురిలో ఒకరికి పైగా ఇటువంటి తీవ్రమైన వినికిడి లోపం ఉంది. వినికిడి లోపం అనేది భావవ్యక్తీకరణ, సామాజిక భాగస్వామ్యం, మానసిక శ్రేయస్సు, స్వతంత్ర జీవనంపై ప్రభావం చూపుతుంది. సకాలంలో పరిష్కరించని వినికిడి లోపానికి, జ్ఞాపకశక్తి మందగించడానికి, చిత్తవైకల్యం వచ్చే ప్రమాదం పెరగడానికి మధ్య సంబంధం ఉందని కూడా గుర్తించింది. వినికిడి లోపానికి, మతిమరుపు మధ్య ఉన్న సంబంధం సంక్లిష్టమైనది, వినికిడి లోపమే నేరుగా మతిమరుపునకు కారణం అవుతుందని చెప్పలేం. అయినా, మెదడు ఆరోగ్యానికి సంబంధించిన విస్తృతమైన చర్చల్లో వినికిడి లోపాన్ని విస్మరించలేం.



టీబీ నిర్మూలనలో యువత భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు జోష్ టీమ్స్ ప్రారంభం

హైదరాబాద్, వెలుతురు 8 అక్టోబర్ 2026:
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జన్ భాగీదారి ని మరింత బలోపేతం చేస్తూ యువతను టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్) టీమ్స్‌ను ప్రారంభించింది. జోష్ టీమ్స్‌ను బ్లాక్/వార్డు స్థాయిలో ఏర్పాటు చేస్తారు. ప్రతి టీమ్‌లో 5 మంది MY Bharat Volunteers, 5 eT+" NCC Cadets ఉంటారు. వీరికి ఒక Class-I నోడల్ ఆఫీసర్ నాయకత్వం వహిస్తారు. టీబీపై అవగాహన, కమ్యూనిటీ మొబిలైజేషన్, టీబీ స్క్రీనింగ్, ముందస్తు నిర్ధారణ మరియు చికిత్స పూర్తయ్యేలా సహకరించడం ఈ టీమ్స్ ప్రధాన లక్ష్యాలు.
8 అక్టోబర్ 2026న నిర్వహించిన JOSH ప్రారంభ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా బృందం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్, వెంగళరావు నగర్, హైదరాబాద్ నుంచి రాష్ట్ర బృందంతో కలిసి వర్చువల్‌గా పాల్గొంది.
ఈ కార్యక్రమంలో SPHOs, TB Unit Medical Officers, Senior Treatment Supervisors, NCC Cadets, MY Bharat Volunteers, NGO Partners, Nikshay Mitras మరియు టీబీ ఛాంపియన్స్ పాల్గొన్నారు. డా. సంగీత సత్యనారాయణ, ఐఏఎస్, కమిషనర్, హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్ యువత టీబీపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, టీబీ రోగులకు కౌన్సెలింగ్ అందించి చికిత్స పూర్తిచేసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. డా. ఏ. రాజేశం, స్టేట్ టీబీ ఆఫీసర్ NCC Cadets మరియు MY Bharat Volunteers NTEPతో కలిసి టీబీ స్క్రీనింగ్ మరియు ముందస్తు నిర్ధారణలో

చురుకుగా పాల్గొనాలని సూచించారు.
డా. రాజేశ్వరి, డైరెక్టర్, రాజజ, టీబీ రోగులకు కమ్యూనిటీ మరియు మానసిక–సామాజిక సహకారం అందించాల్సిన అవసరాన్ని వివరించారు.
డా. పుట్ల శ్రీనివాస్, ఐడీఎస్, హైదరాబాద్ Vulnerable Populationsలో టీబీ స్క్రీనింగ్‌ను పెంచడంతో పాటు వివిధ శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేయాలని సూచించారు.
డా. జి. యాదగిరి, జజు, హైదరాబాద్ టీబీ నిర్మూలనకు బహుళ శాఖల సమన్వయం, కమ్యూనిటీ భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు.
డా. సుమలత, టీబీ Mukt Bharat Abhiyaan మరియు డా. శ్రీగణ, WHO Consultant, నోడల్ ఆఫీసర్స్, NCC Cadets మరియు MY Bharat Volunteersకు టీబీ నిర్మూలనలో వారి పాత్రలపై శిక్షణ మరియు అవగాహన కల్పించారు.
JOSH కార్యక్రమం ద్వారా యువత భాగస్వామ్యం, కమ్యూనిటీ

మొబిలైజేషన్, టీబీ స్క్రీనింగ్, చికిత్సకు సహకారం మరియు జన్ భాగీదారి మరింత బలోపేతం అవుతాయని హైదరాబాద్ జిల్లా టీబీ బృందం పేర్కొంది. "యువత భాగస్వామ్యం -- ప్రజల భాగస్వామ్యం -- టీబీ రహిత హైదరాబాద్ -- టీబీ రహిత భారత్"

కీసర మండలం సర్పంపల్లి గ్రామాల భూ రీసర్వేను పర్యవేక్షించిన అడిషనల్ కలెక్టర్

కీసర వెలుతురు అక్టోబర్ 08:
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే లో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని ఘట్ కేసర్ మండలం మాదారం మరియు కీసర మండలం సర్పంపల్లి గ్రామాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. పాసుబుక్కులోని భూ ఆధార్ నంబర్ తో ఆన్‌లైన్ లో లోకేషన్ గుర్తించడం జరుగుతుందని ఆయా మండల తహసీల్దార్లు అదనపుకలెక్టర్ కు వివరించారు. అదనపు కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. భూ సర్వే జరుగుతున్న రైతులతో మాట్లాడి సర్వేయర్లకు సూచనలు అందించారు. ఈ పర్యటనలో ఘట్కేసర్

తాహసిల్దారు చంద్రశేఖర్, కీసర తహసీల్దారు యాదగిరిరెడ్డి, రెవెన్యూసిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహితంగా 7 పంచాయతీలు

సర్పంచులకు ధ్రువీకరణ పత్రాలు.

మునుగోడు, అక్టోబర్ 8 (వెలుతురు):
మునుగోడు మండలానికి చెందిన 7 గ్రామ పంచాయతీలకు 'టీబీ ముక్త్ పంచాయత్-- 2025' కింద టీబీ రహిత పంచాయతీలుగా గుర్తింపు లభించింది. గురువారం జిల్లా కేంద్రంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచులు ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు. గుండ్లోరిగూడెం సర్పంచ్ జంగిలి సునీత--సాంబయ్య, కిష్టాపురం సర్పంచ్ మాలుగు శ్రీను, రత్తిపల్లి సర్పంచ్ జిట్టగోని సైదమ్మ--సైదులు, జక్కలవారిగూడెం సర్పంచ్ జక్కలి రేవతి--మహేష్, దుబ్బకాల్వ సర్పంచ్ కొండ శ్రీను, గంగోరిగూడెం సర్పంచ్ గోపగోని పాపయ్యగౌడ్, వెలగలగూడెం సర్పంచ్ తీర్పారి నాగమణి--అంజనేయులు ధ్రువీకరణ పత్రాలు స్వీకరించారు. టీబీ కేసులను ముందుగానే గుర్తించడం, బాధితులకు క్రమం తప్పకుండా చికిత్స అందించడం, ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెంచడంలో సాధించిన ఫలితాలకు ఈ గుర్తింపు దక్కింది. ఒకే మండలంలోని ఏడు పంచాయతీలకు టీబీ రహిత గుర్తింపు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సందర్శకుల సందడిలో సారస్ మేళా

- తెలంగాణ సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలకు మంచి ఆదరణ
- ఇతర రాష్ట్రాల ఉత్పత్తులకూ భారీ గిరాకీ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 08
హైదరాబాద్‌లో జరుగుతున్న సారస్ మేళా రెండో రోజు కూడా సందడిగా కొనసాగింది. నగరంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మేళాకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. దీంతో వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా తెలంగాణ సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలు, గ్రామీణ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కనిపించింది. పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలు, జనపనార వస్త్రాలు, చెరియాల్ కళాకృతులు, గిరిజన ఆభరణాలు, జూట్, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అదే సమయంలో గుజరాత్, ఈశాన్య రాష్ట్రాలు సహా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక ఉత్పత్తులను కూడా నగరవాసులు ఆసక్తిగా కొనుగోలు చేశారు. స్టాళ్ల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెర్ప్ అన్ని ఏర్పాట్లు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా సంఘాల సభ్యులు, కళాకారులకు ఉచితంగా భోజనం, వసతి

సదుపాయాలు కల్పిస్తోంది. మేళా ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, జానపద పాటలు తదితర ప్రదర్శనలతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు. ప్రత్యేకంగా సెర్ప్ సిబ్బందిలో పలువురు తమలోని కళా ప్రతిభను ప్రదర్శించడం కార్యక్రమానికి హైలైట్‌గా నిలిచింది. ఉద్యోగ బాధ్యతలతో పాటు తమలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించిన సిబ్బందిని ప్రేక్షకులు అభినందించారు.
సారస్ మేళా కేవలం ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ మహిళలకు నగర మార్కెట్‌ను పరిచయం చేసే వేదికగా నిలుస్తోంది. వినియోగదారుల అభిరుచులు, ఉత్పత్తుల నాణ్యత, ధరలు, ప్యాకేజింగ్‌పై నేరుగా స్పందన తెలుసుకునే అవకాశం మహిళా సంఘాలకు లభిస్తోంది. ఇది భవిష్యత్‌లో మరిన్ని మార్కెట్ అవకాశాలు, బల్క్ ఆర్డర్లకు దోహదపడనుంది.
మహిళల శ్రమకు మార్కెట్, ప్రతిభకు గుర్తింపు, ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటుగా సారస్ మేళా కొనసాగుతోంది. అక్టోబర్ 18 వరకు జరిగే ఈ మేళాను నగరవాసులు సందర్శించి గ్రామీణ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారం రికవరీ వివాదం కలకలం

ఆరోపణల నేపథ్యంలో నార్కట్‌పల్లి ఎస్ఐపై వేటు...

నార్కట్‌పల్లి వెలుతురు అక్టోబర్ 08:
దొంగతనం కేసులో నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారంలో కొంత పక్కదారి పట్టించారనే ఆరోపణలు, ఆరోపణల నేపథ్యంలో నార్కట్‌పల్లి ఎస్ఐపై వేటు, ఎస్ఐని జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు. ఈ వ్యవహారంలో మరో అధికారిపై కూడా ఆరోపణలు ఉన్నాయంటూ ప్రచారం, అయితే సదరు అధికారిపై చర్యలు తీసుకోకపోవడంపై పోలీస్ శాఖలో విమర్శలు, కీలక పోలీస్ అధికారితో సాన్నిహిత్యం కారణంగానే రక్షణ లభిస్తోందన్న ప్రచారం, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా? అన్నదానిపై

ఉత్కంఠ., బంగారం రికవరీ వ్యవహారం ఉమ్మడి నల్గొండ జిల్లా పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్.

"మనమెంతో మనకంత వాటా దక్కేంత వరకు పోరాడుదాం"

- చట్టసభల్లో మన ప్రాతినిధ్యం పెరగాలి
- డాక్టర్ బండి సాయన్న గౌడ్

మహబూబాబాద్ వెలుతురు అక్టోబర్ 08: సమాజంలో మనమెంతో మనకంత వాటా దక్కేంత వరకు ఐక్యంగా పోరాడాలని గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్న గౌడ్ పిలుపునిచ్చారు. చట్టసభల్లో మనకు తగిన ప్రాతినిధ్యం లభించే వరకు ఉద్యమించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న నాయకులను కాపాడుకుంటూ, భవిష్యత్తులో కొత్త నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన గోపా జిల్లా కార్యవర్గ సమావేశంలో డాక్టర్ బండి సాయన్న గౌడ్, హైకోర్టు న్యాయవాది నలమాస కృష్ణ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. విద్య, ఉద్యోగం, వృత్తి, ఆర్థిక రంగాల్లో గౌడ్ సమాజం మరింత అభివృద్ధి సాధించేందుకు గోపా అండగా నిలుస్తుందని తెలిపారు. అధికారులుగా, నిపుణులుగా ఎదుగుతున్న వారిని ఒక వేదికపైకి తీసుకువచ్చి సమాజాభివృద్ధికి వారి సేవలను వినియోగించుకోవడం గోపా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

మహబూబాబాద్ జిల్లా గోపా నూతన కార్యవర్గం: సమావేశంలో మహబూబాబాద్ జిల్లా గోపా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వడ్లకొండ సుభాష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి రమేష్ గౌడ్, కోశాధికారిగా ముక్తేశ్వర గౌడ్ ఎన్నికయ్యారు. నూతనంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా ఎన్నికైన కమిటీని వివిధ గౌడ సంఘాల నాయకులు, ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం జిల్లాలోని అధికారులు, వృత్తినిపుణుల సంక్షేమంతో పాటు గౌడ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. గోపాను మరింత బలోపేతం చేసి, సమాజం లోని విద్యావంతులు, అధికారులు, వృత్తినిపుణులను సంఘటితం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి పవిత్రోత్సవాలు ఘనంగా ముగింపు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, వెలుతురు అక్టోబర్ 08: : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోరుకొండ స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో దివ్య పవిత్రోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. శ్రీ వైఖానస భగవత్ ఆగమ శాస్త్ర ప్రకారం, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ప్రకారం ద్రవిడ ప్రబంధన, వేద పారాయణలతో ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ వాఖాని మణికంఠాచార్యులు వారి బ్రహ్మత్వంలో, స్వామివారి వంశపారంపర్య అర్చక స్వాములు శ్రీ పెదపాటి, శ్రీ పెద్దింటి, శ్రీ పెరవలి వారి పర్యవేక్షణలో, అనువంశిక ధర్మకర్త శ్రీమాన్ పరాశర రంగరాజా భట్టర్, కార్యనిర్వహణాధికారి నేతృత్వంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజు వేద పండితుల దివ్య మంత్రోచ్ఛారణల నడుమ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, సప్తదశ కలశప్రోక్షణ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి శాంతి కళ్యాణం, విశేష నివేదన, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాదగోష్ఠి అత్యంత వైభవంగా జరిగాయి. చివరిగా పవిత్రమాలా ప్రసాద వితరణ, వేదాశీర్వచనం, యజ్ఞశాల దేవతా ఉద్వాసన, మంగళాశాసనములతో పవిత్రోత్సవాలు మంగళప్రదంగా పూర్తయ్యాయి. ఈ ముగింపు మహోత్సవంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు వారికి పూర్ణకుంభం తో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గారు మాట్లాడుతూ స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య పవిత్రోత్సవాల ఆఖరి రోజు పూజల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. కోరుకొండ స్వామివారి దివ్య ఆశీస్సులతో రాజా నగరం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నానని, క్షేత్ర సమగ్ర అభివృద్ధికి, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తరఫున శాయశక్తులా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మందమర్రి తెలంగాణ మోడల్ స్కూల్‌లో సీఎం అల్పాహార పథకం ప్రారంభించిన మంత్రి వివేక్

- మందమర్రి తెలంగాణ మోడల్ స్కూల్‌లో సీఎం అల్పాహార పథకం ప్రారంభించిన మంత్రి వివేక్

మందమర్రి, వెలుతురు అక్టోబర్ 08: విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేసేందుకు ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గురువారం మందమర్రిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 'సీఎం అల్పాహార పథకం'ను మంత్రి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా మాట్లాడారు. 2009 --14 మధ్య పెద్దపల్లి ఎంపీగా ఉన్న సమయంలో కేంద్ర నిధులతో మందమర్రి ప్రాంతంలో తెలంగాణ మోడల్ స్కూల్‌ను మంజూరు చేయించి ప్రారంభించినట్లు మంత్రి వివేక్ గుర్తుచేశారు. అప్పట్లో 250 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల ప్రస్తుతం 805 మంది విద్యార్థులతో కొనసాగుతుండటం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల 40 మందికి పైగా విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం పాఠశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమన్నారు. పాఠశాల ఆధునికీకరణ, మౌలిక వసతుల అభివృద్ధికి ఇప్పటికే రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన బెంచీలు, క్రీడా మైదానాలు, ఇతర అవసరమైన సదుపాయాలను సమకూరుస్తామని చెప్పారు. మందమర్రి మోడల్ స్కూల్ రాష్ట్రంలోనే అత్యుత్తమ పాఠశాలల్లో ఒకటిగా నిలవాలన్నదే తన ఆకాంక్ష అని మంత్రి పేర్కొన్నారు. తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకుంటూ మంత్రి వివేక్ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. తాను పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నానని, అక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వం తన జీవితానికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. మెడిసిన్ పూర్తి చేయడం, పారిశ్రామికవేత్తగా ఎదగడం, అనంతరం రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయడం వెనుక చిన్ననాటి క్రమశిక్షణ ఎంతో దోహదపడిందన్నారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే మంచి అలవాట్లు, ఉన్నతమైన లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు. "ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా ఎదగాలి. కష్టపడే వారికి అవకాశాలు తప్పకుండా వస్తాయి"లి అని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం అల్పాహార పథకం' విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై సానుకూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. విద్యార్థులు ఆకలితో తరగతులకు హాజరు కాకుండా, సంపూర్ణ ఆరోగ్యంతో, ఏకాగ్రతతో చదువుకునేలా పౌష్టికాహారం అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. హరేకృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ప్రతిరోజూ వేడివేడిగా, పరిశుభ్రమైన వాతావరణంలో అల్పాహారం, పాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. కోటపల్లి మండలంలోనూ శుక్రవారం నుంచి ఈ పథకం ప్రారంభమవుతుందని మంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 10,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు, చెన్నూరు నియోజకవర్గం సోమన్‌పల్లి రూ. 200 కోట్ల వ్యయంతో 2,500 మంది విద్యార్థుల సామర్థ్యంతో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందులో విద్యార్థులకు ఆధునిక హాస్టల్ సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్యను కొనసాగించలేని విద్యార్థులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) ద్వారా సాంకేతిక నైపుణ్యాలు, విదేశీ భాషల్లో శిక్షణ, స్టైఫండ్‌తో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెదక్‌లో సరికొత్త అభివృద్ధి శకం!

- యువ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్న నాయకత్వంలో మెదక్ నూతన వైభవం వైపు అడుగులు!
- మెదక్ ముఖచిత్రంలో మార్పు... అభివృద్ధి దిశగా కొత్త అడుగులు!
- యువ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో కొత్త ఆశలతో ముందుకు సాగుతున్న మెదక్ నియోజకవర్గం

మెదక్ వెలుతురు, అక్టోబర్ 08 : చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు పేరుగాంచిన మెదక్ పట్టణం ఇప్పుడు ఆధునిక అభివృద్ధి, వాణిజ్య విస్తరణ, పట్టణ సుందరీకరణతో సరికొత్త గుర్తింపు పొందే దిశగా అడుగులు వేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో మెదక్ యువ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వం, నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన చూపుతున్న ఆసక్తి ప్రత్యేక చర్చనీయాంశంగా మారాయి.

రెండు దశాబ్దాల ఆకాంక్షలు... అభివృద్ధిపై కొత్త ఆశలు!

గత 20 ఏళ్లుగా మెదక్ పట్టణ ప్రజలు కోరుకుంటున్న మౌలిక వసతులు, ఆధునిక సౌకర్యాలు, పట్టణ సుందరీకరణ అంశాలు ఇప్పుడు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మెదక్ పట్టణంలో ని ప్రధాన కూడళ్ల అభివృద్ధి, అంతర్గత రహదారుల నిర్మాణం, సీసీ రోడ్లు, సుందరీకరణ పనులు పట్టణ రూపురేఖలను మార్చే అవకాశముంది. ముఖ్యంగా రాందాస్ చౌరస్తా, ధ్యాన్‌చంద్ చౌరస్తా అభివృద్ధి, మెదక్ వెల్కమ్ బోర్డు, ఐ లవ్ మెదక్ నిర్మాణం వంటి కార్యక్రమాలు పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మెదక్‌ను మరింత ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

మెదక్‌లో వ్యాపార సందడి...

మారుతున్న పట్టణ సంస్కృతి!

ఒకప్పుడు పెద్ద షాపింగ్ మాల్స్, ప్రముఖ బ్రాండ్ల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే మెదక్ ప్రజలకు ఇప్పుడు స్థానికంగానే కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. రేమండ్ షోరూం, చందనా బ్రదర్స్, కిసాన్ షాపింగ్ మాల్, వైభవం షాపింగ్ కాంప్లెక్స్, పారడైస్ హోటల్ వంటి ప్రముఖ వ్యాపార సంస్థలతో మెదక్ వాణిజ్య రంగంలో కొత్త సందడి కనిపిస్తోంది. ప్రముఖ సినీ తారల సందర్శనలు, షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాలు పట్టణానికి ప్రత్యేక ఆకర్షణను తీసుకొస్తున్నాయి. వ్యాపార విస్తరణతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు మెదక్ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంది.

పర్యాటక రంగానికి కొత్త ఊపు!

చారిత్రక మెదక్ ఖిల్లా, ప్రపంచ ప్రసిద్ధి చెందిన మెదక్ చర్చ్, ఆధ్యాత్మిక కేంద్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం మెదక్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఈ పర్యాటక కేంద్రాలను మరింత అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడుపాయల సందర్శన సందర్భంగా ప్రకటించిన రూ. 100 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలైతే ఈ ప్రాంత పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభించనుంది. రాష్ట్రస్థాయి ప్రముఖుల సందర్శనలతో మెదక్ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. యువ ఎమ్మెల్యే రోహిత్ రావుపై పెరుగుతున్న అంచనాలు! యువతరానికి చెందిన ప్రజాప్రతినిధిగా డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మెదక్ అభివృద్ధిలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పట్టణాభివృద్ధి, పర్యాటక అవకాశాల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ఆయన నాయకత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మెదక్ అభివృద్ధి అనేది కేవలం కొన్ని రోడ్లు, భవనాల నిర్మాణంతో పరిమితం కాకుండా ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించే దిశగా సాగాలన్నది ప్రజల ఆకాంక్ష. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు కీలకంగా మారనున్నాయి.

నిన్నటి చారిత్రక మెదక్... రేపటి ఆధునిక మెదక్!

ఒకవైపు చారిత్రక వైభవం, మరోవైపు ఆధునిక వాణిజ్య విస్తరణ, ఇంకోవైపు మౌలిక వసతుల అభివృద్ధితో మెదక్ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. ఈ మార్పుల మధ్య మెదక్ భవిష్యత్తుపై కొత్త ఆశలు రేకెత్తిస్తున్న యువ నాయకుడు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు కల్పించాలి

- పిల్లల తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ వెలుతురు అక్టోబర్ 08: జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రుల సమావేశం మెదక్‌లోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అనేక రకాల సదుపాయాలను అందిస్తోందని తెలిపారు. ఊా×వీజూ క్యాంపుల ద్వారా అవసరమైన ఉపకరణాలను అందిస్తున్నామని, అలాగే ఎస్కార్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ వంటి సహాయాలను అందిస్తున్నామని చెప్పారు. మెదక్ జిల్లాలోని 21 భవిత కేంద్రాల్లో 194 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. సాధారణ పాఠశాలకు వెళ్లలేని పిల్లలకు భవిత కేంద్రాల్లో అవసరమైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, ×జు౯ాలు వారికి విద్యాబోధన చేస్తున్నారని పేర్కొన్నారు. భవిత కేంద్రానికి కూడా రాలేని పిల్లల కోసం హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా ×జు౯ాలు వారి ఇళ్లకు వెళ్లి విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 63 మంది పిల్లలకు ఈ విధంగా విద్య అందిస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించిన వారిలో ఇప్పటివరకు 46 మంది పిల్లలను తిరిగి సాధారణ పాఠశాలల్లోకి (మెయిన్‌స్ట్రీమింగ్) తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం జిల్లాలోని భవిత కేంద్రాల నిర్వహణకు గత సంవత్సరం ప్రభుత్వం రూ. 1.06 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో జిల్లాలోని భవిత కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఓర్పుతో వ్యవహరించడం, వారికి అవసరమైన సహకారం అందించడం, వారి ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాల్సిన బాధ్యతను వివరించడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఊామీ సుదర్శన్ మూర్తి, రాజు, నవీన్, మురళీమోహన్, మెదక్ శంకర్, జిల్లాలోని ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతై.. ఆరేళ్ల హేమంత్ మృతి

వాజేడు, వెలుతురు అక్టోబర్ 08: : గోదావరిలో గల్లంతైన ఆరేళ్ల బాలుడు మృతి చెందిన విషాద సంఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పూసూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఒక్కగానొక్క కుమారు డిని కోల్పోయిన తల్లిదండ్రులు, బంధువుల రోదనలు గ్రామంలో విషాదాన్ని నింపాయి. గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్‌రజిత దంపతుల కుమారుడు కుమ్మరి హేమంత్ (6) గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మరో బాలుడితో కలిసి బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం గోదావరి వైపు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయి గల్లంతైనట్లు సమాచారం. హేమంత్ ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అతనితో పాటు వెళ్లిన మరో బాలుడిని విచారించగా గోదావరిలో గల్లంతైన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామస్తులు వెంటనే గోదావరి వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటి తర్వాత గాలింపు చర్యల్లో హేమంత్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు. ఒక్కగానొక్క కొడుకును కోల్పోయిన తల్లిదండ్రులు చిన్న వయసులోనే హేమంత్ మృతి చెందడంతో తల్లిదండ్రులు వెంకటేష్, రజిత తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయిన ఆ తల్లిదండ్రుల రోదనలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. బంధువులు, గ్రామస్తులు కన్నీటిపర్యంతమవుతూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాలుడి మృతితో పూసూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రంపచోడవరంలో యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ

రంపచోడవరంవెలుతురు అక్టోబర్ 08: : పోక్స్ పేట, ఎర్రంపాలెం పరిసర ప్రాంతాల్లో ఎర్రమట్టి మాఫియా యథేచ్ఛగా రెచ్చిపోతోంది. మైదాన ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు రెవెన్యూ, మైనింగ్ శాఖల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి పూట జెసిబిలతో కొండలను తవ్వేస్తూ ఎర్రమట్టిని ట్రాక్టర్లు, లారీల్లో వేసుకుని తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కడియంలో నర్సరీలకు ఎర్రమట్టికి భారీ డిమాండ్ ఉండటంతో లారీలు తో అమ్ముకుంటున్నట్లు సమాచారం. నిజానికి ఎర్రమట్టి కూడా మైనర్ మినరల్ కిందకే వస్తుంది కాబట్టి తవ్వకాలకు జిల్లా మైనింగ్ శాఖ నుండి కచ్చితంగా లీజు తీసుకోవాలి, రెవెన్యూ శాఖ నుండి ఎన్ఓసి, ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఐటిడిఎ అనుమతి, అటవీ సరిహద్దు కావడంతో ఫారెస్ట్ అనుమతి, హెక్టారు దాటితే పర్యావరణ అనుమతి తీసుకోవాలి, అంతేకాక ప్రతి వాహనానికి ఆన్ లైన్ ట్రాన్సిట్ పాస్, ఈ-పర్మిట్ ఉండాలి, ప్రభుత్వానికి సీనరేజ్ ఫీజు కట్టాలి. కానీ ఇక్కడ వీటిలో ఒక్క అనుమతి కూడా లేకుండానే రాత్రి పది గంటల తర్వాత తవ్వకాలు మొదలుపెట్టి

తెల్లవారుజాము వరకు యథేచ్ఛగా తరలిస్తున్నా రంపచోడవరం రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం పట్టించుకోకుండా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారి స్పందించి రాత్రిపూట ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమ వాహనాలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విదేశాల్లోనూ తెలంగాణ సంస్కృతి వెలుగు

- మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అభినందనీయం
- స్విట్జర్లాండ్‌లో తెలుగు సంఘం వెబ్‌సైట్, బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ
- ఈ నెల 24న తెలంగాణ ప్రభుత్వ సహకారంతో బతుకమ్మ ఉత్సవాలు

స్విట్జర్లాండ్, వెలుతురు అక్టోబర్ 8 : విదేశాల్లో స్థిరపడినా మాతృభాషను, సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా కాపాడుతుండటం హర్షించదగ్గ విషయమని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చిన్నపిల్లలకు తెలుగు భాష నేర్పిస్తూ, బతుకమ్మ, బోనాలు వంటి ఉత్సవా లను నిర్వహిస్తూ భాషా సంస్కృతిని స్విట్జర్లాండ్‌లో ఇనుమడింపజేయడం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో పర్యటించింది. స్పీకర్ మిత్రులు బ్రహ్మానంద రెడ్డి బావిగడ్డ ఆహ్వానం మేరకు అక్కడి ప్రవాస తెలుగు భారతీయులతో ఆయన భేటీ అ-య్యారు. ఈ సంద ర్భంగా స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం ప్రవాస తెలుగు సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. స్విట్జర్లాండ్‌లో నిర్మించబోయే శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం గురించి స్విట్జర్లాండ్ తెలుగు సంఘం ప్రతినిధులు స్పీకర్ బృందానికి వివరించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు, సహాయ సహకారాల గురించి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతినిధులతో మాట్లాడి అవసరమైన సహ కారం అందిస్తామని స్పీకర్ ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. బతుకమ్మ ఉత్సవం కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళా శక్తికి, ప్రకృతితో మమేకమైన జీవనానికి ప్రతీక అని స్పీకర్ పేర్కొన్నారు. ప్రతి ఏటా స్విట్జర్లాం డ్‌లో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహి స్తున్నందుకు సంఘం ప్రతినిధులను స్పీకర్ బృందం అభినందించింది. ఈ నెల 24న స్విట్జర్లాండ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని స్పీకర్ పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా హాజరుకానున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు, స్పీకర్ ఓఎస్డీ వెంకటేశం, స్విట్జర్లాండ్ తెలుగు సంఘం అధ్యక్షుడు కిరణ్ వేదాంతం, కార్యదర్శి హరి ప్రసాద్, ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థల అధ్యయనం

స్విట్జర్లాండ్ దేశంలోని బెర్న్ సిటీలో ఉన్న చారిత్రా త్మక పార్లమెంట్ భవనాన్ని తెలంగాణ శాసనసభ సభాపతి (స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మం డలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ గురువారం సందర్శించారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసి యేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్య టనలో భాగంగా తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతిని ధుల బృందం స్విట్జర్లాండ్ పార్లమెంట్ భవనాన్ని సందర్శించింది. స్విట్జర్లాండ్ పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, శాసనసభల పనితీరు, చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజాప్రతి నిధుల బాధ్యతలు వంటి అంశాలపై అధ్యయనం చేయడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు తెలిపారు.

మాలిక్యూల్స్ మిర్రర్ ఇమేజ్ కనిపెట్టేశారు

-ఇద్దరు సైంటిస్టులకు నోబెల్ అవార్డ్

న్యూఢిల్లీ, అక్టోబరు 8వెలుతురు అక్టోబర్ 8 : : మాలిక్యూల్స్ మిర్రర్ ఇమేజెస్ చిక్కుముడి విప్పిన శాస్త్రవేత్తలు హెన్రీ బి కేగన్, కెన్సో సోయిలను ప్రతిష్ఠాత్మక నోబెల్ వరిం చింది. రసాయన శాస్త్రంలో వీరిద్దరినీ ఈ ఏడాది పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ స్టాక్‌హోంలో కటించింది. అణువుల హోమోకైరాలిటీ దానంతటదే స్వాభావి కంగా ఎలా ఆవిర్భవిస్తుందన్నది శాస్త్రవేత్తలను శతా బ్ద కాలానికి పైగా వేధించిన ప్రశ్న. దానికి సమాధా నాన్ని కేగన్, సోయి తమ విశేష కృషితో కనుగొ న్నారని నోబెల్ కమిటీ (కెమిస్ట్రీ) ఛైర్మన్ హీనర్ లింకె పేర్కొన్నారు. వారు అభివృద్ధి చేసిన రసాయనిక చర్యలు అద్భుతమైన వంటూ ప్రశంసించారు హీనర్. ఈ శాస్త్రవేత్తల ద్వయం కృషి ఆధునిక ఔషధ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించింది. లెక్కలేనన్ని ఔషధాల అభివృద్ధికి బాటలు పరిచింది. 95 ఏళ్ల కేగన్ ఫ్రాన్స్‌లో జన్మించారు. ఓర్సేలోని పారిస్-సుడ్ యూనివర్సిటీతో అనుబంధం కలిగి ఉన్నారు. జపాన్‌లో జన్మించిన సోయి (76) టోక్యో యూని వర్సిటీ ఆఫ్ సైన్స్‌కు అనుబంధంగా పనిచేస్తున్నారు. నోబెల్ పురస్కారంతో దక్కే దాదాపు రూ.11.5 కోట్ల నగదు బహుమతిని వీరిద్దరూ పంచుకోనున్నారు. మాలిక్యూల్స్ చూసేందుకు ఒకేలా ఉంటాయి. కానీ నిజానికి అవి ఒక్కటి కావు.. మన కుడి, ఎడమ చేతుల్లా వేర్వేరు వెర్షన్లు. రెండు చేతులూ ఒకలా ఉండవు. కానీ అవి ఒకదానికొకటి దర్పణ ప్రతిబిం బాలు. కర్బన రసాయన శాస్త్రంలో ఈ గుణాన్ని 'కైరాలిటీ' అని పిలుస్తారు. ప్రొటీన్‌ల నిర్మాణాత్మక అణువులైన అమైనో ఆమ్లాలు పరస్పర ప్రతిబింబా లుగా ఉండే రెండు రూపాల్లో ఉంటాయి. అయితే భూమిపై జీవులన్నీ ఈ రెండింటిలోని ఒకే ఒక రూపంతో పనిచేస్తాయి. దర్పణ ప్రతిబింబాన్ని కాకుండా.. అవసరమైన సరైన రూపాన్ని మాత్రమే ప్రకృతి ఎలా తయారుచేసుకుంటోందనే ప్రశ్నకు కేగన్, సోయి సమాధానం కనుగొన్నారు. అంటే.. జీవుల్లో సౌష్ఠవరాహిత్యం వెనుక రసాయనిక గుట్టును వారు ఛేదించారన్నమాట. తొలుత రసాయ నిక చర్యలను నియంత్రించే విధానాన్ని కేగన్ 1980 ల్లో కనుగొన్నారు. కావాల్సిన రకం అణువులను.. అప్పటివరకూ సాధ్యమవుతుందని ఊహించినదాని కంటే ఎక్కువగా ఆయన ఉత్పత్తి చేయగలిగారు. ఆపై సోయి మరో అడుగు ముందుకేశారు. అవసరమైన రకం అణువులను మాత్రమే (హోమోకైరాలిటీ) ఉత్పత్తి చేసే రసాయనిక చర్యను అభివృద్ధి చేశారు. ప్రయోగశాలల్లో హోమోకైరాలిటీని తొలిసారి సుసాధ్యం చేసిన ఘనత సోయిదే. కెమిస్ట్రీ చరిత్రలో అత్యంత అద్భుత ప్రయోగాల్లో ఒకటిగా దీన్ని పరిగణిస్తుంటారు. సాధారణంగా ప్రయోగశాలల్లో నిర్వహించే రసాయనిక చర్యల్లో కుడి, ఎడమ అణువులు రెండూ దాదాపు 50-50 నిష్పత్తిలో తయారవుతుంటాయి. వాటితో ఔషధాలు తయారు చేయడం ఒక్కోసారి ప్రమాదకరంగా మారొచ్చు. ఎందుకంటే- ఒక రకం అణువులు వ్యాధిని నయం చేసే గుణాన్ని కలిగి ఉంటే.. మరో రకం అణువులు హానికారకం కావొచ్చు. ఉదయాన్నే వికారం (మార్నింగ్ సిక్‌నెస్)తో బాధపడే గర్భిణీలకు 1950 ల్లో థలిడోమైడ్ అనే ఔషధాన్ని వైద్యులు సిఫార్సు చేసేవారు. అయితే అదొక కైరల్ అణువు. కుడి చేతి వెర్షన్ మంచి ఔషధంగా పని చేస్తుంది. ఎడమ చేతి రూపం తీవ్ర విషపూరితమైనది. అప్పట్లో ఉత్పత్తి చేసిన థలిడోమైడ్ తీసుకున్న గర్భిణులకు పుట్టిన పిల్లల్లో తీవ్ర వైకల్యాలు తలెత్తాయి. అలాంటి దుష్పరిణామాలు ఎదురుకాకుండా నివారించడంలో కేగన్, సోయిల కృషి బాగా ఉపయోగపడింది. ఎంపిక చేసిన అణువులను తయారుచేసుకొని.. వాటితో ఔషధాలు తయారుచేయగలుగుతున్నారు.

మండుతున్న ఎండలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 8 : తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతు పవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగా యి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సి యస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూ బ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఓటు చోరీ ఆరోపణలపై

సమగ్ర విచారణ జరపాలి

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- రాజ్‌ఘాట్ వద్ద కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలతో కలిసి మల్లు రవి ధర్నా

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 8 : ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును కాపాడేందుకు, రాజ్యాంగ పరిరక్షణ కోసం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలతో కలిసి న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద శాంతియుత ధర్నాలో పాల్గొన్నారు. ఎన్నికల ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, 'ఓటు చోరీ'పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బాధ్యత వహిస్తూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ సాక్షిగా దేశ ప్రజల ఓటు హక్కును పరిరక్షించాలనే సంకల్పంతో ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఓటుకు విలువ ఉండాలని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలని పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

టీ పీసీసీ చీఫ్ సహా పలువురు మంత్రుల అరెస్ట్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 8: : హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలు ముమ్మాటికీ అక్రమమని, అప్రజాస్వామిక మని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టి

పారదర్శకమైన ప్రక్రియను చేపట్టే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం వీధిపోరాటాలు చేస్తుందని తేల్చిచెప్పింది. ముట్టడి నేపథ్యంలో రాజ్‌భవన్, లోక్ భవన్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా భద్రతను పెంచారు.

తెలంగాణ టార్గెట్ చేశారు

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పోరాటం ఆగదన్న రేవంత్

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

తీర్థ, ప్రసాదాలు తిన్నట్టు నటిస్తారు

టీటీడీ బోర్డు రద్దు చేస్తాం

తిరుపతి, వెలుతురు అక్టోబర్ 8 : మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇవాళ తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొందరు ఆలయాలకు వెళ్లినప్పుడు అర్చకులు తీర్థం ఇస్తే, తాగినట్లు నటిస్తూ వేళ్ల సందుల్లోంచి కిందకు వదిలేస్తారని, ఇదే వారు పాటించే సెక్యులరిజం అని ఆయన విమర్శించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన, తాను స్వచ్ఛమైన హిందువునని, ఇతర మతాల ప్రార్థనా స్థలాలకు కూడా వెళతానని అన్నారు. ఈ సందర్భంగా ఏపీలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసేలా తమ పార్టీ ఉంటుందని తెలిపారు. అధికార టీడీపీ కూటమి, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తర్వాత తమ పార్టీ మూడో ప్రధాన శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిలబడుతూ, ప్రభుత్వం, ప్రతిపక్షంపై నిర్మాణాత్మక విమర్శలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై కూడా సాయిరెడ్డి స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లడ్డూ తయారీలో అక్రమాలు జరిగాయని అంగీకరించారు. అయితే, ప్రసాదంలో జంతు కొవ్వు ఉందన్న ఆరోపణలను ఆయన గట్టిగా ఖండించారు. తాము కిలో నెయ్యిని రూ. 320-400 మధ్య కొంటే, ప్రస్తుత ప్రభుత్వం రూ. 658కి కొంటోందని, బహిరంగ మార్కెట్‌లో స్వచ్ఛమైన నెయ్యి ధర రూ. 1,000 పైనే ఉందని పేర్కొంటూ నెయ్యి నాణ్యతను ప్రశ్నించారుకడప జిల్లాలోని కొన్ని ఆలయాల్లోకి

ఇప్పటికీ దళితులను అనుమతించడం లేదని ఆరోపించిన ఆయన... తమ పార్టీ అధికారంలోకి వస్తే అలాంటి వివక్ష చూపేవారికి కఠిన శిక్షలు, జైలు శిక్ష తప్పవని హెచ్చరించారుహిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా తాము రాబోతున్నామని స్పష్టం చేసిన విజయసాయిరెడ్డి, తమ పార్టీ అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిని పూర్తిగా రద్దు చేస్తామని సంచలన ప్రకటన చేశారు. ఇకపై టీటీడీ బోర్డులో రాజకీయ నాయకులకు ఎలాంటి ప్రవేశం ఉండదని, కేవలం పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలతోనే ధార్మిక బోర్డును ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, తిరుపతి క్షేత్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయడంతో పాటు, ప్రపంచస్థాయి హిందూ ధార్మిక సంస్థను తిరుపతిలో నెలకొల్పుతామని భారీ హామీలు ఇచ్చారు. వైఎస్ జగన్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ గారూ.. మీకు రెడ్ల ఓట్లు నిజంగా కావాలనుకుంటే మళ్లీ స్వధర్మానికి, హిందూ మతానికి తిరిగి రండి. అప్పుడే మీ పేరులోని జగన్మోహన్ రెడ్డి అనే పదానికి నికరమైన సార్థకత చేకూరుతుంది అని హితవు పలికారు. ఇదే క్రమంలో విదేశీ అక్రమ వలసలు, రోహింగ్యాల అంశంపై సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, బర్మా నుంచి వచ్చిన అక్రమ రవాణాదారులు ఏపీలోని గ్రామాల్లో నివసిస్తున్నారని, దీనివల్ల పౌరులు మైనారిటీలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఓటర్ల జాబితా నుంచి నిజమైన పౌరుల పేర్లు తీస్తే తప్పే కానీ, ఇటువంటి డూప్లికేట్ ఎంట్రీలు, అక్రమ సెటిలర్ల పేర్లను తొలగించడంలో ఎలాంటి తప్పులేదని సమర్థించారు. ఇక తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం, నెయ్యి కొనుగోలు వివాదంపై చంద్రబాబు ప్రభుత్వాన్ని విజయసాయిరెడ్డి నిలదీశారు. మార్కెట్‌లో కిలో మంచి నెయ్యి ధర రూ. 1000 ఉంటే, ఇందాపూర్ డైరీ పేరుతో కేవలం రూ. 658 లకే తిరుమలకు నెయ్యిని ఎలా సప్లై చేస్తున్నారని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిలో నెయ్యిని రూ. 320 నుంచి రూ. 411 మధ్య కొనుగోలు చేశారని గుర్తుచేసిన ఆయన, కిలోకు రూ. 250 చొప్పున అన్‌అఫీషియల్ పేమెంట్లు జరిగాయని వస్తున్న ఆరోపణలపై కూటమి ప్రభుత్వం నోరు విప్పాలని, చంద్రబాబు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్ మీట్ ద్వారా విజయసాయిరెడ్డి అటు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని, ఇటు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఒకేసారి టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో హిందూత్వ కార్డ్, టీటీడీ ప్రక్షాళన అంశాలే ప్రధాన అజెండాగా తమ కొత్త పొలిటికల్ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందనే స్పష్టమైన సంకేతాలను ఆయన ఈ సమావేశం ద్వారా పంపించారు.

డీప్ ఫేక్‌తో చేస్తున్నారు

ఎన్టీఆర్‌కు సజ్జనార్ రిక్వెస్ట్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 8: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర చిత్రంలోని చుట్టమల్లే పాటను అసభ్యంగా ఎడిట్ చేశారనే ఆరోపణలతో దొండ హర్ష కుమార్ రెడ్డిని హైదరాబాద్ సిటీ పోలీసులు అరెస్ట్ చేశారని, అందుకు పోలీసులకు ధన్యవాదాలు తెలుపుతున్నామంటూ సోషల్ మీడియాలో ఒక ఫోటోతో కూడిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయ్యింది. అయితే, ఈ వైరల్ ఫోటోపై కమిషనర్ వి.సి. సజ్జనార్ స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించారు. ఆ ఫోటో పూర్తిగా కృత్రిమ మేధస్సు ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ ఇమేజ్ అని, నిజమైన చిత్రం కాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వేగంగా వ్యాప్తి చెందుతున్న ఈ అసత్య ప్రచారంపై సజ్జనార్ క్లారిటీ ఇస్తూ హెచ్చరిక జారీ చేశారు. ఇది ఏఐ ద్వారా రూపొందించిన చిత్రం, నిజమైన ఫోటో కాదు. ఇటువంటి డీప్‌ఫేక్ చిత్రాలను నమ్మవద్దు , వాస్తవాలను నిర్ధారించుకోకుండా వాటిని షేర్ చేయవద్దు అని నెటిజన్లను కోరారు. ఏఐ సాంకేతికత అందుబాటులోకి వచ్చాక డిజిటల్ ఫోటోలు అత్యంత సహజంగా కనిపిస్తున్నాయని, స్క్రీన్‌పై కనిపించే ప్రతిదాన్నీ గుడ్డిగా నమ్మకుండా ప్రశ్నించడం, సత్యాసత్యాలను పరిశీలించడం నేటి కాలంలో అత్యంత కీలకమని ఆయన అన్నారు. ఫ్యాక్ట్ చెకింగ్ చేయకుండా కంటెంట్‌ను రీట్వీట్ చేయడం లేదా షేర్ చేయడం వల్ల సమాజంలో తప్పుడు సమాచారం అత్యంత వేగంగా వ్యాపిస్తుందని సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఇంటర్నెట్ వినియోగదారులు సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు , పరువు నష్టం కలిగించే ఏఐ క్రియేషన్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా వార్త లేదా ఫోటోను సామాజిక

మాధ్యమాల్లో పంచుకునే ముందు దానికి సంబంధించిన అధికారిక మూలాలను సరిచూసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో, తన చిత్రాన్ని లేదా పేరును దుర్వినియోగం చేస్తున్న తీరుపై సజ్జనార్ నేరుగా కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ ఒక కీలక విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ గారూ , మీ అభిమానుల్లో కొందరు నా ఫోటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న విషయాన్ని గమనించగలరు అని పేర్కొన్నారు. అభిమానుల పేరుతో ఇటువంటి ఏఐ డీప్ ఫేక్ చిత్రాలను రూపొందించి ప్రచారం చేయడాన్ని అరికట్టేలా అవగాహన తెచ్చేందుకు చొరవ చూపాలని సజ్జనార్ కోరారు. సోషల్ మీడియాలో ముసుగులో జరుగుతున్న ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్ సైబర్ నేరాల తీవ్రతకు ఈ సంఘటన ఒక నిదర్శనంగా నిలిచింది.

ఢిల్లీలో చంద్రబాబు బిజీబిజీ

కేంద్రమంత్రులతో చర్చలు

- ప్రాజెక్టుల పురోగతిని సీఆర్ పాటిల్‌కు వివరించిన చంద్రబాబు
- ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు పలు వినతులు
- అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పూర్తికి సహకరించాలని గడ్కరీని కోరిన బాబు

మోదీకి బాబు శుభాకాంక్షలు..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలను ప్రస్తావిస్తూ.. దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, సుపరిపాలనతో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక పరిస్థితి, నీటిపారుదల, మౌలిక వసతులు, కరువు పరిస్థితులు సహా పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గోదావరి-కావేరి నదుల అనుసంధా నాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసుకుని వికసిత్ భారత్ లక్ష్యం వైపు దేశాన్ని నడిపిస్తున్నారని చంద్రబాబు అభినందించారు. గోదావరి వరద జలాల్లో కొంత భాగాన్ని సమర్థంగా వినియోగించి దక్షిణాది రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చేలా నదుల అనుసంధానం పై సాంకేతిక అధ్యయనం చేపట్టాలని చంద్రబాబు ప్రతిపాదించారు.

న్యూఢిల్లీ, వెలుతురు:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన పెండింగ్ అంశాలపై ఈ భేటీలో చర్చించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై కేంద్రం దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అమిత్ షాను ఆయన విజ్ఞప్తి చేశారు. జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన ఇతర అంశాల పురోగతిపై కూడా ఈ సందర్భంగా సమీక్ష జరిపినట్లు సమాచారం. రాష్ట్ర విభజన హామీలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించడంలో కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది.

ప్రాజెక్టుల పురోగతిని సీఆర్ పాటిల్‌కు వివరించిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కీలక జల ప్రాజెక్టుల పురోగతిని, నిధుల అవసరాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ముఖ్యంగా పోలవరం, జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.30,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార' పథకం వివరాలను చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకుగాను ఇప్పటికే 62 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఈ కొత్త పథకం ద్వారా మరో 27 లక్షల కుటుంబాలకు నీటి కనెక్షన్లు అందించడమే లక్ష్యమని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కూడా ఇరువురు నేతలు సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా సాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా కేంద్రం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు నదుల అనుసంధానం అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. రెండు రోజుల పర్యటన నిమిత్తం చంద్రబాబు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు.

ఆర్థిక మంత్రికి వినతులు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు. పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పూర్తికి సహకరించాలని గడ్కరీని కోరిన బాబు

ఏపీ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. 189 కిలోమీటర్ల పొడవైన ఓఆర్ఆర్ రాజధాని ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకం అవుతుందని సీఎం పేర్కొన్నారు.

ఐటీ వింగ్‌తో లోకేష్ మీటింగ్

విజయవాడ, వెలుతురు అక్టోబరు 8:



వ్యక్తులు కాదు, వ్యవస్థే ప్రధానమనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ఐటీ వింగ్ (ఐటీడీపీ) పనిచేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఐటీడీపీ విభాగంపై నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఐటీడీపీ ఒక వారధిగా నిలవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూనే, సోషల్ మీడియాలో ప్రత్యర్థులు చేసే అసత్య ప్రచారాలను ఆధారాలతో సహా తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. ఐటీడీపీ కమిటీల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని లోకేశ్ ఆదేశించారు. విభాగంలోని ప్రతి సభ్యుడిని 'మై టీడీపీ యాప్'తో అనుసంధానించాలని స్పష్టం చేశారు. పార్టీలోని ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఐటీడీపీ మరింత పటిష్ఠంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ముఖ్యనేత చింతకాయల విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు మేయర్ అభ్యర్థి ఖరారు...

నెల్లూరు, వెలుతురు అక్టోబరు 8:

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరానికి సంబంధించి అధికారిక నోటిఫికేషన్, రిజర్వేషన్ల ప్రక్రియ ఇంకా కొలిక్కి రాకముందే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ ఆనం విజయ్‌కుమార్ రెడ్డి పేరును పార్టీ తరపున అధికారికంగా ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైసీపీ ప్రకటించిన మొట్టమొదటి మేయర్ అభ్యర్థి ఆనమే. ఆనం కుటుంబంలో చాలా కాలం క్రితమే చీలిక వచ్చింది. ఆనం విజయ్ కుమార్ రెడ్డితో ఇతర సోదరులకు సంబంధాల్లేవు. విజయ్‌కుమార్ రెడ్డి చాలాకాలంగా పార్టీలోనే కొనసాగుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల వేళ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీలోకి ఫిరాయించడంతో, నెల్లూరు రూరల్ బాధ్యతలను జగన్ ఆయనకే అప్పగించారు. అటు ఆనం విజయ్‌కుమార్ రెడ్డి సతీమణి అరుణమ్మ గతంలో నెల్లూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆనం కుటుంబానికి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాత పరిచయాలు, బలమైన క్యాడర్ బలం కార్పొరేషన్ పోరులో పార్టీకి ఉపయోగపడుతుందన్న లెక్కలతోనే జగన్ ఈ ముందస్తు ప్రకటన చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నెల్లూరు వైసీపీలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఆదాల ప్రభాకర్ రెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డి వర్గాల మధ్య సమన్వయం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ఎవరి వాదన వినకుండా ఆనం విజయ్ కుమార్ ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల నగరంలోని ఇతర వర్గాల ఆశావహులు, ద్వితీయ శ్రేణి నేతలు ఏ మేరకు సహకరిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. టీడీపీ తరపున నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ, రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు ఎమ్మెల్యేలుగా చక్రం తిప్పుతూ క్షేత్రస్థాయిలో తిరుగులేని పట్టు సాధించారు. ధీకార పక్షాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక, అంగబలాన్ని సమకూర్చుకోవడం వైసీపీకి పెను సవాలే. అంతర్గత గ్రూపు విభేదాలను చక్కదిద్దకుండా, రిజర్వేషన్లు తేలకుండానే ముందస్తుగా విసిరిన ఈ మేయర్ పాచికతో జగన్ పార్టీ కేడర్‌ను ఎన్నికల సమరానికి సిద్ధం చేయగలరా లేక అసంతృప్తుల రూపంలో కొత్త తలనొప్పులు కొనితెచ్చుకున్నారా అన్నది వేచి చూడాలి.

సర్వేశ్వరుడి సేవలో సినీనటి అనన్య

శ్రీకాళహస్తి, వెలుతురు అక్టోబర్ 8:

శ్రీకాళహస్తీశ్వరాలయంకు సినీనటి అనన్య కుటుంబ సభ్యులతో కలసి ఆలయంకు విచ్చేశారు. గురువారం రాహుకాల సమయం రాహు కేతు కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకు న్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్ర పటం తీర్థ ప్రసాదాలు ఆలయ మాజీ పాలక మండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యాం, సతీమణి లిఖిత చౌదరి సినీనటి అనన్యకు అందజేశారు. ఆలయం వెలుపల జర్నీ మూవీ ఫేమ్ నటి అనన్యను చూసిన అభిమానులు ఆమెతో చరవాణిలో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అందరితో ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో దినేష్, సోహెల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- స్కూటర్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి అక్కడికక్కడే మృతి

మచిలీపట్నం, వెలుతురు: కృష్ణాజిల్లా మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారిపై నిమ్మకూరు సమీపంలోని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు స్కూటర్‌పై వస్తున్న దాసరి అజయ్ కుమార్ను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్ కుమార్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. మృతుడు న్యాయవాదిగా తెలుస్తోంది. అదే సమయంలో కారులో ఉన్న వ్యక్తులు కూడా న్యాయవాదులుగా తెలుస్తోంది. ప్రమాదం అనంతరం వారి వెనుక వస్తున్న మరో కారు అదుపుతప్పి ముందున్న కారును ఢీకొనడంతో రెండు కార్లు దెబ్బతిన్నాయి. కార్లలో ఉన్న క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పామర్రు ఎస్ఐ డి. శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోదావరిలో గల్లంతై.. ఆరేళ్ల హేమంత్ మృతి

- పూసూరులో విషాదఛాయలు

వాజేడు, వెలురుతురు: గోదావరిలో గల్లంతైన ఆరేళ్ల బాలుడు మృతి చెందిన విషాద సంఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పూసూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రులు, బంధువుల రోదనలు గ్రామంలో విషాదాన్ని నింపాయి. గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్-రజిత దంపతుల కుమారుడు కుమ్మరి హేమంత్ (6) గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మరో బాలుడితో కలిసి బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం గోదావరి వైపు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయి గల్లంతైనట్లు సమాచారం. హేమంత్ ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అతనితో పాటు వెళ్లిన మరో బాలుడిని విచారించగా గోదావరిలో గల్లంతైన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామస్తులు వెంటనే గోదావరి వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటి తర్వాత గాలింపు చర్యల్లో హేమంత్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

బిల్డ్ ఏపీకి పెద్ద ఎత్తున మద్దతు

- భారత ప్రగతిలో ఏపీది కీలక పాత్ర: పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబరు 8:

బిల్డ్ ఏపీ' నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు. 28 నెలల్లో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. కేవలం అవగాహన ఒప్పందాల (ఎంవోయూ)కే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పెట్టుబడులుగా మార్చేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఎస్క్రో ఖాతాను నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. పెట్టుబడులకు అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అన్ని అనుమతులు వేగంగా అందిస్తున్నామని తెలిపారు. నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నీటి కొరత తీర్చవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా, రాష్ట్రాన్ని సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా మార్చడమే ధ్యేయమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 110 గిగావాట్లకు ఒప్పందాలు కుదిరాయని, ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దుగరాజపట్నం, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కేంద్రాలు, తిరుపతి, కొప్పర్తిలలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాలనలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలవరం, అమరావతి నిర్మాణానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, భారత అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌ది చారిత్రక పాత్ర అని కొనియాడారు. శాతవాహనుల కాలం నుంచే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "టీమ్ ఇండియా"గా కలిసి పనిచేస్తున్నాయని, కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. 'ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష' అనే విధానాలతో దేశం ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఏపీఎస్ఆర్టీసీ 5,261 ప్రత్యేక బస్సులు

- రాష్ట్రవ్యాప్తంగా 5,261 సర్వీసుల ఏర్పాటు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయం

అమరావతి, వెలురుతురు: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేస్తోంది. పండుగ సీజన్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి మొత్తం 5,261 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులకు ఊరటనిస్తూ, ఈ ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా సాధారణ ఛార్జీలనే వసూలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక సర్వీసులు అక్టోబర్ 16 నుంచి 25వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. పండుగకు ముందు, అనగా అక్టోబర్ 16 నుంచి 19 వరకు 3,207 బస్సులను, పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 20 నుంచి 25 వరకు 2,054 సర్వీసులను నడపనున్నారు. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పెద్ద సంఖ్యలో బస్సులను కేటాయించారు. అత్యధికంగా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు 1,186 బస్సులు నడుపుతుండగా, విజయవాడకు 1,053, బెంగళూరుకు 475, విశాఖపట్నానికి 440 బస్సులు కేటాయించారు. అలాగే రాజమండ్రికి 347, తిరుపతికి 247, చెన్నైకి 153 సర్వీసులు నడపనున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే, ఎన్టీఆర్ జిల్లా నుంచి అత్యధికంగా 804 ప్రత్యేక సర్వీసులు నడపనుండటం గమనార్హం. ఈ ఏడాది దసరా ఉత్సవాలు అక్టోబర్ 11న ప్రారంభం కానుండగా, 20న విజయదశమి పర్వదినం జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాల అధికారులు సూచిస్తున్నారు.

పోలేరమ్మ జాతరలో పాల్గొన్న కాకాణి

వెలుతురు, నెల్లూరు జిల్లా:

నెల్లూరు జిల్లా,పొదలకూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్న పోలే రమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు "డా" కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొదలకూరుకి విచ్చేసిన కాకాణికి వైయస్సార్ సిపి నేతలుమేళ తాళాలతో బాణాసంచా కాల్పులతో ఘన స్వాగతం పలికారు. అమ్మ వారిని దర్శించుకున్న అనంతరం కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం చాలా కాలం తర్వాత వైభవంగా నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. పొదలకూరు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి అత్యంత విశిష్టమైన స్థానం ఉందని కాకాణి గుర్తుచేశారు. ప్రజలు ఏ శుభకార్యం ప్రారం భించాలన్నా ముందుగా పోలేరమ్మ అమ్మవారిని స్మరించుకోవడం, అమ్మవారి సన్నిధిలో మొక్కులు తీర్చుకోవడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఊరి ప్రజలందరూ ఒక్కటై, ఒకే త్రాటిపై నిలిచి పోలేరమ్మ తల్లి ఉత్సవాన్ని ఒక వేడుకలా నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. పోలేరమ్మ తల్లి సంకల్పం, ఆశీస్సులతోనే ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిందని కాకాణి తెలిపారు.

విలువిద్యకు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, వెలుతురు:

హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఆర్చరీ ప్రీమియర్ లీగ్ కార్యక్రమానికి హాజరు కావడం గర్వకారణంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి, ఇతిహాసాల్లో విలువిద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి పేర్కొన్నారు. రామాయణం, మహాభారత కాలం నుంచే విలువిద్యకు విశిష్ట స్థానం ఉందని తెలిపారు. ఏకలవ్యుడు, అర్జునుడు, ద్రోణాచార్యుడు వంటి మహనీయులు విలువిద్యలో ఆరితేరిన వారని గుర్తుచేశారు.

విలువిద్య వంటి క్రీడలను ప్రోత్సహిం చడం ద్వారా యువతలో ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతాయని మంత్రి అన్నారు. తెలంగాణలో క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఆర్చరీ ప్రీమియర్ లీగ్ వంటి ప్రతిష్టాత్మక పోటీలు దేశంలో విలువిద్యకు మరింత ప్రాచుర్యం తీసుకురావడంతో పాటు, యువ క్రీడాకారులకు స్ఫూర్తిని స్తాయని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. క్రీడా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో ఆర్చరీ లో గోల్డ్ మెడల్ సాధించిన చికితా రావు తో పాటు వివిధ దేశాలకు చెందిన ఆర్చరీ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.

'ఓటు చోరీ' ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు!

- బారికేడ్లతో ప్రజాస్వామ్యాన్ని బంధించలేరు
- రాహుల్-ప్రియాంకల పోరాటం దేశవ్యాప్త ప్రజాస్వామ్య చైతన్యానికి స్ఫూర్తి
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు:

'ఓటు చోరీ' ఆరోపణలపై సమాధానం అడిగిన ప్రజాప్రతినిధులను నిర్బంధించడం అధికార దర్పానికి నిదర్శనమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితాలపై వచ్చిన ప్రశ్నలకు బారికేడ్లు సమాధానం కావు. ప్రజల విశ్వాసాన్ని పోలీసు బలంతో సంపాదించలేరు. ప్రతి ఓటు విలువను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని అరెస్టులు, కేసులతో అణచివేయాలని చూడటం కేంద్ర ప్రభుత్వ భ్రమ" అని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో ఢిల్లీలో జరిగిన నిరసనలు, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్న పరిణామాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన నేడిక్కడ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే నని డిమాండ్ చేశారు. ఎన్నికల పారదర్శకత కోసం రాహుల్ గాంధీ చూపుతున్న పట్టుదల, ప్రియాంక గాంధీ ప్రదర్శించిన ధైర్యం దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కుపై సందేహాలు తలెత్తినప్పుడు వాటికి సమాధానం కోరడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని స్పష్టం చేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎంపీ ఈటల రాజేందర్

సికింద్రాబాద్, వెలుతురు:

దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఎన్ హెచ్ ఎం కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు క్రమబద్ధీకరించి, పర్మినెంట్ ఉద్యో గులుగా కొనసాగిస్తున్నాయి. అయితే తెలంగా ణలో మాత్రం ఇంతకాలంగా సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఇప్పటివరకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించకపోవడం బాధాకరమని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. హెల్త్ డిపార్ట్మెంట్లో నేషనల్ హెల్త్ మిషన్ కింద వివిధ కేటగిరీల్లో పనిచేస్తు న్న దాదాపు 17 వేల మంది ఉద్యోగులు గత 15 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. వీరిలో డాక్టర్లు, నర్సులు, టెక్నికల్ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉన్నారని అన్నారు. ఎన్‌హెచ్‌ఎం పథకంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో ఉద్యోగుల విధివిధానాలు, ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలపై తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 13న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ముందు ఔఊఓ ఉద్యోగులు చేపట్టనున్న ధర్నాకు నా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నా అన్నారు.

వరద ముప్పు.. హైడ్రా చెక్

రంగంలోకి దిగిన హైడ్రా మెట్.. డీఆర్ఎఫ్ బృందాలు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్

ఫతేనగర్లో నాలా పూడికతీత పనులు

హైదరాబాద్, వెలుతురు:

వర్షం పడితే నీట మునిగే పరిస్థితి ఫతేనగర్ - బాలానగర్ పారిశ్రామిక వాడది. ఇప్పుడా పరిస్థితులు మారనున్నాయి. ఫతేనగర్ ప్రాంతాల్లో నాలా పూడిక తీత పనులను హైడ్రా ప్రారంభించింది. కల్వర్టుల వద్ద పూడిక తీస్తే సరిపోదని హైడ్రా గ్రహించింది. నాలా పొడుగునా పూడికను తొలగిస్తే తప్ప వరద ముప్పు తప్పదని భావించింది. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు హైడ్రా శ్రీకారం చుట్టింది. మాన్సూన్ ఎమర్జెనీ టీమ్(మెట్), డిజాస్టర్ రెస్పాన్స్ (డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దించింది. ఫతేనగర్ - బాలానగర్ పరిసరాల్లో పూడిక తీత పనులు ఎలా సాగుతున్నాయనేది హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య కూడా కమిషనర్ వెంట ఉన్నారు. ల్యాంగ్ ఆర్మ్ హ్యాండ్ జేసీబీతో పూడికను తొలగించే పనులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. నాలా పొడుగునా ఆక్రమణలుంటే గుర్తించి వెంటనే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. కాలువ ఆరంభంలో 25 మీటర్లు.. ఫతే నగర్ ప్రాంతాల్లో 40 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా కబ్జాలకు గురై కుంచించుకు పోయిందని హైడ్రా కమిషనర్ దృష్టికి స్థానిక అధికారులు తీసుకువచ్చారు. త్వరలోనే అక్కడి పారిశ్రామిక యూనిట్ల వారితో సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వరద కాలువకు అడుగడుగునా ఆటంకాలు..

పరికి చెరువు, ఐడీఎల్ చెరువు నుంచి వచ్చే కూకట్‌పల్లి వరద కాలువకు గౌతంనగర్ పరిసరాల్లో ఫాక్స్ సాగర్ వరద కాలువ కలుస్తుంది. ఆరంభంలో 25 మీటర్లు, తర్వాత 40 మీటర్లకు పైగా ఉండాల్సిన వరద కాలువకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడ్డాయి. ఫతేనగర్, బాలానగర్ పరిసరాల్లో పారిశ్రామిక వాడ లే ఔట్ ప్రకారం వరద కాలువ విస్తీర్ణం స్పష్టంగా పేర్కొన్నప్పటికీ.. ఎక్కడికక్కడ కబ్జాలకు గురై కుంచించుకుపోయింది. దీనికి తోడు పెద్దమొత్తంలో పూడిక పేరుకుపోవడంతో ఏమాత్రం వర్షం పడినా పరిసర ప్రాంతాలను ముంచెత్తడం సాధారణంగా మారింది. ఇదే వరద కాలువకు మురుగు నీటితో పాటు.. పారిశ్రామిక ప్రాంతాల నుంచి వ్యర్థ జలాలు కూడా తోడయ్యాయి. దీంతో ఆయా పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. భూగర్భ జలాలు కూడా కలుషితమై ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయమై బాలానగర్ పారిశ్రామిక వాడకు చెందిన వివిధ సంస్థల యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలువ హద్దుల ప్రకారం నిర్మాణాలు చేపట్టినా.. కొంతమంది ఆక్రమణలకు పాల్పడగా.. వరద సాఫీగా వెళ్లని పరిస్థితి ఉందని వాపోయారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికతో పాటు.. ఆక్రమణలను తొలగిస్తే చాలావరకు ఉపశమనం ఉంటుందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి పనులు వేగంగా జరగాలని ఆదేశించారు.

లారీల కొద్దీ పూడిక తొలగింపు

పరికి చెరువు - ఐడీఎల్ చెరువు నుంచి వచ్చే వరద కాలువలు కూకట్‌పల్లి వద్ద కలిసి భరత్‌నగర్ వంతెన పక్కనుంచి దీన్‌దయాల్ కల్వర్టు, ఫతేనగర్, బాలానగర్ శోభ కాలనీ, గౌతంనగర్, ఐజీపురం, బేగంపేట, ప్రకాష్‌నగర్ మీదుగా హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. ఫాక్స్ సాగర్ నుంచి జీడిమెట్ల మీదుగా వచ్చే వరద కాలువ గౌతంనగర్ పరిసరాల్లో కూకట్‌పల్లి నాలాలో కలుస్తుంది. ఇలా సాగే ఈ కాలువలో దశాబ్దాలుగా చెత్త పేరుకుపోయింది. దీంతో 4 నుంచి 5 సెంటీమీటర్ల వర్షం పడినా పరిశ్రామిక ప్రాంతాలతో పాటు నివాసాలు కూడా నీట మునుగుతుంటాయి. ఈ నాలాలో ఆరేడు అడుగుల మేర పూడిక పేరుకుపోయింది. కల్వర్టుల వద్ద పూడిక తొలగిస్తే సరిపోదని హైడ్రా గ్రహించింది. దీన్‌దయాల్‌నగర్ నుంచి దాదాపు 3 కిలోమీటర్ల మేర నాలా పొడుగునా పూడిక తొలగిస్తే చాలావరకు వరద ముప్పు తప్పించవచ్చునని హైడ్రా భావించింది. ఈ మేరకు మంగళవారం నుంచి పూడిక తీత పనులను ప్రారంభించింది. కల్వర్టు వద్దే లారీల కొద్దీ పూడిక బయట పడుతోంది. ఇలా మొత్తం తీస్తే చాలా పెద్దమొత్తంలో పూడిక బయట పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైడ్రా రంగంలోకి దిగడంతో ఫతేనగర్, బాలానగర్ పరిసర ప్రాంత పారిశ్రామిక వాడతో పాటు నివాస ప్రాంతాల వారు ఊరట చెందారు. పూడిక తీత పనులు పూర్తి స్థాయిలో జరుగుతాయని భావిస్తున్నారు. ఆక్రమణలు తొలగించడంలో తాము కూడా సహకరిస్తామని అక్కడి పారిశ్రామిక వాడలోని పలు యూనిట్ల యజమానులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సీఈసీ జ్ఞానేష్ రాజీనామా చేసేవరకు నిరంతర పోరాటం

- ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం కోల్పోయారు
- ఛలో లోక్‌భవన్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 08:

కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా వ్యవహరించకుండా, సర్ పేరుతో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చేసి, నిజమైన ఓటర్లను తొలగించే విధంగా వ్యవహరిస్తోందని, తద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అందువల్లే సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆగదని అన్నారు. ఓట్ల సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారంటూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమోక్రసీ' పిలుపులో భాగంగా టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 'చలో లోక్ భవన్ (రాజ్ భవన్)' ర్యాలీ నిర్వహించారు.

ప్రతి ఇంటా బతుకమ్మ సంబరం

- ప్రతి ఆడబిడ్డ ఆనందంగా బతుకమ్మ జరుపుకోవాలి
- పండుగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి
- అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి : మంత్రి సీతక్క

హైదరాబాద్, వెలుతురు:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా, ఆనందంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, తాగునీరు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతితో దానికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో తెలంగాణ బిడ్డలు బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సందర్భంగా రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని, పూలను, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కలిపి జరుపుకునే ప్రత్యేకమైన పండుగ అని పేర్కొన్నారు. "బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. మన సంస్కృతి, మన సంప్రదాయం, మన ప్రకృతితో ముడిపడిన పండుగ. ప్రతి ఆడబిడ్డ ఆనందంగా.. ప్రతి కుటుంబం సంతోషంగా.. ప్రతి గ్రామం సురక్షితంగా బతుకమ్మ జరుపుకునేలా ప్రజా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది" అని మంత్రి సీతక్క తెలిపారు.

ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ

బతుకమ్మ పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, జిల్లా పంచాయతీ అధికారులు, కలెక్టర్లు సమన్వయంతో పనిచేసి పండుగకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. గ్రామాలు, బతుకమ్మ ఆడే ప్రదేశాలు, చెరువులు, కుంటలు, ఘాట్‌ల పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. బతుకమ్మ ఆడే ఘాట్‌లకు వెళ్లే మార్గాలను పూర్తిగా శుభ్రం చేయాలని, రహదారులపై గుంతలు ఉంటే వెంటనే పూడ్చాలని సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు ఉండేలా అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.

అధికారుల సమన్వయంతో చర్యలు

బతుకమ్మ వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు పాల్గొంటారని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట్ల మెట్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతి

తెలంగాణలో పుట్టిన బతుకమ్మ పండుగ నేడు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని మంత్రి సీతక్క అన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్, మధ్యప్రాచ్యం, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో తెలంగాణ ప్రజలు బతుకమ్మను జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. "ఎక్కడ ఉన్నా తెలంగాణ బిడ్డల గుండెల్లో బతుకమ్మ ఉంటుంది. పూలను పేర్చి బతుకమ్మను నిలబెట్టినట్టే.. మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా తరతరాలకు నిలబెట్టుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఆడబిడ్డలంతా ఐక్యంగా, ఆనందంగా బతుకమ్మను జరుపుకోవాలి" అని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.తెలంగాణ పూల పండుగ బతుకమ్మ ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి కుటుంబంలో సంతోషాన్ని, ప్రతి గ్రామంలో ఐక్యతను నింపాలని మంత్రి సీతక్క ఆకాంక్షిస్తూ.. రాష్ట్రంలోని మహిళలందరికీ ముందస్తు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి
- రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టులకు నిరసనగా మందమర్రిలో మంత్రి వివేక్ ధర్నా
- ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పోరాడాలి
- ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదే

మందమర్రి, వెలుతురు:

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ప్రతిపక్ష ఎంపీలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ, ఓటర్ల జాబితాలో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి మందమర్రిలో గురువారం ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ..రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష ఎంపీల అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు, ఓట్ల తొలగింపుపై రాహుల్ గాంధీ గత రెండేళ్లుగా ప్రశ్నలు లేవనెత్తుతున్నారని మంత్రి తెలిపారు.

బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్నారని మంత్రి అన్నారు. ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీకి ఎన్నికల్లో ప్రయోజనం కల్పించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. "ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఓటర్ల జాబితాలో ఒక్క అర్హుడి పేరు కూడా అన్యాయంగా తొలగించకూడదు. ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత" అని మంత్రి అన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com